సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15 సంచిక: 155
గురువారం 25-8-2022
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLIGUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'


ప్రణయ్ సంచలనం
ప్రపంచ రెండో ర్యాంకర్ కెంటోపై గెలిచిన స్టార్ షట్లర్ - 12లో


డిస్కౌంట్ల పండగొచ్చింది..!
ఎలక్ట్రానిక్స్ నుంచి నిత్యావసరాల వరకు ఆఫర్లే.. ఆఫర్లు - 13లో


మీడియాను అణచివేసే కుట్ర
ఎన్‌డీటీవీని అదానీ కొనుగోలు చేయడం ద్వారా స్వతంత్ర మీడియాను అణిచేయడానికి బీజేపీ కుట్ర పన్నిందని కాంగ్రెస్ మండిపడింది.
వివరాలు 6లో


మా ప్రభుత్వాన్ని కూల్చే యత్నం
ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ఢిల్లీలో తమ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని ఆప్ ఆరోపించింది.
వివరాలు 6లో


జార్ఖండ్‌లో ఈడీ సోదాలు
జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌కు సన్నిహితుడైన ప్రేమ్ ప్రకాశ్ ఆస్తులపై ఈడీ దాడులు చేయగా ఏకే-47 రైఫిల్స్ బయట పడ్డాయి.
వివరాలు 6లో


అఖిలపక్షాన్ని ఎందుకు పిలవలేదు?
ఉచిత హామీలపై చర్చించడానికి అఖిల పక్షాన్ని ఎందుకు పిలవలేదని కేంద్రాన్ని సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ ప్రశ్నించారు.
వివరాలు 6లో

న్యూస్‌రీల్

బలపరీక్ష వేళ.. సీబీఐ సోదాలు



ఆర్జేడీ చీఫ్ లాలూ రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు జరిగిన కుంభకోణం కేసు దర్యాప్తును సరిగ్గా బిహార్‌లో నితీశ్ సర్కార్ బలపరీక్ష రోజే సీబీఐ వేగవంతం చేసింది. ఆర్జేడీ నేతల నివాసాలపై దాడి చేసింది. మరోవైపు బల నిరూపణలో నితీశ్ సర్కార్ నెగ్గింది.
వివరాలు 6లో ▸

'పల్లిపట్టు'కు యువ సాహిత్య పురస్కారం



మనుషుల మధ్య ఉన్న తారతమ్యాలపై చర్చ జరగాలని తన కవితల ద్వారా చాటిచెప్పిన పల్లిపట్టు నాగరాజుకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కింది. ఆయన రాసిన 'యాలై పూడ్సింది' కవితా సంపుటిని యువ సాహిత్య పురస్కారానికి ఎంపిక చేశారు.
వివరాలు 2లో ▸


ప్రకాశం జిల్లా చీమకుర్తిలో వైఎస్సార్, బీఎస్సార్ విగ్రహాలను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్. చిత్రంలో బూచేపల్లి కుటుంబ సభ్యులు, నాయకులు

ఏడాదిలో వెలిగొండ

ఈ ప్రాజెక్టును ప్రారంభించాకే ఎన్నికలకు వెళతాం

చీమకుర్తిలో వైఎస్సార్, బీఎస్సార్ విగ్రహాల ఆవిష్కరణలో సీఎం జగన్

- విజయవాడలో ఏప్రిల్ 14న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ
- చిన్న చిన్న గ్రానైట్ పరిశ్రమలకు ఊరట కలిగించేందుకే స్లాబ్ సిస్టమ్
- తద్వారా ప్రభుత్వంపై రూ.135 కోట్ల భారం.. యూనిట్ విద్యుత్‌కు రూ.2 రాయితీతో మరో రూ.210 కోట్ల భారం
- అయినా మీ మేలు కోసం భరిస్తున్నాం
- మొగిలిగుండాల రిజర్వాయర్‌కు బూచేపల్లి సుబ్బారెడ్డి పేరు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: వెలిగొండ ప్రాజెక్టును 2023 సెప్టెంబర్ నాటికి పూర్తి చేసి, జాతికి అంకితం చేస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల ప్రజల ఈ చిరకాల కోరికను తీర్చాకే 2024లో ఎన్నికలకు వెళతామని అన్నారు. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గంలోని చీమకుర్తిలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఆమె తనయుడు మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఏర్పాటు చేసిన దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి (బీఎస్సార్)ల
మిగతా 2వ పేజీలో ▶

స్కూళ్ల భద్రతపై దృష్టి

- నాడు–నేడు పూర్తి అయిన స్కూళ్లలో వాచ్‌మెన్ల నియామకం
- తొలి దశ పనులపై ఆడిట్ తప్పనిసరి
- ఉన్నత స్థాయి సమీక్షలో అధికారులకు సీఎం ఆదేశం

2లో

వరుసగా నాలుగో ఏడాదీ 'వైఎస్సార్ నేతన్న నేస్తం'

నేడు కృష్ణా జిల్లా పెడనలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ
2లో

రామోజీ.. రామ రామ!


ఏది నిజం?

భారీ దోపిడీ అంటూ దివాలా కోరు మాటలు

- గతేడాది అక్టోబర్‌లో ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన ఉత్తర్వుపై ఇప్పుడు శివాలు
- మార్గదర్శిపై సుప్రీంలో రాష్ట్ర ప్రభుత్వం అప్పీలు చేయటమే కారణం
- హైకోర్టు అనుకూల తీర్పుతో మురిసిపోతున్న రామోజీకి ఎదురుదెబ్బ
- అందుకే ఆగ్రహం.. రాత్రికి రాత్రి 'ఇందూ' కథ వెదికి మరీ అచ్చేసిన తీరు
- ఇందూ ఆస్తుల వేలానికి 2019లోనే బహిరంగ బిడ్లు పిలిచిన ఎన్‌సీఎల్‌టీ
- ఆ ఏడాది మార్చిలో 'ఈనాడు'లోనే ఈ మేరకు ప్రకటన
- దాని ఆస్తులు విలువైనవని భావిస్తే రామోజీ బిడ్ వేసి ఉండొచ్చు
- కానీ వాటి నిండా కోర్టు కేసులుండటంతో కావాలనే మౌనం
- అప్పట్లో ఎర్తిన్ ప్రాజెక్ట్స్‌తో పాటు కోటక్, ఇతర జాతీయ సంస్థలూ బిడ్లు
- ఎర్తిన్ సంస్థ అందరికన్నా ఎక్కువ ధర పెట్టడంతో దానికే ఖరారు
- ఇందూ ఆస్తుల విలువ 10 వేల కోట్లపైనేనంటూ 'ఈనాడు', టీడీపీ పాట
- కానీ అన్నిటికీ కోర్టు చిక్కులే... చాలా భూముల కేటాయింపులు రద్దు
- ఆస్తుల్ని విడివిడిగా వేలం వేసే అవకాశం లేకే.. దివాలా పరిష్కారం
- ఆ వాస్తవాలన్నీ తొక్కిపెట్టి.. అవాస్తవాలకే 'ఈనాడు' పెద్దపీట

4లో

కదిలిన కేంద్రం



- పోలవరం, విభజన సమస్యల పరిష్కారంపై నేడు ఢిల్లీలో కీలక భేటీ
- పీఎంవో నియమించిన కేంద్ర కమిటీతో భేటీ కానున్న రాష్ట్ర కమిటీ
- ప్రధాని మోదీని సీఎం వైఎస్ జగన్ కలసిన వెంటనే కీలక పరిణామం

14లో



క్లుప్తంగా

రాష్ట్ర కేబినెట్ భేటీ వచ్చే నెల 1కి వాయిదా

సాక్షి, అమరావతి: ఈ నెల 29వ తేదీన జరగాల్సిన రాష్ట్ర కేబినెట్ సమావేశం వచ్చే నెల 1వ తేదీకి వాయిదా పడింది. ఈ విషయాన్ని అధికార వర్గాలు బుధవారం రాత్రి వెల్లడించాయి.

29న తెలుగు భాషా దినోత్సవం

- అన్ని జిల్లాల్లో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి
- భాషాభివృద్ధికి కృషి చేస్తున్న వ్యక్తులు, పండితులు, కవులకు సత్కారం

సాక్షి, అమరావతి: వ్యవహారిక భాషోద్యమ పితామహుడు, తెలుగు భాషకు పట్టం కట్టిన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్టు పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 29న రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని అన్ని జిల్లాల్లో తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్న వ్యక్తులతో పాటు తెలుగు భాషా పండితులు, కవులను ఘనంగా సత్కరించాలని కలెక్టర్లకు సూచించారు. రామ్మూర్తి పంతులు వాడుక భాషలో 'తెలుగు' అనే పత్రికను నడిపారన్నారు. తెలుగును కాపాడి తెలుగు ప్రజలకు ఆరాధ్య దైవంగా మారారని కొనియాడారు.

'పల్లిపట్టు'కు యువ సాహిత్య పురస్కారం

- యాలై పూడ్సింది.. కవితకు అవార్డు
- పత్తిపాక మోహన్‌కు బాలసాహిత్య పురస్కారం

సాక్షి, న్యూఢిల్లీ/తిరుపతి కల్చరల్: జీవితాన్ని కాచి వడబోసిన అనుభవం.. అడుగడుగునా కనిపించే వివక్ష నుంచి రగిలిన అగ్ని కణం.. అణచివేతను కూకటి వేళ్లతో పెకలించాలనే ఆక్రోశం.. వెరసి పేదల పక్షాన పోరాటమై.. పీడిత జన పిడికిలై.. కవిత్వమే ఆయుధమై.. అక్షర సూరీడైన పల్లిపట్టు నాగరాజుకు కేంద్ర సాహిత్య అకాడమీ యువ అవార్డు దక్కింది. స్వస్థలం తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రంగనాథపురం మిట్టిండ్లు. తల్లిదండ్రులు భూలక్ష్మి, రాఘవయ్య. ప్రస్తుతం నాగరాజు.. శాంతిపురం మండలంలోని 64 పెద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. సాహిత్య అకాడమీ అధ్యక్షుడు డా.చంద్రశేఖర్ కంబార్ నేతృత్వంలోని బోర్డు.. నాగరాజు రాసిన 'యాలై పూడ్సింది' కవితా సంపుటిని యువ సాహిత్య పురస్కారానికి ఎంపిక చేసినట్టు సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది ఆయన తొలి వచనా కవితా సంపుటి కావడం విశేషం. తల్లిదండ్రుల కష్టంతో పాటు చుట్టు పక్కల ప్రజల జీవన శైలి నాగరాజు రచనలపై ఎనలేని ప్రభావం చూపింది. సమాజంలో సగటు మనిషి బాధలకు కవితల రూపంలో అక్షరీకరించాడు. చిన్నప్పుడు అవ్వ చెప్పిన కథలే ఆలంబనగా ఊహలకు పదును పెట్టారు. త్వరలో ఢిల్లీలో జరుగనున్న కార్యక్రమంలో పురస్కారం కింద ఈ కవివర్యుడు రూ.50 వేల నగదుతో పాటు సత్కారం అందుకోనున్నారు. కాగా, ఈ ఏడాది తెలుగుతో పాటు దేశంలోని 23 భాషలకు చెందిన రచయితలను యువ సాహిత్య పురస్కారాలకు ఎంపిక చేశారు. తెలంగాణ సిరిసిల్ల పట్టణానికి చెందిన బాల సాహితీవేత్త డా.పత్తిపాక మోహన్ రాసిన 'బాలల తాత బాపూజీ' గేయ కథ బాలసాహిత్య పురస్కారానికి ఎంపికైంది. ఈ ఏడాదికిగాను కేంద్ర సాహిత్య అకాడమీ 22 మంది రచయితలకు బాల సాహిత్య పురస్కారాలు ప్రకటించింది.

నా బాధ్యత మరింత పెరిగింది

శ్రమజీవుల కష్టనష్టాలకు అక్షర రూపం ఇచ్చిన తొలి పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం రావడం చాలా సంతోషంగా ఉంది. ఇది నా బాధ్యతను మరింత పెంచింది. సామాన్యుల కష్టాలు, వారి నిత్య జీవితంలో ఎదురయ్యే పరిస్థితులే కథా వస్తువులుగా ఇకపై కూడా రచనలు కొనసాగిస్తాను. ఈ పురస్కారాన్ని శ్రమ జీవులు, బహుజనుల జీవితాల సంఘర్షణకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. అమ్మానాన్నలకు ఈ అవార్డును అంకితమిస్తా. - పల్లిపట్టు నాగరాజు

ఇదండీ సంగతి



.. మరేం లేదు! పార్టీలో ఉండేది, లేనిది మీ నోటి దూలను బట్టి ఉంటుంది!

స్కూళ్ల భద్రతపై దృష్టి

నాడు-నేడు పూర్తి అయిన పాఠశాలల్లో వాచ్‌మెన్ల నియామకం

- ఉన్నత స్థాయి సమీక్షలో అధికారులకు సీఎం జగన్ ఆదేశం
- నాడు-నేడు తొలి దశ పనులపై ఆడిట్ తప్పనిసరి
- స్కూళ్ల నిర్వహణ, పర్యవేక్షణ ఎంతో ముఖ్యం
- ఇందుకు వీలుగా ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ పోస్టుల భర్తీ
- మధ్యాహ్న భోజనం మరింత నాణ్యతతో అందించాలి



స్కూళ్ల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకంపై అధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 'మనబడి నాడు-నేడు' పథకం కింద పలు మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసిన స్కూళ్లలో భద్రత కోసం వాచ్‌మెన్లను నియమించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నాడు-నేడు తొలిదశ కింద పనులు జరిగిన స్కూళ్లపై ఆడిట్ చేయించాలని సూచించారు. ప్రభుత్వ స్కూళ్ల నిర్వహణ, మధ్యాహ్న భోజనం, సంపూర్ణ పోషణ కార్యక్రమాలపై బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మనబడి నాడు-నేడు కింద నిర్దేశించుకున్న అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయా? లేవా? సమకూర్చిన వాటిలో ఏమైనా సమస్యలు వచ్చాయా? తదితర అంశాలపై ఆడిట్ చేయించాలన్నారు. క్రమం తప్పకుండా ఏటా నాలుగుసార్లు ఆడిట్ జరగాలని స్పష్టం చేశారు. ఎక్కడైనా చిన్న చిన్న సమస్యలు వస్తే స్కూలు మెయింటెనెన్స్ ఫండ్ (ఎస్ఎంఎఫ్), టాయిలెట్స్ మెయింటెనెన్స్ ఫండ్ (టీఎంఎఫ్) నిధులను వాడుకుని వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలన్నారు. నాడు-నేడు కింద కల్పించిన సదుపాయాలకు సంబంధించి వారంటీ ఉన్నందున సమస్య రాగానే, మరమ్మతులు చేయిస్తున్నామని అధికారులు సీఎంకు వివరించారు. వీటికోసం గ్రామ సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ సేవలను వినియోగించుకోవాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. ఈ సమీక్షలో సీఎం ఇంకా ఏమన్నారంటే..

స్కూళ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

- రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్ల నిర్వహణపైనా ప్రత్యేక చర్యలు చేపట్టాలి. నాడు-నేడు కింద స్కూళ్లను అభివృద్ధి చేయడం ఎంత ముఖ్యమో నిర్వహణ కూడా అంతే ముఖ్యం. ఈ పర్యవేక్షణ పక్కాగా కొనసాగాలంటే ఖాళీగా ఉన్న ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. దీనివల్ల స్కూళ్లపై పర్యవేక్షణ పెరుగుతుంది.
- స్కూళ్ల నిర్వహణపై ఒక కాల్ సెంటర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలి. తద్వారా స్కూళ్ల నిర్వహణపై వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించొచ్చు. స్కూళ్లలో వివిధ సౌకర్యాలు ఏర్పాటు చేసినా, అవి పని చేయడం లేదన్న మాట రాకూడదు. అంతిమంగా కలెక్టర్లు, జేసీలు.. స్కూళ్ల నిర్వహణపై బాధ్యత వహించాలి.

చిక్కీల నాణ్యతపై మూడు దశల్లో పరీక్షలు

- నాణ్యతా లోపం లేకుండా పిల్లలకు భోజనం అందించాలి. క్రమం తప్పకుండా మధ్యాహ్న భోజనంపై పర్యవేక్షణ చేయాలి. దీనికోసం సరైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలి. వీటి పర్యవేక్షణలో హెచ్ఎం, సచివాలయ సిబ్బంది పాత్ర కీలకంగా ఉండాలి. ఆ మేరకు వారికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించాలి.
- మధ్యాహ్న భోజనంలో అందించే చిక్కీల నాణ్యతపై తయారీదారుల వద్ద, సరఫరా సమయంలో, పిల్లలకు పంపిణీ చేసేటప్పుడు.. ఇలా మూడు దశల్లో నాణ్యతపై ర్యాండమ్ పరీక్షలు చేయాలి. స్టాంపింగ్ లేకుండా గుడ్లు పంపిణీ చేస్తే ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ ప్లస్ కార్యక్రమంపై కూడా గట్టి పర్యవేక్షణ ఉండాలి. ఇందుకు పటిష్టమైన యంత్రాంగాన్ని రూపొందించుకోవాలి. ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల పోస్టులను భర్తీ చేయాలి.
- ఈ సమీక్షా సమావేశంలో విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉష శ్రీచరణ్, సీఎస్ సమీర్ శర్మ, విద్యా శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్, మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఏ ఆర్ అనురాధ, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎస్ గుల్జార్, పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఎస్ సురేష్ కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎ.సిరి, సెర్ప్ సీఈవో ఏఎండీ ఇంతియాజ్, మెప్మా ఎండీ వి.విజయలక్ష్మి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

> స్కూళ్లకు, అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సరఫరా చేసే ముందు వాటి నాణ్యతను కచ్చితంగా పరిశీలించాలి. బియ్యం బ్యాగులపై కచ్చితంగా మధ్యాహ్న భోజనం లేదా ఐసీడీఎస్ బియ్యంగా లేబుల్స్ వేయాలి. ప్రతినెలా నాణ్యత పరీక్షలు జరగాలి. ఆహారాన్ని రుచిగా వండడంపై వంట పని వారికి (కుక్స్) తగిన తర్ఫీదు ఇవ్వాలి. ఈ శిక్షణ కార్యక్రమాలు క్రమం తప్పకుండా కొనసాగించాలి. గుడ్లు సరఫరాలో స్టాంపింగ్ తప్పనిసరి. - సీఎం వైఎస్ జగన్

8మంది ఐపీఎస్‌ల బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎనిమిది మంది ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సమీర్ శర్మ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
బీఎన్ మణికంఠ చందోలు	అదనపు ఎస్పీ, నర్సీపట్నం	అదనపు ఎస్పీ, ఎస్ఈబీ, శ్రీకాకుళం
పి.సోమశేఖరరావు	అదనపు ఎస్పీ, ఎస్ఈబీ, శ్రీకాకుళం	డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలి
కృష్ణకాంత్ పటేల్	అదనపు ఎస్పీ, రంపచోడవరం	అదనపు ఎస్పీ, ఎస్ఈబీ, కర్నూలు
తుషార్ డూడి	అదనపు ఎస్పీ, చింతపల్లి	అదనపు ఎస్పీ(పరిపాలన), వైఎస్సార్ జిల్లా
ప్రేరణ కుమార్	అసాల్ట్ కమాండెంట్, గ్రేహౌండ్స్	అదనపు ఎస్పీ, ప్రొద్దుటూరు, వైఎస్సార్ జిల్లా
వై.ప్రసాదరావు	అదనపు ఎస్పీ, ప్రొద్దుటూరు	డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలి
కేవీ మహేశ్వరరెడ్డి	అసాల్ట్ కమాండెంట్, గ్రేహౌండ్స్	అదనపు ఎస్పీ, చింతూరు, అల్లూరి సీతారామరాజు జిల్లా
కె. ప్రతాప్ శివకిశోర్	అసాల్ట్ కమాండెంట్, గ్రేహౌండ్స్	అదనపు ఎస్పీ, చింతపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా



నేడు కృష్ణా, రేపు విశాఖ జిల్లాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటన

- నేడు పెడనలో వైఎస్సార్ నేతన్న నేస్తం 4వ విడత పంపిణీ ప్రారంభం
- 26న విశాఖలో అమెరికా స్వచ్ఛంద సంస్థ పార్లే ఫర్ ది ఓషన్స్‌తో ఒప్పందం
- మైక్రోసాఫ్ట్ సంస్థలో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేత

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం కృష్ణా జిల్లాలో, శుక్రవారం విశాఖపట్నం జిల్లాలో పర్యటించనున్నారు. సీఎం జగన్ ఈ నెల 25న (గురువారం) కృష్ణా జిల్లా పెడనలో వైఎస్సార్ నేతన్న నేస్తం నాలుగో విడత పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అక్కడే లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేస్తారు. ఆయన ఉదయం 10 గంటలకు తాడేపల్లి నుంచి బయల్దేరి 10.40 గంటలకు పెడన చేరుకుంటారు. 10.50 నుంచి 12.30 గంటల వరకు పెడన బంటుమిల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. వైఎస్సార్ నేతన్న నేస్తం లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించి, అనంతరం ప్రసంగిస్తారు. బటన్ నొక్కి వైఎస్సార్ నేతన్న నేస్తం నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు. గ్రామదర్శిని కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తారు. అనంతరం అక్కడి నుంచి బయల్దేరి మధ్యాహ్నం 1.30 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

విశాఖపట్నం జిల్లా పర్యటన ఇలా..

26న (శుక్రవారం) విశాఖపట్నంలో సాగర తీరాన్ని పరిరక్షించేందుకు అమెరికాకు చెందిన స్వచ్ఛంద సంస్థ 'పార్లే ఫర్ ది ఓషన్స్'తో ఒప్పంద కార్యక్రమం, గ్రాడ్యుయేట్లకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు దిగ్గజ మైక్రోసాఫ్ట్ సంస్థ శిక్షణ ఇచ్చిన వారికి ధ్రువపత్రాలను అందించే కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. సీఎం జగన్ శుక్రవారం ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి నుంచి బయల్దేరతారు. 9.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. 10.20 నుంచి 11.13 గంటల వరకు ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఏపీ ప్రభుత్వం, పార్లే ఫర్ ది ఓషన్స్ మధ్య అవగాహన ఒప్పందం కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. ఆ తర్వాత సిరిపురంలోని ఏయూ కాన్వొకేషన్ హాల్‌కు చేరుకుంటారు. 11.23 నుంచి 12.10 గంటల వరకు మైక్రోసాఫ్ట్ సంస్థ శిక్షణ ఇచ్చిన విద్యార్థులకు ధ్రువపత్రాలను అందిస్తారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిస్తారు. అనంతరం సీఎం జగన్ ప్రసంగిస్తారు. 12.40 గంటలకు విశాఖ నుంచి బయల్దేరి 1.55 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

నాలుగో ఏడాదీ 'వైఎస్సార్ నేతన్న నేస్తం'

- నేడు కృష్ణా జిల్లా పెడనలో లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేయనున్న సీఎం జగన్
- 80,546 మంది నేతన్నలకు రూ.193.31 కోట్లు సాయం
- పథకం ద్వారా నాలుగేళ్లలో రూ.776.13 కోట్ల మేర లబ్ధి
- ఒక్కో నేతన్నకు రూ.96,000 మేర ప్రయోజనం

సాక్షి, అమరావతి: వరుసగా నాలుగో ఏడాదీ నేతన్న కుటుంబాలకు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. గురువారం కృష్ణా జిల్లా పెడనలో నిర్వహించే బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో ఆర్థిక సాయాన్ని జమ చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 80,546 మంది నేతన్నలకు 4వ విడతగా రూ.193.31 కోట్లను జమ చేస్తారు.

- అర్హులై ఉండి సొంత మగ్గం కలిగిన ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24,000 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని అందచేస్తోంది. నేడు అందిస్తున్న సాయంతో కలిపి అర్హులైన ప్రతి నేతన్నకు అందించిన మొత్తం సాయం రూ.96,000. ఇప్పటివరకూ నేరుగా నేతన్నలకు ఈ పథకం ద్వారా అందించిన మొత్తం సాయం రూ.776.13 కోట్లు.
- వైఎస్సార్ నేతన్న నేస్తం కింద రూ.776.13 కోట్లు, నేతన్నల పెన్షన్ కోసం రూ.879.8 కోట్లు, ఆప్కోకు చెల్లించిన రూ.393.3 కోట్లతో కలిపి మూడేళ్లలో నేతన్నల సంక్షేమం కోసం వెచ్చించిన మొత్తం రూ.2,049.2 కోట్లు.
- చేనేత కార్మికులు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంతో మగ్గాలను డబుల్ జాకార్డ్, జాకార్డ్ లిఫ్టింగ్ మెషిన్ తదితర ఆధునిక పరికరాలతో అప్‌గ్రేడ్ చేసుకుని కొత్త డిజైన్లతో నాణ్యమైన వస్త్రాలను ఉత్పత్తి చేయడం వల్ల 2018–19లో కేవలం రూ.4,680 మాత్రమే ఉన్న నెలవారీ ఆదాయం పథకం అమలు తర్వాత మూడు రెట్లు పెరిగి రూ. 15,000కు చేరింది.
- గత సర్కారు బకాయి పెట్టిన రూ.103 కోట్లుసహా రూ.393.30 కోట్లను ఆప్కోకు అందచేసింది.
- ఆప్కో వస్త్రాలకు ఆన్‌లైన్ ద్వారా అంతర్జాతీయ మార్కెటింగ్ కల్పించి నేతన్నల ఆదాయం పెంచేందుకు ఈ–కామర్స్ సంస్థలైన అమెజాన్, మింత్ర, ఫ్లిప్‌కార్ట్, గోకూప్, లూమ్‌ఫోక్స్, లాంటి దిగ్గజాలతో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది.

ఏడాదిలో వెలిగొండ

▶ మొదటి పేజీ తరువాయి

కాంస్య విగ్రహాలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం బూచేపల్లి ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి 18.80 కిలోమీటర్ల మొదటి టన్నెల్, 18.78 కిలో మీటర్ల రెండో టన్నెల్ పనులను 2014కు ముందు నాన్నగారు ఉరుకులు, పరుగులు పెట్టించారని తెలిపారు. 2014 వరకు మొదటి టన్నెల్‌ను ఏకంగా 11.58 కి.మీ. పూర్తి చేశారన్నారు. ఆ తర్వాత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యాక ఐదేళ్ల పాలనలో మొదటి టన్నెల్‌ను కేవలం 4.33 కి.మీ. మాత్రమే తవ్వగా, మనం అధికారం చేపట్టిన రెండేళ్లలోనే 2.89 కిలో మీటర్లు తవ్వి పూర్తి చేశామని చెప్పారు. రెండో టన్నెల్ పనులు 2014 వరకు 8.74 కిలో మీటర్లు తవ్వితే, చంద్రబాబు ఐదేళ్ల పాలనలో కేవలం 2.35 కిలో మీటర్లు మాత్రమే తవ్వి, చేతులు దులుపుకున్నారన్నారు. మన ప్రభుత్వం వచ్చాక రెండో టన్నెల్‌ను ఇప్పటికే 3.71 కిలో మీటర్లు పూర్తి చేశామని, ఇక మిగిలిన 3.96 కి.మీలు కూడా 2023 సెప్టెంబర్ నాటికి పూర్తి చేసి ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని చెప్పారు. ఈ ప్రాజెక్టును ప్రారంభించాకే ఎన్నికలకు వెళతామని, ఈ ప్రాజెక్టు వల్ల ప్రకాశం జిల్లా రూపురేఖలన్నీ సమూలంగా మారిపోతాయని అన్నారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

మంచి చేసే మనుషులు చిరస్థాయిగా ఉంటారు

- మంచి చేసే మనుషులు చనిపోయినా, చిరస్థాయిగా మనసుల్లో నిలిచి ఉంటారు. మంచి చేసిన వారికి చావు ఉండదు. ఒకవైపు నాన్నగారు.. మరో వైపు సుబ్బారెడ్డి అన్న.. ఇలాంటి నాయకులను ఎవరూ మరిచిపోలేరు.
- గాంధీ, అంబేడ్కర్, మహాత్మా పూలే, జగ్జీవన్ రామ్, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు, టంగుటూరి ప్రకాశం పంతులు, మహానేత వైఎస్సార్.. ఇలాంటి వారందరినీ కలకాలం తలుచుకుంటూ ఉంటాం. ఎందుకంటే వీరి శరీరాలకు మరణం ఉంటుందేమో కానీ, వీరు చేసిన మంచి పనులకు, వీరి భావాలకు ఎప్పటికీ మరణం ఉండదు. వీళ్లంతా తెలుగు నేల మీద గుర్తుండిపోయే శిఖరాలు.
- నాన్నగారి విగ్రహాన్ని ఆవిష్కరించాల్సిందిగా ఎప్పటి నుంచో నా తమ్ముడు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివ చాలా సందర్భాల్లో అడిగారు. నాన్నగారి విగ్రహంతోపాటు, ఆయనతో కలిసి అడుగులు వేసిన మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి (శివప్రసాదరెడ్డి నాన్న) గారి విగ్రహాన్ని ఇవాళ ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉంది.



సభలో ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్

- రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడలో ఏప్రిల్ 14న ఆవిష్కరించనున్నాం.

గ్రానైట్ పరిశ్రమకు భరోసా

- స్టోన్ కటింగ్ మిషన్‌లకు సంబంధించి చిన్న చిన్న యాజమాన్యాల కింద పది మందికి పైగా పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. నా పాదయాత్ర సమయంలో వారి కష్టాలు చెప్పుకున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయాలను నా దృష్టికి తీసుకొచ్చారు. ఆరోజు నేను ఏదైతే చెప్పానో.. ఆ విధంగా మళ్లీ స్లాబ్ సిస్టమ్ విధానాన్ని తీసుకొచ్చాను. ఈరోజు ఇక్కడకు వచ్చే ముందే జీవో నంబరు 58 విడుదల చేశాం.
- నాన్న గారి హయాంలో తీసుకొచ్చిన ఈ స్లాబ్ పద్ధతిని 2016లో చంద్రబాబు ప్రభుత్వం ఉపసంహరించింది. దీంతో చిన్న చిన్న గ్రానైట్ పరిశ్రమలు కష్టాల్లో కూరుకుపోయాయి. అందుకే దాదాపు ఏడు వేల యూనిట్లకు లబ్ధి చేకూరేలా జీవో 58 తీసుకొచ్చాం.
- ప్రకాశం జిల్లాలో గెలాక్సీ గ్రానైట్ ఎక్కువగా ఉంటుంది. 22 క్యూబిక్ మీటర్ల ముడి గ్రానైట్ ప్రాసెస్ యూనిట్లకు సింగిల్ బ్లేడ్‌కు రూ.27 వేలు, మల్టీ బ్లేడ్‌కు రూ.54 వేలు నెలకు ఇచ్చేలా సీనరేజ్ స్లాబు నిర్ణయించాం. శ్రీకాకుళం, రాయలసీమ జిల్లాల్లో సింగిల్ బ్లేడ్‌కు రూ.22 వేలు, మల్టీ బ్లేడ్‌కు రూ.44 వేల సీనరేజ్ స్లాబ్ నిర్ణయించాం.
- ఇలా స్లాబ్ విధానం అమలు చేయడం వల్ల మన ప్రభుత్వానికి రూ.135 కోట్లు నష్టం వాటిల్లుతుందని తెలిసినా, మీ బాగు కోసం ఈ నిర్ణయం తీసుకున్నాం. ఇప్పుడు ప్రకటించిన కొత్త విధానం వల్ల చిన్న చిన్న గ్రానైట్ పాలిషింగ్ యూనిట్లు స్పీడ్ అందుకుంటాయి. వాటికి అనుబంధంగా రవాణా, మార్కెట్ రంగాల్లో అవకాశాలు మెరుగుపడి కార్మికులకు మేలు జరుగుతుంది.

విద్యుత్ యూనిట్‌కు రూ.2 రాయితీ

- గ్రానైట్ పరిశ్రమకు విద్యుత్ చార్జీలు తగ్గిస్తున్నాను. దీంతో చిన్న చిన్న పరిశ్రమలు సైతం పుంజుకుంటాయి. చిన్న చిన్న గ్రానైట్ పరిశ్రమలకు చంద్రబాబు ప్రభుత్వం యూనిట్‌కు హెచ్‌టీకి రూ.6.30, ఎల్‌టీకీ యూనిట్ రూ.6.70 చొప్పున వసూలు చేసేది. ఆ చార్జీల్లో ఇక మీదట నుంచి ప్రతి యూనిట్‌కు రూ.2 రాయితీ ప్రకటిస్తున్నా. అటు స్లాబ్ సిస్టం అమలు చేయటం, ఇటు విద్యుత్ యూనిట్లలో రాయితీలు ఇవ్వటం వల్ల ప్రభుత్వానికి ఎక్కువ నష్టం వాటిల్లుతుంది. అయినా పరిశ్రమల అభివృద్ధి, కార్మికుల ప్రయోజనం దృష్ట్యా ఈ నిర్ణయం సరైనదేనని భావించాను.
- విద్యుత్ రాయితీ వల్ల ఏకంగా ప్రభుత్వానికి రూ.210 కోట్లు భారం పడుతుంది. మరో వైపు సీనరేజ్ మార్పు వల్ల రూ.135 కోట్ల భారం పడుతుంది. వెరసి రెండింటి మీద దాదాపు రూ.350 కోట్లు భారం పడుతుంది. ఈ రోజు నుంచి ఈ రెండూ అమలులోకి వస్తాయి.

జెడ్పీ భవనం కోసం రూ.20 కోట్లు

- ఒంగోలులో కొత్త జిల్లా పరిషత్ కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరిందని.. రూ.20 కోట్లు మంజూరు చేయాలని.. ఇక్కడకు వచ్చేటప్పుడు జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ అడిగారు. రూ.20 కోట్లు మంజూరు చేస్తున్నాను. తాళ్లూరు మండలం శివరామ్‌పురంలోని మొగిలిగుండాల చెరువును మినీ రిజర్వాయర్‌గా మార్చే పనిని చేపట్టాం. ఆ అమ్మ కోరిక మేరకు ఈ సందర్భంగా ఆ రిజర్వాయర్ పేరును బూచేపల్లి సుబ్బారెడ్డి మినీ రిజర్వాయర్‌గా మారుస్తూ ఆదేశాలు ఇచ్చాం.
- మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో మంత్రులు మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాస రెడ్డి, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పోతుల సునీత, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర బాబు, కనిగిరి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు బుర్రా మధుసూదన్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆ అడుగులు మరచిపోలేం

- రైతులకు ఉచిత విద్యుత్ అన్నప్పుడు.. కుయ్.. కుయ్ అని అంబులెన్స్ శబ్దం విన్నప్పుడు, ఆరోగ్యశ్రీ అన్నప్పుడు మనకు ఆ దివంగత మహానేతే గుర్తుకు వస్తారు. ఆ రోజుల్లో ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పినప్పుడు.. కొందరు తీగలు చూపి, బట్టలు ఆరేసుకునేందుకే అవి పనికొస్తాయని ఎద్దేవా చేశారు.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, అట్టడుగున ఉన్న పేద వారు నిజంగా జీవితంలో పైకి రావాలంటే ముఖ్యమైనది చదువు మాత్రమే. పేదల పిల్లలు చదువుకోవాలని ఆ మహానేత తపించారు. అందుకే ఫీజు రీయింబర్స్‌మెంట్ తీసుకొచ్చారు. లక్షల కొద్దీ ఇళ్ల నిర్మాణం, జల యజ్ఞం.. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రియతమ నేత రాజశేఖరరెడ్డి వేసిన అడుగులు ఇప్పటికీ మరిచిపోలేని పరిస్థితి రాష్ట్రంలో కనిపిస్తోంది.
- అలా మంచి చేసిన రాజశేఖరరెడ్డి కొడుకుగా, మీ బిడ్డగా జగన్ నాలుగు అడుగులు ముందుకు వేస్తాడని మాట ఇస్తున్నా. మీ చల్లని దీవెనలతో ఎన్నికలప్పుడు చెప్పిన హామీలలో 95% పూర్తి చేశాం. మీ చిరునవ్వులు, మీ ఆప్యాయతలు పంచి పెడుతున్న ప్రతి అక్కకు, చెల్లెమ్మకు, సోదరుడికి, స్నేహితునికి, మిత్రునికి, అవ్వకు, తాతకు చేతులు జోడించి పేరుపేరునా కృతజ్ఞతలు.

ఎక్కడున్నావు రాజశేఖరన్నా..

ఒంగోలు సబర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాల్గొన్న ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం చీమకుర్తి సభలో బుధవారం ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. బూచేపల్లి సుబ్బారెడ్డి సతీమణి, ప్రకాశం జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ.. డాక్టర్ వైఎస్సార్‌పై స్వయంగా రాసిన పాటను వినిపించారు. ఆయన జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ.. 'ఎక్కడున్నావు రాజశేఖరన్నా.. మళ్లెప్పుడొస్తావు రాజశేఖరన్నా.. ఏమైపోయావు రాజశేఖరన్నా.. మంచి మనసున్న రాజశేఖరన్నా.. చందమామ రూపున్న వాడా.. మా కుటుంబానికి ఆత్మీయ సోదరుడా' అంటూ భావోద్వేగంతో పాట పాడారు. సీఎం వైఎస్ జగన్ ఆమె వద్దకు వచ్చి.. ఆప్యాయంగా అలింగనం చేసుకొని తను ఆశీనులైన కుర్చీ వద్దకు తోడ్కొని వెళ్లాడు. ఈ దృశ్యం చూసిన వారు కరతాళ ధ్వనులు చేశారు.



విగ్రహాల ఆవిష్కరణ సమయంలో భావోద్వేగానికి గురైన వెంకాయమ్మను ఓదారుస్తున్న సీఎం వైఎస్ జగన్



సభకు హాజరైన జనసందోహం

'చేయూత'కు దరఖాస్తుల స్వీకరణ

- వచ్చే నెలలో మూడో విడత 'వైఎస్సార్ చేయూత'కు ఏర్పాట్లు
- కొత్తగా అర్హత పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకూ అవకాశం
- ఆగస్టు 12వ తేదీకి 45 ఏళ్లు పూర్తయిన వారి పేర్లు నమోదు
- సెప్టెంబర్ 5వ తేదీ వరకు సచివాలయాల ద్వారా దరఖాస్తు
- ఎంపీడీవోల ఆధ్వర్యంలో 8వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన
- ఇప్పటికే రెండు విడతల్లో 24.95 లక్షల మందికి రూ.9,179 కోట్లు పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఈ ఏడాది ఆగస్టు 12వ తేదీ నాటికి 45 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయనుంది. ఇందుకు గాను ప్రస్తుతం అర్హుల నుంచి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పేర్ల నమోదుతో పాటు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కొనసాగుతోంది. సెప్టెంబర్ 5వ తేదీ వరకు పేర్ల నమోదు ప్రక్రియ ఉంటుందని గ్రామ, వార్డు సచివాలయ శాఖ అధికారులు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలలో 45 –60 ఏళ్ల మధ్య వయస్సు ఉండే అర్హులకు రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం పేరుతో ఏటా రూ.18,750 చొప్పున నాలుగు విడతల్లో రూ.75 వేలు అందజేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటికే ఈ పథకం ద్వారా 2020 ఆగస్టు 12వ తేదీ తొలి విడతలో 24,00,111 మందికి రూ.4,500.21 కోట్లు.. 2022 జూన్ 22న రెండో విడతగా 24,95,714 మందికి రూ.4,679.49 కోట్లు పంపిణీ చేసింది. రెండు విడతల్లో కలిపి రూ.9179.67 కోట్లను ఆయా సామాజిక వర్గాల్లోని మహిళలకు అందజేసింది. తిరిగి ఇప్పుడు సెప్టెంబర్‌లో మూడో విడతగా ఈ పథకం లబ్ధిదారులకు రూ.18,750 చొప్పున లబ్ధి చేకూర్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా వలంటీర్ల ఆధ్వర్యంలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా కొత్తగా అర్హత పొందిన వారి పేర్ల నమోదుతో పాటు ఇప్పటికే ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్న లబ్ధిదారుల తాజా స్థితిగతులను అధికారులు పరిశీలిస్తున్నారు. సెప్టెంబర్ 5వ తేదీ వరకు కొత్తగా అర్హత పొందిన వారి పేర్లు నమోదు చేసుకొని.. అనంతరం ఆయా దరఖాస్తులపై 8వ తేదీ లోగా సచివాలయ సిబ్బంది, ఎంపీడీవోల ఆధ్వర్యంలో పరిశీలన పూర్తి చేసి అర్హులను గుర్తిస్తారు. ఇదిలా ఉండగా, కొత్తగా పేర్ల నమోదు ప్రక్రియకు కుల ధ్రువీకరణ పత్రంతో పాటు ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తప్పనిసరి అని అధికారులు వెల్లడించారు.

క్లుప్తంగా

మూడు రోజుల పాటు క్రీడోత్సవాలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి వాణి మోహన్ సూచించారు. అన్ని జిల్లాల్లో మూడు రోజుల పాటు క్రీడోత్సవాలు నిర్వహించాలని ఆదేశించారు. బుధవారం శాప్ ఎండీ ప్రభాకరరెడ్డితో కలిసి సీఈవోలు, చీఫ్ కోచ్‌లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కల్పించడంతో పాటు 26, 27 తేదీల్లో పాఠశాలలు, కళాశాలలు, వర్సిటీల్లో పోటీలు, 28న ప్రత్యేకంగా గ్రామీణ, సాంప్రదాయ క్రీడలు ఏర్పాటు చేయాలన్నారు. 29న విజేతలకు జిల్లా స్థాయిలో కేటగిరి వారీగా బహుమతులు అందజేయాలన్నారు.

ఆయుష్‌లో పాలియేటివ్ కేర్: కమిషనర్ రాములు

సాక్షి, అమరావతి: ఆయుష్ వైద్య విధానాన్ని ఆధునీకరించి ప్రజలకు చేరువ చేసే ప్రయత్నంలో భాగంగా ఏపీ ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో పాలియేటివ్ కేర్ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు కమిషనర్ రాములు బుధవారం తెలిపారు. ఇందుకోసం పాలియేటివ్ కేర్‌లో విశేష అనుభవం కలిగిన హైదరాబాద్‌కు చెందిన స్పర్శ హాస్పైస్ తో ఏపీ ఆయుష్ విభాగం ఎంవోయూ కుదుర్చుకున్నట్లు చెప్పారు. తొలిదశలో నేటి నుంచి రాష్ట్రంలోని 4 ఆయుష్ కళాశాలల్లోని విద్యార్థులకు పాలియేటివ్ కేర్ గురించి అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఇలా దశల వారీగా రాష్ట్రంలోని ఆయుష్ వైద్యులకు పాలియేటివ్ కేర్‌లో శిక్షణ ఇస్తామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ జీవిత చరమాంకంలో ఉన్న వారికి పాలియేటివ్ కేర్ స్వస్థత చేకూరుస్తుందన్నారు.

అధికారుల పనితీరు ఆధారంగా అవార్డులు

'ఉపాధి హామీ' పనులపై గ్రామీణాభివృద్ధి శాఖ వర్క్‌షాప్‌లో కమిషనర్ వెల్లడి

సాక్షి, అమరావతి: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి జిల్లాల వారీగా వివిధ సూచికల ఆధారంగా అధికారుల పనితీరుపై ఇక నుంచి రాష్ట్ర స్థాయిలో అవార్డులను ప్రకటించనున్నట్టు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోన శశిధర్ చెప్పారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ అవార్డులను అందజేయనున్నట్టు చెప్పారు. 26 జిల్లాల డ్వామా పీడీలతో బుధవారం తాడేపల్లిలోని కమిషనర్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అమలు తీరుపై వర్క్‌షాప్ నిర్వహించారు. శశిధర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో పచ్చదనం పెంచేందుకు దోహదపడే కార్యక్రమాలపై పెద్దఎత్తున దృష్టి సారించాలని సూచించారు. ప్రతి ఎంపీడీవో గ్రామాలను దత్తత తీసుకుని ఆయా గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు.

8, 9 తేదీల్లో అల్బెండజోల్ మాత్రల పంపిణీ

సాక్షి, అమరావతి: పిల్లల్లో రక్తహీనత, పలు రకాల అనారోగ్య సమస్యలకు కారణమైన నులి పురుగుల నివారణకు సెప్టెంబర్ 8, 9 తేదీల్లో అల్బెండజోల్ మాత్రలను వైద్య శాఖ పంపిణీ చేయనుంది. ఏటా రెండు సార్లు వైద్య శాఖ వీటిని పంపిణీ చేస్తుంది. ఈ ఏడాది తొలి విడత పంపిణీ ఫిబ్రవరిలో చేపట్టారు. రెండో విడత వచ్చే నెలలో చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.05 కోట్ల మంది పిల్లలు, యువతకు మాత్రల పంపిణీ చేయాలన్నది లక్ష్యం. ఇప్పటికే 50 లక్షల మాత్రలను జిల్లాలకు సరఫరా చేశారు. మిగిలిన మాత్రల సరఫరా ఈ వారాంతానికి ముగియనుంది.

మైక్రో 'సాఫ్ట్ స్కిల్స్'లో మనమే మేటి

1.62 లక్షల మందికి అత్యుత్తమ శిక్షణే లక్ష్యం

ఇప్పటికే 36 వేల మంది సర్టిఫికేషన్ కోర్సులు పూర్తి

- తొలిసారిగా భారీ ఎత్తున మైక్రోసాఫ్ట్ శిక్షణ ప్రక్రియ
- రాష్ట్ర ప్రభుత్వ చొరవతో ముందుకొచ్చిన ఐటీ దిగ్గజ సంస్థ
- విద్యార్థులపై భారం లేకుండా ప్రభుత్వమే ఫీజులు భరించేలా ఏర్పాట్లు
- రాష్ట్రంలో ఏటా ప్లేస్‌మెంట్లు 1.50 లక్షలకు పైగా పెరిగే అవకాశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రతి విద్యార్థినీ అత్యుత్తమ నైపుణ్యాలతో ప్రపంచస్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు మరో మైలురాయిని అధిగమించాయి. ఉద్యోగాన్వేషణలో అత్యంత కీలకమైన సాఫ్ట్ స్కిల్స్ పెంపొందించడంపై 1.62 లక్షల మంది విద్యార్థులకు ఐటీ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ అందచేస్తున్న నేపథ్యంలో కోర్సు పూర్తి చేసినవారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విశాఖలో నిర్వహించే కార్యక్రమంలో సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నారు. రూ.465 కోట్ల వ్యయమయ్యే ఈ శిక్షణను మైక్రోసాఫ్ట్ సంస్థ రాష్ట్ర విద్యార్థులకు దాదాపు రూ.32 కోట్లకే అందిస్తుండడం విశేషం. అది కూడా విద్యార్థులపై నయాపైసా కూడా భారం లేకుండా ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరిస్తోంది. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు కీలక సంస్కరణలు తెచ్చి ప్రతి విద్యార్థీ చదువుకునేలా సీఎం జగన్ ప్రోత్సహిస్తున్న విషయం తెలిసిందే. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన ద్వారా పిల్లల చదువులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. వారి చదువులు ముగిసే నాటికి పూర్తి నైపుణ్యాలు అందుకునేలా పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.

దేశంలో తొలి ప్రాజెక్టు మైక్రోసాఫ్ట్ అప్ స్కిల్లింగ్

ప్రపంచంలో అగ్రగామి ఐటీ సంస్థ మైక్రోసాఫ్ట్ ద్వారా రాష్ట్ర విద్యార్థులకు ప్రభుత్వం శిక్షణ అందచేస్తోంది. కరోనా సమయంలో సరైన బోధన, శిక్షణ అందుబాటులో లేక విద్యార్థుల్లో నైపుణ్యాలు కొరవడ్డాయి. ఈ తరుణంలో మైక్రోసాఫ్ట్ అమెరికాలో చేపట్టిన వర్చువల్ శిక్షణ, సర్టిఫికేషన్ కోర్సుల గురించి తెలుసుకుని రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు ఆ సంస్థతో సంప్రదింపులు జరిపారు. పరిమిత సంఖ్యలో కాకుండా అందరికీ శిక్షణ అందుబాటులో ఉండేలా చూడాలని సీఎం జగన్ సూచించడంతో ఏకంగా 1.62 లక్షల మంది విద్యార్థులతో మైక్రోసాఫ్ట్ అప్ స్కిల్లింగ్ ప్రాజెక్టుకు ఉన్నత విద్యామండలి, ఉన్నత విద్యాశాఖ శ్రీకారం చుట్టాయి. దేశంలోనే ఇది తొలి ప్రాజెక్టు కావడం గమనార్హం. ఇంజనీరింగ్ లాంటి ప్రొఫెషనల్ కోర్సులతో పాటు నాన్ ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులకూ శిక్షణ ఇస్తున్నారు. మైక్రోసాఫ్ట్ సర్టిఫైడ్ ప్రొఫెషనల్ (ఎంసీపీ), మైక్రోసాఫ్ట్ టెక్నికల్ అసోసియేట్ (ఎంటీఏ), మైక్రోసాఫ్ట్ ఫండమెంటల్ విభాగాల్లో 40 రకాల కోర్సులలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.



లింక్డిన్‌తో 8 వేల కోర్సుల్లో ఉచిత శిక్షణ

శిక్షణకు ఎంపికైన విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ కోర్సులే కాకుండా 'లింక్డిన్' ప్లాట్‌ఫాంతో అనుసంధానం చేస్తున్నారు. దీనిద్వారా లింక్డిన్‌లోని టెక్నాలజీ, క్రియేటివిటీ, బిజినెస్ విభాగాల్లో 8 వేలకు పైగా కోర్సులు విద్యార్థులకు ఉచితంగా అందుబాటులోకి వచ్చాయి. శిక్షణ పొందే విద్యార్థికి మైక్రోసాఫ్ట్ సంస్థ వంద డాలర్ల విలువైన గిఫ్ట్ వోచర్లను కూడా అందిస్తోంది. మైక్రోసాఫ్ట్ అందించే కోర్సులతో పాటు ఇతర కోర్సుల కోసం, ల్యాబ్‌ల కోసం ఈ గిఫ్ట్ వోచర్ క్రెడిట్‌ను విద్యార్థులు వినియోగించుకోవచ్చు. అజూర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అజూర్ వర్చువల్ మెషీన్స్, అజూర్ ఎస్క్యూఎల్ డేటాబేస్, యాప్స్ బిల్డింగ్ లాంవంటి కోర్సులకు ఎలాంటి అధికారిక ధ్రువీకరణతో సంబంధం లేకుండా విద్యార్థులకు అవకాశం కలుగుతుంది.

35,980 మందికి ఇప్పటికే శిక్షణ

గతేడాది చేపట్టిన మైక్రోసాఫ్ట్ అప్‌స్కిల్లింగ్ ప్రాజెక్టు ద్వారా 1.62 లక్షల మందికి సాఫ్ట్ స్కిల్స్‌లో శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా ఇప్పటికే 35,980 మందికి వర్చువల్ శిక్షణ పూర్తయింది. ఇతర విద్యార్థులకు శిక్షణ ప్రక్రియ పురోగతిలో ఉంది. 2022 అక్టోబర్ నాటికి ప్రాజెక్టు పూర్తి చేసి విద్యార్థులను సాఫ్ట్ స్కిల్స్‌లో అత్యుత్తమంగా తీర్చిదిద్దనున్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.32 కోట్లను ప్రభుత్వమే భరిస్తున్నందున విద్యార్థులపై నయాపైసా కూడా భారం పడదు.

ప్రభుత్వ చొరవతో...

తొలిసారిగా తమ సంస్థ ద్వారా ఏకంగా 1.62 లక్షల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వ స్థాయిలో ప్రతిపాదనలు రావడం మైక్రోసాఫ్ట్‌ను ఆశ్చర్యానికి గురి చేసింది. విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ విధంగా ఏ ప్రభుత్వమూ ప్రయత్నాలు చేయలేదంటూ వెంటనే శిక్షణకు ముందుకొచ్చింది. మైక్రోసాఫ్ట్ అజూర్ కోర్సు శిక్షణ కోసం ఒక్కో విద్యార్థికీ రూ.25 వేల నుంచి రూ.50వేల వరకు ఖర్చు అవుతుంది. దీనికి అదనంగా పరీక్ష ఫీజు రూ.3,750 విద్యార్థే చెల్లించాలి. ఈ లెక్కన మొత్తం 1.62 లక్షల మంది విద్యార్థుల శిక్షణ కోసం రూ.465 కోట్లు వ్యయమవుతుంది.

అత్యుత్తమ అవకాశాలు అందుకునేలా..

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, మెషీన్ లెర్నింగ్ లాంటి అధునాతన సాంకేతికత అందుబాటులోకి వస్తున్న తరుణంలో మన విద్యార్థులకు ఆ దిశగాఅత్యుత్తమ నైపుణ్యాలు సమకూర్చేలా మైక్రోసాఫ్ట్ అప్‌స్కిల్లింగ్ ప్రాజెక్టుకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. దీనిద్వారా ఆయా రంగాల్లో అత్యుత్తమ అవకాశాలను అందుకొనేందుకు సిద్ధంగా ఉంటారు. మైక్రోసాఫ్ట్ సంస్థ అందించే ఈ సర్టిఫికేషన్ కోర్సులకు అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉండడంతోపాటు ఉపాధి త్వరగా లభిస్తుంది. మైక్రోసాఫ్ట్ అప్‌స్కిల్లింగ్ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది. ఉద్యోగావకాశాలు పొందేలా విద్యార్థులను పూర్తి సామర్థ్యాలతో తీర్చిదిద్దుతుంది.

– ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్

రేపు విశాఖలో సర్టిఫికెట్లు అందించనున్న సీఎం జగన్

ఇప్పటికే దాదాపు 36 వేల మంది మైక్రోసాఫ్ట్ అప్‌స్కిల్లింగ్ సర్టిఫికేషన్ కోర్సులు పూర్తి చేసిన నేపథ్యంలో విశాఖపట్నంలో శుక్రవారం ఉన్నత విద్యామండలి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. శిక్షణ పూర్తి చేసిన వారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లను ప్రదానం చేయనుంది.


ఇక వేగంగా ఫైళ్ల క్లియరెన్స్

సెక్రటేరియట్ ఆఫీస్ మాన్యువల్‌లో సవరణలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వంలోని వివిధ శాఖలకు చెందిన ఫైళ్లు ఇక వేగంగా కదలనున్నాయి. ఇందుకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ ఆఫీస్ మాన్యువల్‌లో సవరణలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సచివాలయ శాఖల్లో ఫైళ్లు అనేక దశలకు వెళ్తుండటంతో నిర్ణయం తీసుకోవడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని గుర్తించినట్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అవసరం లేకపోయినా ఎక్కువ దశలకు ఫైళ్లు వెళ్లడం, అనవసరంగా చాలా స్థాయిల్లో ఫైళ్లలో రాసిందే రాయడం జరుగుతోంది. దీనివల్ల నిర్ణయం తీసుకోవడంలో చాలా ఆలస్యం అవుతోందని గుర్తించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇక ఫైళ్లు నాలుగు స్థాయిలకు మించి వెళ్లకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఫైళ్లు ప్రారంభించిన స్థాయి నుంచి ముఖ్యమంత్రి, గవర్నర్ మినహా మంత్రులు నిర్ణయం తీసుకునే ఫైళ్లు నాలుగు స్థాయిలకు మించి వెళ్లకూడదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ స్థాయిలను ఒకే స్థాయి కింద పరిగణించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అర్జెన్సీ, ప్రాధాన్యత, గోప్యత ఫైళ్లు ఆధారంగా ఫైళ్లు కదలికలకు నిర్ణీత సమయాన్ని సంబంధిత కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు నిర్ధారించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. వివిధ శాఖలకు చెందిన సబ్జెక్టుల ఆధారంగా ఫైళ్లను ఏ, బీ, సీ కేటగిరీలుగా వర్గీకరించడంతో పాటు ప్రాధాన్యత ఆధారంగా నిర్ణీత సమయాన్ని నిర్ధారించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

కుప్పం అభివృద్ధి నా ఘనతే

- ఇప్పుడు రూ.60 కోట్లిచ్చి ఇంటింటికీ అబద్ధాలు చెబుతున్నారు: చంద్రబాబు
- కొంగనపల్లిలో టీడీపీ నేతల రాళ్ల దాడి..
- ఇద్దరు వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలు



సాక్షి, చిత్తూరు: 'నేను రూ.1,400 కోట్లతో కుప్పం అభివృద్ధి పనులకు జీవో ఇస్తే ఈ ప్రభుత్వంలో రద్దు చేశారు. మూడున్నరేళ్లలో కుప్పం అభివృద్ధికి చేసిందేమీ లేదు. నేను రూ.వందల కోట్లతో నియోజక వర్గాన్ని అభివృద్ధి చేస్తే కేవలం రూ.60 కోట్లు ఇచ్చి కుప్పంలో ఇంటింటికీ అబద్ధాలు చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో 175 సీట్లు సంగతేమో కానీ పులివెందులలోనే గెలవలేరు. నేను అధికారంలో ఉన్నప్పుడు రోడ్లు, స్కూళ్లు, చెక్‌డ్యామ్‌లు, పాలార్‌పై బ్రిడ్జి నిర్మించా' అని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పేర్కొన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం చిత్తూరు జిల్లా చేరుకున్న ఆయన తొలిరోజు కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలం కొంగనపల్లిలో పర్యటించారు. చంద్రబాబు పర్యటన ప్రారంభం కాగానే టీడీపీ నాయకులు కొంగనపల్లిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై రాళ్ల దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు భయ్యారెడ్డి, నారాయణరెడ్డి తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రశాంతంగా ఉన్న కుప్పాన్ని పులివెందులలా చేయాలనుకుంటే ఊరుకునేది లేదన్నారు. బాబాయ్‌ను చంపినందుకు ఓట్లు వేయమని అడుగుతావా? కోడికత్తి డ్రామా ఆడినందుకు ఓటు వేయమని అడుగుతావా జగన్‌రెడ్డి అంటూ చంద్రబాబు వ్యాఖ్యానించారు. హంద్రీనీవా నీళ్లు రామకుప్పం వరకు తెచ్చానని, కుప్పం వరకు నీళ్లు సీఎం జగన్ ఎందుకు తీసుకురాలేదన్నారు. పుంగనూరు పుడింగి డబ్బులకు ఇక్కడ ఎవరూ అమ్ముడుపోరన్నారు. వైఎస్ హయాంలో లేపాక్షి ప్రాజెక్టుకు 8,500 ఎకరాలు ఇచ్చి జగన్ ముడుపులు తీసుకున్నారని ఆరోపించారు. ఆ భూములను రూ.500 కోట్లకు జగన్ మేనమామకు అప్పగించేలా ప్రణాళిక వేశారన్నారు.



టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడ్డ భయ్యారెడ్డి

వైద్య కళాశాలల్లో వసతుల పెంపునకు కృషి

మెడికల్ ఎడ్యుకేషన్ హైపవర్ కమిటీ చైర్మన్ జస్టిస్ శ్యామ్‌ప్రసాద్

గుంటూరు మెడికల్: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని మెడికల్ ఎడ్యుకేషన్ హైపవర్ కమిటీ చైర్మన్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి.శ్యామ్‌ప్రసాద్ చెప్పారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో వసతుల పెంపుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అందులో భాగంగా గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్‌లలో వసతులను పరిశీలించేందుకు వచ్చినట్టు తెలిపారు. గుంటూరు వైద్య కళాశాలలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలలు, ప్రైవేటు వైద్య కళాశాలలను పరిశీలించి వైద్య రంగంలో ఉన్న ప్రస్తుత పరిస్థితులపై ప్రభుత్వానికి నివేదిక అందించి, మెరుగైన వైద్యం అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సైతం నివేదిక ఇస్తున్నట్టు తెలిపారు. గుంటూరు జీజీహెచ్‌లో వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. జీజీహెచ్‌లోని పలు వార్డులను పరిశీలించారు. వారి వెంట డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయంయ వీసీ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ తదితరులున్నారు.



మీడియాతో మాట్లాడుతున్న జస్టిస్ జి.శ్యామ్‌ప్రసాద్, పక్కన వీసీ డాక్టర్ పి.శ్యామ్‌ప్రసాద్ తదితరులు

నేడు తిరుపతిలో జాతీయ కార్మిక శాఖ సదస్సు

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని ప్రసంగం

తిరుపతి అర్బన్: జాతీయ కార్మిక శాఖ సదస్సుకు ఆధ్యాత్మిక నగరం వేదిక కానుంది. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి నేతృత్వంలో పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టరేట్‌లో 24 గంటల పాటు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సమాచారం కోసం 6281156480, 6281156495 నంబర్లను సంప్రదించాలని కలెక్టర్ చెప్పారు. తాజ్ హోటల్‌లో సదస్సు ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగిస్తారు. కేంద్ర కార్మిక ఉపాధి శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ అధ్యక్షతన జరగనున్న ఈ సదస్సులో 90 మందికి పైగా వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన కార్మికశాఖ మంత్రులు, ఆ శాఖ కార్యదర్శులు, పలువురు వీఐపీలు పాల్గొంటారు. కార్మికుల సమస్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకునేందుకు ఈ సదస్సు వేదిక కానుంది.

నూతన వైద్య కళాశాలల నిర్మాణానికి చేయూతనివ్వండి

కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రికి రాష్ట్ర మంత్రి విడదల రజని వినతి




కేంద్ర మంత్రి మాండవీయతో రాష్ట్ర మంత్రి రజని

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: ఏపీలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలలకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం అందించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ మన్సుక్ మాండవీయను కోరారు. ఆమె బుధవారం కేంద్రమంత్రిని న్యూఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్యశాఖకు సంబంధించి పలు విషయాలను చర్చించి వినతిపత్రాలు ఇచ్చారు. పాడేరు, మచిలీపట్నం, పిడుగురాళ్లలో వైద్యకళాశాలల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాలో కనీసం ఒక ప్రభుత్వ వైద్య కళాశాల ఉండేలా 16 వైద్య కళాశాలల నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఇప్పటికే వీటి నిర్మాణం ప్రారంభమైందన్నారు. వీటికి తగిన ఆర్థికసాయం అందించాలని కోరారు. వైద్య ఆరోగ్య రంగంలో ఏపీలో తీసుకొస్తున్న కీలక మార్పులకు కేంద్ర ప్రభుత్వ చేయూత తోడైతే ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. రాష్ట్రంలో త్వరలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేయబోతున్నట్లు చెప్పారు.

పూర్తిస్థాయిలో సహకరిస్తాం

ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాండవీయ మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య కళాశాలల నిర్మాణానికి సాయం చేస్తామని చెప్పారు. 10 లక్షల జనాభా దాటిన ప్రతి జిల్లాకు ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మించుకునే అవకాశం ఉందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానానికి, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి కూడా సహకరిస్తామని తెలిపారు. ఏపీలో రైల్వే, ఈఎస్ఐ ఆస్పత్రుల పరిధిలో వైద్య కళాశాలల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపితే వెంటనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర మంత్రి రజని మీడియాతో మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌ల అధ్యయనానికి సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలనకు ప్రధాని నరేంద్రమోదీని ఏపీకి తీసుకురావాలని యోచిస్తున్నట్లు కేంద్రమంత్రి చెప్పారన్నారు. రాష్ట్రంలో వైద్యం, ఆరోగ్యం విషయంలో సీఎం వైఎస్ జగన్ ముందుకెళ్తున్న తీరును ఆయన ప్రశంసించారని తెలిపారు. రాష్ట్ర మంత్రి వెంట ఏపీ వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఏపీభవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌ప్రకాష్ తదితరులున్నారు.



మానవుని చర్యలూ, ప్రతిచర్యలూ పరిమిత శాస్త్రీయ సత్యాల మీదా, అంచనాల మీదా ఆధారపడి ఉన్నాయి. ఈ విధానం వల్ల ఎన్నటికీ అసలైన పరిష్కారాన్ని అందుకోలేరు.

– మసనోబు ఫుకుఓకా

సాక్షి

గురువారం, ఆగస్టు, 25

వాడితే వాత పెడతారా?!

చూస్తూ చూస్తుండగానే వామనుడు త్రివిక్రమావతారం దాల్చడమంటే ఇదే! ఆరేళ్ళ క్రితం 2016 జూలైలో నెలకు కేవలం కోటి రూపాయల లోపలున్న 'యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్' (యూపీఐ) లావాదేవీల విలువ ఈ జూలైలో ఏకంగా రూ. 10.6 లక్షల కోట్ల స్థాయికి చేరింది. సామాన్యులు, పేదలకు సైతం బ్యాంకింగ్‌ను అందుబాటులోకి తెచ్చి, చేతిలోని స్మార్ట్‌ఫోన్‌తో రోజువారీ లావాదేవీలను జరిపే సాంకేతికతను అందించడం అపూర్వ విజయమే! ప్రపంచంలోని దేశదేశాలు ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టి, ఇండియా వైపు తిరిగి చూసేలా చేసిన డిజిటల్ చెల్లింపుల విప్లవమిది. ఈ యూపీఐ చెల్లింపులపై సర్వీస్ ఛార్జ్ వేయాలా, వద్దా అన్నది తాజా ప్రశ్న. భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) చర్చాపత్రం గత వారం ఈ అంశాన్ని లేవనెత్తింది. రాజకీయ విమర్శలకు వెరచి, ఆర్థికశాఖ తక్షణమే బరిలోకి దిగింది. భారం మోపే ఆలోచనను కొట్టిపారేసింది.

ఆన్‌లైన్ చెల్లింపులకు సంబంధించి దేశంలో ఆర్టీజీఎస్, నెఫ్ట్, ఐఎంపీఎస్, యూపీఐ, క్రెడిట్, డెబిట్ కార్డులు, ప్రీపెయిడ్ వ్యాలెట్లు – ఇలా అనేక వ్యవస్థలున్నాయి. ఆర్బీఐ పక్షాన డిజిటల్ కరెన్సీ సైతం రానుంది. భారత జాతీయ చెల్లింపుల కార్పొరేషన్ (ఎన్పీసీఐ) వారి 'యూపీఐ' పల్లెపల్లెకూ పాకి, మొత్తం రిటైల్ నగదు బదలీల్లో 82 శాతం వాటా దక్కించుకోవడానికి పలు కారణాలు. మొబైల్ ఇంటర్నెట్ విప్లవం, బాదరబందీలు లేని బ్యాంకు ఖాతాల 'జన్‌ధన్ యోజన', నగదు రహిత చెల్లింపులపై సర్కారు మొగ్గు... ఇలా అనేకం ఈ విజయగాథ వెనక ఉన్నాయి. యూపీఐలో అప్పటికే నిర్ధారించిన ఫోన్ నంబర్ల ద్వారా ఒక బ్యాంకు ఖాతా నుంచి మరో బ్యాంకు ఖాతాకు నగదు బదలీ అవుతుంది. డబ్బు అందుకున్నవారు సదరు లావాదేవీ విలువలో 0.3 శాతాన్ని (తక్కువలో తక్కువ రూ. 100) రుసుముగా గతంలో చెల్లించాల్సి వచ్చేది. నగదు రహిత లావాదేవీల్ని పెంచడానికి 2020 జనవరిలో ప్రభుత్వం ఆ ఫీజును తొలగించింది. అప్పటి నుంచి యూపీఐ తారాపథాన్ని తాకింది. ప్రజలపై భారం ఎత్తేసినా, అసలంటూ యూపీఐ కార్యకలాపాల నిర్వహణకైతే 0.25 శాతం మేర ఖర్చవుతున్నట్టు ఆర్బీఐ అంచనా. ఆర్థిక మధ్యవర్తులకు పడే ఆ లోటును కేంద్ర నిధులతో సర్కారు భర్తీ చేస్తూవస్తోంది. ఇప్పుడు ఆర్టీజీఎస్, నెఫ్ట్ లానే యూపీఐ నిర్వహణ భారాన్నీ జనంపై వేయాలని ప్రతిపాదన.

సుమారు రూ. 800 విలువైన లావాదేవీకి ఇచ్చే బ్యాంకు, తీసుకొనే బ్యాంకు, ఎన్పీసీఐ, యూపీఐ యాప్‌లు అన్నింటికీ కలిపి రూ. 2 ఖర్చవుతుందట. ప్రతి సేవకూ కొంత ఖర్చయ్యే మాట నిజమే. అలాగని అన్నిటికీ రుసుము వసూలు చేస్తామనడం సరికాదు. కొన్ని సేవలకు పబ్లిక్ సబ్సిడీ అవసరం. ఇవాళ యూపీఐ సేవలు లాంటివే. ఏ వ్యవస్థ అయినా నిలదొక్కుకోవాలంటే, అది వాడే వారికి భారం కాకూడదనేది సాధారణ సూత్రం. ఛార్జీల్లేని యూపీఐ మరింత కాలం కొనసాగాలం టున్నది అందుకే. వినియోగదారులకు సౌకర్యం, మన ఆర్థిక వ్యవస్థకు ఒనగూరే లబ్ధి రీత్యా చూస్తే యూపీఐ 'డిజిటల్ జనహిత' వ్యవస్థ. ఆర్థిక శాఖే ఆగస్టు 21న ఆ మాట అన్నది. నిర్ణీత అవసరాన్ని తీరుస్తూ, ఎవరైనా వాడుకొనేలా ఉచితంగా అందుబాటులో ఉంటేనే ప్రజాశ్రేయో వ్యవస్థ. లేదంటే అది కొందరి స్వలాభానికే పరిమితమై, చివరకు సంక్షేమం క్షీణిస్తుందని ఆర్థిక శాస్త్రవేత్తల హెచ్చరిక.

నల్లధనం చెల్లింపులకు చోటివ్వకుండా, పారదర్శకమైన డిజిటల్ మార్గంలో పురోగమించడం దేశానికి మంచిదని భావిస్తున్న కేంద్రం దీని నిర్వహణ వ్యయాన్నీ భరించాలి. పోనుపోనూ అది బరువయ్యే మాట నిజమే. వచ్చే 2023–24 నాటికి డిజిటల్ చెల్లింపులు ఏటా రూ. 120 లక్షల కోట్లకు చేరతాయని అంచనా. ప్రభుత్వ సబ్సిడీ బిల్లు రూ. 30 వేల కోట్ల పైకి ఎగబాకవచ్చు. కానీ, సంక్షేమ రాజ్యంలో ప్రభుత్వాలు ఆ భారానికి సిద్ధపడాలి. యూపీఐ లావాదేవీల్లో 1.4 శాతానికి పైగా విఫలమవుతున్నాయనీ, ఇటీవల ఆ రేటు పెరుగుతోందనీ, ఈ చెల్లింపు వ్యవస్థను దీర్ఘకాలం సమర్థంగా నడపాలంటే వినియోగ ఛార్జ్ తప్పదనే వారున్నారు. ఒకవేళ రేపు తప్పనిసరై ఛార్జ్ చేయాల్సి వచ్చినా ఇటు కస్టమర్ల, అటు ఆపరేటర్ల ప్రయోజనాల సమతూకంతో దాన్ని నిర్ణయించాలి. నిర్ణీత మొత్తం లోపల ఛార్జ్ మినహాయించడం ఒక మార్గం. లేదంటే నెలకు నిర్ణీత యూపీఐ లావాదేవీలు ఉచితమంటూ, అది దాటితేనే ఛార్జ్ అన్నది మరో మార్గం.

ప్రతి యూపీఐ లావాదేవీకీ ఒక పైసా వంతున స్వల్పఛార్జ్ వసూలు చేసినా, ఈ జూలైకి ముగిసిన ఏడాదికి రూ. 5,842 కోట్ల ఆదాయం వచ్చేదని కొందరు లెక్కలు కడుతున్నారు. వెయ్యిసార్లు యూపీఐ వాడితే... కస్టమర్ పది రూపాయలే చెల్లించాల్సి వస్తుందనీ, ఈ నామ మాత్రపు రుసుముతో కొత్త ఆవిష్కరణలకూ, మెరుగుదలకూ వీలుంటుందనీ చెబుతున్నారు. పైకి ఇవన్నీ బాగానే ఉన్నా, కొన్నదానికీ, తిన్నదానికీ జీఎస్టీ సహా రకరకాల పన్నులు కడుతున్న ప్రజలు తమ నగదు చెల్లింపులకూ సర్కార్ వారి బాదుడు ఆలోచనను స్వాగతిస్తారా అన్నది ప్రశ్న. ఫలితంగా వారు మళ్ళీ డిజిటల్ కన్నా నగదు చెల్లింపుల వైపే మొగ్గే ప్రమాదం ఉంది. పెద్ద మొత్తాల బదిలీకి వాడే ఇతర ఆన్‌లైన్ చెల్లింపు విధానాలకు పాలకులు సబ్సిడీ ఇవ్వకున్నా ఫరవాలేదేమో కానీ, కోట్లాది సామాన్యుల్ని డిజిటల్ వైపు నడిపించిన యూపీఐని అపురూపంగా చూసుకోవడం ప్రస్తుతం అవసరం. అతి ఛార్జీలతో ఆన్‌లైన్ చెల్లింపుల్ని నిరుత్సాహపరిస్తే డిజిటల్ లక్ష్యమే దెబ్బ తింటుంది. కథ మళ్ళీ మొదటికి వస్తుంది!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణమాసం, **తిథి:** బ.త్రయోదశి ఉ.9.55 వరకు తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** పుష్యమి సా.4.47 వరకు, తదుపరి ఆశ్లేష **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.9.56 నుండి 10.46 వరకు తదుపరి ప.2.56 నుండి 3.46 వరకు **అమృతఘడియలు:** ఉ.9.40 నుండి 11.24 వరకు

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం : 6.18
రాహుకాలం : ప.1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

రామోజీ... రామ రామ!

ఏదో దోపిడీ జరిగిపోతోందంటూ పేజీలకు పేజీల ఎల్లో విషం

మార్గదర్శిపై సుప్రీంలో రాష్ట్ర ప్రభుత్వం అప్పీలు చేయటమే అసలు కారణం

ద్రోణాచార్యుడిని పడగొడితే తప్ప తాము బతకజాలమని తెలుసుకున్నాకే అశ్వత్థామ మరణించాడనే అబద్ధాన్ని గట్టిగా చెప్పి... అది మనిషి కాదు ఆ పేరున్న ఏనుగనే సత్యాన్ని వినిపించనంత మెల్లగా చెప్పాడు ధర్మరాజు. అది ధర్మాన్ని గెలిపించడం కోసం!!.

ఇక్కడ పూర్తిగా వలువలూడదీసుకుని పత్రికనే అడ్డం పెట్టుకున్న రామోజీరావు వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డిని పడగొట్టడం తన తరంకాదనే నిజాన్ని దిగమింగుకోలేక రోజూ ఆరు కాలాల్లో అబద్ధాలనే అచ్చేస్తుంటాడు. ఆ అక్షరాల్లో నిజమనేది వచ్చిపోయిందన్నదే ఇక్కడ వచ్చి నిజం!. ...

ఒక కుట్ర ప్రకారం... రెండు రోజులుగా 'దివాలా మాటున దోపిడీ... 10వేల కోట్ల ఆస్తుల్ని 500 కోట్లకు అమ్మేస్తారా..' అంటూ రకరకాల వార్తలు వండుతున్న రామోజీరావుకు గానీ... ఆయన చెప్పినట్టల్లా పలికే తెలుగుదేశం గోబెల్స్‌కు గానీ వేస్తున్న ప్రశ్న ఒక్కటే?. మీరు చెబుతున్నట్లే ఆ ఆస్తుల విలువ 10వేల కోట్లే అనుకుందాం. ఓ 3వేల కోట్లకో... 2వేల కోట్లకో... వెయ్యి కోట్లకో.. పోనీ ఇంతెందుకు... కనీసం 550 కోట్లకు బిడ్ వేసినా మీకే దక్కేవి కదా? ఈ ఓపెన్ టెండర్లలో ఎవరైనా పాల్గొనవచ్చంటూ 2019 మార్చి 8న మీ 'ఈనాడు' పత్రికలోనే ఎన్సీఎల్‌టీ ప్రకటన ఇచ్చింది కదా? అప్పుడేం చేశారు రామోజీరావు గారూ? మీరెందుకు టెండర్ వేయలేదు? మీ తెలుగుదేశం మిత్రులచేత టెండర్ ఎందుకు వేయించలేదు?



ఏది నిజం?

ప్రతి వాక్యం అబద్ధమే. టెండర్లలో పాల్గొన్న కంపెనీల నుంచి... టెండరు గెలుచుకున్న కంపెనీకి దక్కే ఆస్తుల వరకూ అన్నీ అశ్వత్థామ తరహా అర్ధసత్యాలే. ఇదీ... రామోజీ పెంచి పోషించిన పాత్రికేయం. తొలి నుంచీ ఈ టెండర్లలో వై.ఎస్.జగన్ నీడ కనిపిస్తోందంటూ... రాంకీ ఎస్టేట్స్, శ్యామరాజు కంపెనీ వంటివి పాల్గొన్నాయని, ఇందులో రాంకీ సంస్థకు జగన్ కేసుతో సంబంధం ఉందనే అంశాన్ని ప్రస్తావించారు. కానీ ఇదే టెండర్లలో హైదరాబాద్ ఇన్వెస్టరు శ్రీని రాజుకు చెందిన ఐల్యాబ్స్ సంస్థ, జాతీయ స్థాయి బ్యాంకింగ్ కంపెనీ అయిన కోటక్ మహీంద్రా, ఢిల్లీకి చెందిన ప్రుడెంట్ ఏఆర్‌సీ, రుద్రవీర్య డెవలపర్స్, యూవీ ఏఆర్‌సీ వంటివి కూడా పాల్గొన్నా... వాటి పేర్లు రాయలేదు. అనిల్ అంబానీకి చెందిన టెలికం సంస్థలు ఇలాగే దివాలా బారినపడితే యూవీ సంస్థ రూ.16,000 కోట్లకు బిడ్ వేసింది కూడా. ఇవన్నీ ఒకవేళ 'ఈనాడు' ప్రస్తావించి ఉంటే... ఇతర కంపెనీల్లానే ఈ కంపెనీకి కూడా దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంగా బిడ్లు వచ్చాయనే వాస్తవం పాఠకులకు అర్థమయ్యేది. ఐబీసీ (దివాలా చట్టం) అనేది కేంద్రం తెచ్చిన చట్టమని... దాని కింద దివాలా తీసిన కంపెనీల విషయంలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకునేందుకు జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్‌కు (ఎన్సీఎల్‌టీ) తగు అధికారం ఉందని వారికి తెలిసేది. అదే రామోజీరావు భయం కూడా. అందుకే అపోహలు పెరిగేలా రెండు కంపెనీల పేర్లు మాత్రమే రాశారు.

10 వేల కోట్ల ఆస్తులు... 500 కోట్లకా?

ఇక విలువ విషయానికొద్దాం. నిజంగానే 10వేల కోట్ల విలువైన ఆస్తులు రూ.500 కోట్లకు కట్టబెట్టేశారా? చాలా అమాయకంగా.. సిగ్గూఎగ్గూ వదిలేసి మరీ 'ఈనాడు' రాసిన అంశమిది. 'ఇంత చౌకగా విక్రయించేయడానికి బ్యాంకులు కూడా ఎందుకు అంగీకరించాయన్నది అంతు పట్టని అంశం. వీటిని విడివిడిగా వేలం వేసినా ఇంతకు మించిన ధర వచ్చేది కదా?'' అంటూ అమాయకత్వం ముసుగులో తన మనసులోని దౌర్భాగ్యపు కుట్రలన్నిటినీ బయటపెడుతూ రామోజీ వేసిన ప్రశ్నలివి.

నిజమే? ఒక్కొక్క ఆస్తినీ విడిగా విక్రయిస్తే బోలెడంత విలువ వచ్చేది. బ్యాంకులకు తమ అప్పుల కన్నా అధికంగా వేల కోట్లు వచ్చేవి. ఏం? మరి బ్యాంకులకు ఈ సంగతి తెలియదా? అన్ని వేల కోట్లు వదిలేసుకుని ముష్టి రూ.541 కోట్లకు ఎందుకు ఆశపడ్డాయి? ఎందుకంటే అందులో పేర్కొన్న ఏ ఒక్క ఆస్తి కూడా బహిరంగ వేలంలో విక్రయించేందుకు అవకాశాలు లేవు కాబట్టి. ప్రతి ఆస్తీ రకరకాల కక్షిదారులతో బోలెడన్ని కేసులతో ముడిపడి ఉంది కాబట్టి. ఒకవేళ అంతా సజావుగా జరిగి... ఎన్సీఎల్‌టీ ఉత్తర్వుల ప్రకారం రూ.541 కోట్లకు ఎర్తిన్ ప్రాజెక్ట్స్ సంస్థ వీటిని దక్కించుకున్నా... అది ఇంకా రకరకాల కేసుల్లో గెలవాల్సి ఉంది. వీటిలో పేర్కొన్న ఆస్తుల్లో చాలా వాటి లీజుల్ని, భూ కేటాయింపుల్ని ఇప్పటికే స్థానిక ప్రభుత్వాలు రద్దు చేశాయి. ఇవన్నీ చూశాక... తమకు నికరంగా దక్కేది, అది కూడా కేసులన్నీ తేలి ఎప్పటికి దక్కుతుందో తెలియని ఆస్తుల కోసం అన్ని కోట్లు ఎవరైనా ఎందుకు పెడతారు? అందుకే పాల్గొన్న వారిలో... ఎర్తిన్ ప్రాజెక్ట్స్ రూ.541 కోట్లతో అధిక మొత్తాన్ని కోట్ చేసిన సంస్థగా నిలవగా... మిగిలినవి అంతకన్నా చాలా తక్కువ మొత్తాన్ని కోట్ చేశాయి. రామోజీకి నిజాలతో పనిలేదు కాబట్టి... ఇవేవీ చెప్పకుండానే చాలా విలువైన ఆస్తుల్ని కారుచౌకగా కట్టబెట్టేశారంటూ కారుకూతలకు దిగారు.

మిగతా కంపెనీల గురించి మీకు తెలియదా?

కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ నివేదిక ప్రకారం... 2016లో వచ్చిన దివాలా చట్టం ప్రకారం పరిష్కారమైన కేసుల్లో 47 శాతం లిక్విడేషన్ ప్రక్రియ ద్వారానే సాధ్యమయ్యాయి. లిక్విడేషన్ అంటే ఆస్తుల్ని వేలం వెయ్యటం ద్వారా. 14 శాతం కేసులు మాత్రం పరిష్కార ప్రక్రియ ద్వారా పూర్తయ్యాయి. అంటే... బిడ్లు పిలిచి విజయవంతమైన బిడ్డరుకు ఏకమొత్తంగా కంపెనీని అప్పగించటం. ఇలా అప్పగించిన సందర్భాల్లో బ్యాంకులు తమకు రావాల్సిన బకాయిల్లో అత్యధికంగా 90 శాతం మొత్తాన్ని కోల్పోయినట్లు కోటక్ సంస్థ తెలియజేసింది. అంటే.. 10వేల కోట్ల బకాయిలుంటే వాటికి దక్కింది వెయ్యికోట్లే అన్నమాట. తాజా ఇందూ ప్రాజెక్ట్స్ విషయం చూసినా అంతే. రూ.4,138 కోట్ల రుణాలకు గాను ఎర్తిన్ ప్రాజెక్ట్స్ వేసిన బిడ్ 541 కోట్లు. అంటే దాదాపు 13 శాతం. ఈ లెక్కన చూస్తే బ్యాంకులు తమ రుణాల్లో 87 శాతాన్ని వదులుకోవాల్సి వచ్చింది. దీన్నిబట్టి తేలేదేమిటి? వీలు కుదిరిన ప్రతి కేసులో బ్యాంకులు గానీ, పరిష్కార నిపుణుడు గానీ తమకు ఎక్కువ మొత్తం రావటానికి ఆస్తుల వేలానికే మొగ్గు చూపుతాయి. కానీ ఆయా ఆస్తులు రకరకాల కేసులతో ముడిపడి, వేలానికి సాధ్యం కానప్పుడే తమ అప్పును రాబట్టుకోవటానికి రిసల్యూషన్ ప్రక్రియకు అవి అంగీకరిస్తాయి. ఇంత చిన్న విషయం రామోజీకి తెలియదా? తెలియక కాదు. తామేం రాసినా తమ పాఠకులు అమాయకంగా నమ్మేస్తారన్నదే ఆయన ధైర్యం!.

ముఖ్యమంత్రి మేనమామ కొడుకు చేరితే..?

నిజానికి ఎర్తిన్ ప్రాజెక్ట్స్ వేసిన బిడ్‌కు పరిష్కార నిపుణుడు ఓకే అన్నాక... ఎన్సీఎల్‌టీ హైదరాబాద్ బెంచ్ దీన్ని ఆమోదిస్తూ గతేడాది అక్టోబరు 1నే ఉత్తర్వులిచ్చింది. తరవాత ఆ కంపెనీ మెల్లగా చెల్లింపులు చేస్తూ... దానికోసం ఇన్వెస్ట్‌మెంట్లు కూడా సమీకరిస్తోంది. దీన్లో భాగంగానే ఈ ఏడాది మేలో తాము ఇన్వెస్ట్‌మెంట్ చేశామని, తమ కుమారుడు డైరెక్టరుగా చేరాడని వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మామ రవీంద్రనాథ్ రెడ్డి మంగళవారం చెప్పారు కూడా. అయినా టెండర్లో ఆస్తులు దక్కించుకున్న సంస్థలో ఏడు నెలల తరవాత ఓ వ్యక్తి డైరెక్టరుగా చేరితే... అదంతా ముఖ్యమంత్రి చక్రం తిప్పితేనే సాధ్యమైందన్న దౌర్భాగ్యపు రాతలు రాసిన వారిని ఏమనాలి? మేన మామ కొడుకు డైరెక్టరుగా చేరాడని దాన్ని ముఖ్యమంత్రికి అంటగడితే ఎలా? మీ ఆస్తులు మీ మేన మామ కొడుకులకు ఇచ్చేస్తారా రామోజీరావు గారూ? అందరూ మీలా బినామీలను నమ్ముకుని రాజ్యం చేస్తుంటారనుకున్నారా? ఉద్యోగులను సైతం బినామీగా వాడుకుని మీరు సృష్టించుకున్న ఫిలిం సిటీ గురించి తెలియనిదెవరికి? చట్టాల ఉల్లంఘనకు పక్కదార్లు వెతకటంలో మీ తరవాతే కదా ఎవరైనా? లీజుల పేరిట బయటివారితో పాటు సొంత తోడల్లుడి ఆస్తుల్ని సైతం కబ్జా చేసిన చరిత్ర మీది. బంధువుల గురించి మీకు తెలిసినంతగా వేరెవరికీ తెలియదన్నదే నిజం కూడా!!.

అసలు లేపాక్షి కథ ఇదీ...

లేపాక్షి నాలెడ్జ్ సిటీ గురించి రాసిన రాతల్లోనూ వాస్తవాలు దేవతా వస్త్రాలే. ఈ భూములన్నీ బెంగళూరు విమానాశ్రయానికి అతి సమీపంలో ఉంటాయని, చాలా విలువైనవని, సరిహద్దు వీటితోనే ఆరంభమవుతుందని ఊహలను అచ్చేశారు. వాస్తవానికి అనంతపురం– బెంగళూరు మధ్య దూరం 240 కిలోమీటర్లు. వీటికి మధ్యలో ఉంటుంది చిలమత్తూరు. దాన్ని ఆనుకునే గోరంట్ల మండలం. ఎటు చూసినా 120 కిలోమీటర్ల దూరం. రెండూ చిత్రావతి పరివాహక ప్రాంతాలే అయినా... 1996లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు పరగోడు వద్ద కర్ణాటక ఓ బ్యారేజీ నిర్మించింది. దీంతో ఈ ప్రాంతం ఎండిపోయి బోర్లలోనూ నీరు పడని స్థితికి చేరింది. పంటలు లేక, భూగర్భ జలాలు లేక అల్లాడుతున్న ఆ గ్రామాల్లో పరిశ్రమలొస్తే తప్ప పరిస్థితి మారదని భావించి వైఎస్సార్ ప్రభుత్వం 2006లో సైన్స్ సిటీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏపీఐఐసీ భూసేకరణకు ప్రకటనలివ్వగా... నీటి వసతి లేని భూములు తమకెందుకంటూ సైన్స్ సిటీ వెనక్కి వెళ్లిపోయింది. ఇతర పరిశ్రమల్ని ఆహ్వానించగా ఎవ్వరూ ముందుకు రాకపోవటంతో... భూసేకరణ నిలిపేశారు కూడా. తరవాత లేపాక్షి సంస్థ ముందుకు రావటంతో... వారిచ్చిన డబ్బుతోనే భూసేకరణ చేసింది ఏపీఐఐసీ. ఈ వాస్తవాల్ని ఎక్కడా చెప్పని 'ఈనాడు'... అడుగడుగునా అసత్యాలతో అదో పెద్ద కుంభకోణమని, చాలా విలువైన భూముల్ని ఆనాడే వైఎస్ ప్రభుత్వం లేపాక్షికి కట్టబెట్టేసిందని రాసుకొచ్చింది. మరీ ఇంత దుర్మార్గమా రామోజీ? మీ రాతల్లో నిజమెంతని మిమ్మల్ని మీరు ఎన్నడైనా ప్రశ్నించుకున్నారా?

100 కిలోమీటర్లంటే అంత దగ్గరా?

విశాఖ– శ్రీకాకుళం మధ్య దూరం 100 కిలోమీటర్లు. మరి విశాఖకు అత్యంత సమీపంలో ఉన్నట్టేనా? విశాఖలో ఉన్న రేట్లే శ్రీకాకుళంలోనూ ఉంటాయా? ఎందుకీ దగుల్బాజీ రాతలు? నిజానికి అప్పట్లో ఎకరా 20వేలు చెప్పినా ఎవ్వరూ ముందుకు రాలేదు. ఎందుకంటే భూగర్భ జలాలు లేవు. వర్షం ఊసే ఉండదు. అలాంటి జిల్లాలో పరిశ్రమలొస్తాయంటే... వాటికోసం నీటి వసతి కల్పించటమూ నేరమేనట రామోజీ దృష్టిలో!!. నీళ్లు లేకుంటే పరిశ్రమలు ఎందుకొస్తాయి రామోజీరావుగారూ? ఇలాంటిదేదో మీ చంద్రబాబు చేస్తే భూమీ ఆకాశం బద్దలైపోయేటట్లు ఆయన విజన్‌ని పొగిడేసేవారు కాదూ? ఎక్కడో అనంతపురంలో ఎకరా 70– 80 వేలు కూడా చేయని భూములు ఎకరా రూ.1.75 లక్షల చొప్పున విక్రయించటమే నేరంగా కనిపించిందా? హైదరాబాద్ నడిబొడ్డున హైటెక్ సిటీ కట్టానని చెప్పే మీ మిత్రుడు.. దాని పక్కనే గచ్చిబౌలిలో 500 ఎకరాలను ఊరూపేరూ లేని బిల్లీరావు, పేట్‌రావులకు ఎకరా రూ.50వేల చొప్పున క్రీడల కోసం కట్టబెట్టేస్తే మీకు అదో మహాద్భుతంలా కనిపించడం నిజం కాదా? రాష్ట్రంలో క్రీడలకు మహర్దశ పట్టిందని, ఇక ఒలింపియన్లు కూడా తయారవుతారంటూ రంగురంగుల గ్రాఫిక్స్ చూపిస్తూ మీరు చెలరేగిపోలేదా? ఆంధ్రప్రదేశ్ ఇక క్రీడా రాజధాని కాబోతోందని చెప్పి ఎంతమంది క్రీడాకారుల్లో ఆశలు పుట్టించి చిదిమేయలేదు? ఊరూపేరూ లేని సూట్‌కేసు కంపెనీకి అంతర్జాతీయ కంపెనీతో ఎంఓయూ ఉందంటూ రాష్ట్రంలోని స్టేడియాలను కూడా దోచిపెట్టేందుకు తెరతీసిన మీ నీతి... నిజాయితీ గురించి తెలియనిదెవరికి రామోజీరావు గారూ!!.

ఆ ఆస్తుల వెనక కేసులివీ...

లేపాక్షి నాలెడ్జ్ హబ్ ప్రైవేట్ లిమిటెడ్

స్థలం: మద్రిమాకులపల్లి, చిలమత్తూరు మండలం, అనంతపురం జిల్లా
విస్తీర్ణం: 8,648 ఎకరాలు

అనంతపురంలో లేపాక్షి నాలెడ్జ్ హబ్‌ను అభివృద్ధి చేసేందుకు ఏపీఐఐసీ 8,648 ఎకరాలు కేటాయించింది. ఈ భూములకు సంబంధించి రైతులతో కొన్ని సమస్యలున్నాయి. పైపెచ్చు వీటి విక్రయాలు/ రిజిస్ట్రేషన్లపై ఏపీ ప్రభుత్వం నిషేధం విధించింది. సీబీఐ 2013లో ఛార్జిషీటు నమోదు చేసింది. తరవాత 8,648 ఎకరాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తు చేసింది కూడా. వీటన్నిటికీ తోడు ఈ భూములను అభివృద్ధి చేయలేదనే కారణంతో లేపాక్షి కేటాయింపులను నాటి ప్రభుత్వం రద్దు చేసింది కూడా. దీనిపై లేపాక్షి సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించి తాము తనఖా పెట్టిన 4,396 ఎకరాలకు సంబంధించి... ప్రభుత్వ రద్దుపై స్టే తెచ్చుకుంది. విచారణ కొనసాగుతోంది.

అస్తిత్వ రియల్టర్స్ అండ్ సింధూర ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్

స్థలం: బాచుపల్లి, కుత్బుల్లాపూర్ మండలం, మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ
విస్తీర్ణం: 11.5 ఎకరాలు

హైదరాబాద్‌లోని మియాపూర్‌లో... సింధూర ప్రాపర్టీస్‌తో కలిసి ఏకమొత్తంగా హౌసింగ్ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయాల్సి ఉంది. కానీ అర్బన్ ల్యాండ్ సీలింగ్, రహదారి విస్తరణ తదితర సమస్యలున్నాయి. ఆ భూమిలో కొంత భాగం రహదారి విస్తరణలో పోయింది కూడా.

సుందరీ థీమ్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్


స్థలం: కొల్తూరు, మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ
విస్తీర్ణం: 35 ఎకరాలు

షామీర్ పేటలో గృహనిర్మాణ ప్రాజెక్టు కోసం 35 ఎకరాలు కొన్నారు. అందులో కొంత భూమి కన్జర్వేషన్ జోన్ పరిధిలోకి వస్తోంది. దాంతో చాలా తక్కువ భూమి మాత్రమే హౌసింగ్‌కు అందుబాటులో ఉంది.

వీకే ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్

స్థలం: మాదాపూర్, శేరిలింగంపల్లి మండలం, తెలంగాణ.
విస్తీర్ణం: 5.27 ఎకరాలు

హైదరాబాద్‌లోని హైటెక్ సిటీకి సమీపంలోని దుర్గం చెరువును ఆనుకుని ఉన్న 5.27 ఎకరాల స్థలం ఇది. కానీ ఆ భూములు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలోకి వస్తాయని ప్రభుత్వం నోటీసులివ్వటంతో ఈ ప్రాజెక్టుకు సమస్యలు తలెత్తాయి.



లేపాక్షి సెజ్ కోసం 2008లో సేకరించిన భూముల్లో కోడూరు, నరమద్దేపల్లి (చిలమత్తూరు) భూములకు అప్పట్లోనే.. ఎకరాకు రూ. 5 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకూ ధరలు పలుకుతున్నట్లు ఆర్డీవో, సర్వేయర్‌లు నివేదికలు ఇచ్చారంటూ 'ఈనాడు' కట్టుకథలు అల్లేసింది. వాస్తవానికి 2008లో అక్కడి భూముల మార్కెట్ విలువ ఎంత ఉందో చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ అధికారికంగా చెప్తున్న పత్రాలు ఇవి. వీటి ప్రకారం చిలమత్తూరులో భూముల మార్కెట్ విలువ ఎకరాకు రూ. 20,000 నుంచి రూ. 74,500 వరకూ మాత్రమే ఉన్నాయి. అలాగే, కోడూరులో భూముల మార్కెట్ విలువ ఎకరాకు రూ. 24,000 నుంచి రూ. 53,000 వరకూ మాత్రమే ఉన్నాయని తేటతెల్లం అవుతోంది.

రెడ్‌ఫోర్ట్ అక్బర్ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్

స్థలం: బాచుపల్లి, హైదరాబాద్. తెలంగాణ
విస్తీర్ణం: 90 ఎకరాలు

ప్రైవేట్ ఈక్విటీ ఇన్వెస్టర్లతో కలసి జాయింట్ వెంచర్ కింద బాచుపల్లిలో టౌన్‌షిప్ నిర్మించాలి. హౌసింగ్ బోర్డ్‌కుచెందిన డెక్కన్ ఇన్‌ఫ్రా అండ్ ల్యాండ్ హోల్డింగ్స్ లిమిటెడ్ (దిల్) నుంచి ఈ భూములను కంపెనీ పొందింది. 90 ఎకరాల కోసం 'దిల్'కు రూ.280కోట్లు చెల్లించారు. అందులో అత్యధిక భాగాన్ని 'ఆర్‌ఏపీపీఎల్'లోని జాయింట్ వెంచర్ భాగస్వామి చెల్లించారు. దాంతో ఈ భూముల కేటాయింపుపై న్యాయ వివాదాలు తలెత్తాయి. జాయింట్ వెంచర్ కంపెనీ 'ఆర్‌ఏపీపీఎల్'కు అనుకూలంగా ఆర్బిట్రేషన్ తీర్పు వచ్చింది. కానీ ఈ తీర్పును కోర్టులో 'దిల్' సవాల్ చేసింది. ప్రస్తుతం న్యాయస్థానంలో కేసు పెండింగులో ఉంది.

ఇందూ టెక్‌జోన్ ప్రైవేట్ లిమిటెడ్

స్థలం: మామిడిపల్లి, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ.
విస్తీర్ణం: 150 ఎకరాలు

టీఎస్‌ఐఐసీ శంషాబాద్ వద్ద కేటాయించిన 150 ఎకరాల్లో ఇందూ టెక్‌జోన్ ప్రై వేట్ లిమిటెడ్ ఐటీ సెజ్‌ను నిర్మించాలి. ఈ కేటాయింపుపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ 150 ఎకరాలను ఈడీ జప్తు చేసింది. అనంతరం ఈ కేటాయింపును టీఎస్‌ఐఐసీ రద్దు చేసి ఆ భూమిని స్వాధీనం చేసుకుంటామని 2015, సెప్టెంబరు 24న ప్రకటించింది. దీనిపై కంపెనీ న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే పొందింది. ఈ కేసుతో పాటు... భాగస్వాములు దాఖలు చేసిన ఇతరత్రా కేసులూ ఉన్నాయి.

ఎస్‌పీఆర్ ప్రోపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఇందూ టెక్‌జోన్ ప్రైవేట్ లిమిటెడ్)

స్థలం: మామిడిపల్లి,, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ.
విస్తీర్ణం: 100 ఎకరాలు

టీఎస్‌ఐఐసీ శంషాబాద్ వద్ద అగ్రిమెంట్ ఆఫ్ సేల్ (సేల్ డీడ్ కాలేదు) కింద కేటాయించిన 100 ఎకరాల్లో గృహ నిర్మాణ ప్రాజెక్ట్‌ను చేపట్టాల్సి ఉంది. ఈ కేటాయింపుపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ భూములను ఈడీ జప్తు చేయడంతో ప్రాజెక్టు సాధ్యపడలేదు. దీంతో టీఎస్‌ఐఐసీ ఈ కేటాయింపును రద్దు చేసి వాటిని స్వాధీనం చేసకుంటామని 2015, సెప్టెంబరు 24న ప్రకటించింది.

ఈక్విటీ కేర్ ఇండియా లిమిటెడ్

స్థలం: నాగ్‌పూర్, మహారాష్ట్ర
విస్తీర్ణం: 74 ఎకరాలు

కేర్ హాస్పిటల్స్‌తో జాయింట్ వెంచర్ కింద నాగ్‌పూర్‌లో టౌన్‌షిప్ నిర్మించే ప్రాజెక్ట్ ఇది. 74 ఎకరాల కేటాయింపు కోసం మహారాష్ట్ర ఎయిర్ పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎంఏడీసీ)కు నిధులు చెల్లించారు. కానీ ఎంఏడీసీ ఆ భూములను అప్పగించ లేదు. దాంతో అయితే భూమి ఇవ్వాలని, లేదంటే తమ నిధులను తిరిగి చెల్లించాలని ఎంఏడీసీని ఈక్విటీ కేర్ ఇండియా లిమిటెడ్ సంస్థ 2008 నుంచీ అడుగుతోంది. ఆ అంశం ఇప్పటికీ పెండింగులోనే ఉంది.

'ఇందు'కేనా ఆ చిందులు?

అయినా ఎప్పుడో 11 నెలల కిందట 2021 అక్టోబరు 1న ఎన్సీఎల్‌టీ ఇచ్చిన ఉత్తర్వుల్ని పట్టుకుని... ఏదో ఇవ్వాళే జరిగినట్లుగా పేజీలకు పేజీలు విషం చిమ్మారెందుకు? మీ కథనాన్ని పట్టుకుని టీడీపీ గోబెల్స్ రెచ్చిపోతున్నారెందుకు? శివాలెత్తిపోతున్నారెందుకు? 'మార్గదర్శి' వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో అప్పీలు చేసినందుకా? హైకోర్టులో అనుకూలంగా తీర్పు వచ్చింది కాబట్టి... ఇక సుప్రీంకోర్టులో ఎవరూ సవాల్ చేయకపోతే ఏ కేసూ ఉండదనుకున్నారేమో!!. ఆ హైకోర్టు తీర్పు సరికాదని, మీరు ఎలా తీరుస్తారో కూడా తెలియకుండా 2,600 కోట్ల ప్రజాధనాన్ని చట్టవిరుద్ధంగా సేకరించారని, ఇదేమీ చూడకుండానే హైకోర్టు తీర్పు ఇచ్చింది కాబట్టి సమీక్షించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసేసరికి మీ అంచనాలన్నీ తలకిందులయినట్లున్నాయి. ఆగ్రహంతో ఊగిపోతూ రాత్రికిరాత్రి ఎప్పుడో పాత ఎన్సీఎల్‌టీ ఉత్తర్వులు తీసి... ప్రభుత్వం ఏదో చేసేస్తోందంటూ పతాక శీర్షికల్లో పేజీలకు పేజీలు బురద నింపేశారు. బంధువుల్ని సైతం న్యాయస్థానాలకీడ్చి కోర్టు పోరాటాల్లో పీహెచ్‌డీ చేసిన మీరు... ఈ మాత్రం ఎందుకు ఊహించలేకపోయారు?

భూముల విలువ గురించి మీరే చెప్పాలా?

భూముల విలువ గురించి మీలాంటి వాళ్లు ఎంత తక్కువ చెబితే అంత మంచిది రామోజీరావు గారూ!!. అక్కడ భూముల విలువ ఎకరా రూ.15 లక్షలు పలుకుతుండగా 1.75 వేలు మాత్రమే చెల్లించి ఏపీఐఐసీ సమీకరించిందంటూ నంగనాచి కబుర్లెందుకు? అక్కడ 2008 సమయంలో ఎకరా కనిష్ఠంగా 20వేలు– గరిష్ఠంగా 70 వేలు మాత్రమే పలికిందంటూ స్థానిక అధికారులు ఇచ్చిన పత్రాలు మీరెప్పుడూ చూడలేదా? అయినా ప్రభుత్వ అండతో రెవెన్యూ అధికారుల్ని ఫిలింసిటీ భూముల్లో కూర్చోబెట్టి మరీ బలవంతంగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్న మీకు... పేదల గురించి, వారి భూముల గురించి మాట్లాడే హక్కు ఉందనుకుంటున్నారా? అయినా సీబీఐ ఛార్జిషీటులో పేర్కొన్నంత మాత్రాన అది నిజమైపోతుందా? ఛార్జిషీటులో సీబీఐ ఏం చెప్పినా అవన్నీ ఆరోపణలే కదా? అవే నిజమైనట్లు పేజీలకు పేజీలు విషం చిమ్మటం దేనికి నిదర్శనం? పన్ను కట్టకుండా ఎగ్గొట్టినందుకు మీకు ఐటీ శాఖ నోటీసివ్వటమే కాదు. ఐటీ ట్రిబ్యునల్ కూడా దాన్ని నిర్ధారించింది. అయినా సరే... పై కోర్టుకు... ఆ పైకోర్టుకు అంటూ న్యాయపోరాటాలు సాగించటమే కదా మీకు తెలిసిందల్లా!!.

క్లుప్తంగా

మచిలీపట్నం-కర్నూలు స్పెషల్ ట్రైన్ వేళల్లో మార్పులు



సాక్షి, అమరావతి/మచిలీపట్నం: అమరావతి నుంచి కర్నూలుకు ఇక ఎంచక్కా ఒక రాత్రి రైలు ప్రయాణంతో చేరుకోవచ్చు. ఈ మేరకు మచిలీపట్నం- కర్నూలు స్పెషల్ ట్రైన్(ట్రైన్ నంబర్ 07067) వేళల్లో దక్షిణ మధ్య రైల్వే మార్పులు చేసింది. వారంలో మంగళ, గురు, శనివారాలు నడిచే ఈ రైలు ఇప్పటి వరకు మచిలీపట్నంలో మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరేది. దీంతో ప్రయాణికులకు అసౌకర్యంగా ఉండేది. అర్ధరాత్రి దాటాక కర్నూలు చేరుకోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఈ రైలు వేళల్లో మార్పులు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇక నుంచి ఈ స్పెషల్ ట్రైన్ ప్రతి మంగళ, గురు, శనివారాలు మచిలీపట్నంలో సాయంత్రం 5 గంటలకు బయలుదేరి.. కర్నూలుకు మర్నాడు ఉదయం 6.30 గంటలకు చేరుకుంటుంది. అదే విధంగా అటువైపు నుంచి కూడా కర్నూలులో రాత్రి 8 గంటలకు బయలుదేరి మర్నాడు ఉదయం 7.15 గంటలకు మచిలీపట్నం చేరుకుంటుంది.

ఏపీ పోలీస్, ఎస్పీఎఫ్ మధ్య సద్దుమణిగిన వివాదం

విజయపురిసౌత్: ఇటీవల విజయపురిసౌత్ ఎస్‌ఐ అనిల్‌కుమార్ రెడ్డి నాగార్జునసాగర్ డ్యామ్ పైకి వెళ్లగా అనుమతి కావాలని ఎస్పీఎఫ్ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఏపీ సివిల్ పోలీస్, తెలంగాణ ఎస్పీఎఫ్ మధ్య వివాదం తలెత్తింది. దీంతో ఇరు విభాగాల ఉన్నతాధికారులు సాగర్ డ్యామ్ ఆర్‌ఐ భాస్కర్, విజయపురిసౌత్ ఎస్‌ఐ అనిల్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి రాజీ కుదిర్చారు. ఎస్‌ఐ అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్పీఎఫ్, సివిల్ పోలీసుల మధ్య చిన్న మనస్పర్థల వల్ల వివాదం తలెత్తిందని, ప్రస్తుతం తమ మధ్య ఎటువంటి వివాదాలు లేవని చెప్పారు.

'నూర్‌బాషాలకు అన్ని రంగాల్లో గుర్తింపు'



నియామక పత్రాలు అందజేస్తున్న రసూల్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం నూర్‌బాషాలకు అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం కల్పించి గుర్తింపు నిచ్చిందని నూర్‌బాషా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ సాహెబ్ అన్నారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఓ హోటల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తమ సంఘీయులకు సీఎం వైఎస్ జగన్ సముచిత స్థానం కల్పించారన్నారు. వక్ఫ్ బోర్డులో నూర్ బాషాలకు ప్రాతినిధ్యం కల్పించే అంశాన్ని పరిశీలించాలన్నారు. దూదేకులు అన్న పేరును తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని, తమ సామాజిక వర్గాన్ని నూర్‌బాషా ముస్లింలుగా మాత్రమే పరిగణించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల అధ్యక్షులుగా ఆదం షరీఫ్ (షేక్ బాషా), షేక్ మహ్మద్ రఫీ లను నియమించి నియామకపు పత్రాలు అందజేశారు.

త్వరలో అందుబాటులోకి ముసాఫిర్‌ఖానా

వక్ఫ్‌బోర్డు సమావేశంలో నిర్ణయం

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): ఆంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డు సమావేశం విజయవాడలోని ఆ సంస్థ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగింది. బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా వక్ఫ్ ఆస్తులకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. విజయవాడ పాతబస్తీలోని ముసాఫిర్ ఖానాను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. రూ.14 కోట్లతో నిర్మించిన ముసాఫిర్‌ఖానాను ఇటీవలే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించారు. ఇప్పుడు దీని అద్దెలపై నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. విజయవాడ భవానీపురం గాలీబ్‌షా దర్గా ముతావల్లీలపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసినట్లు తెలిసింది. పెదకాకాని దర్గాపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న వక్ఫ్ ఆస్తుల లీజు పొడిగింపులపై కూడా నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. సుమారు 60 అంశాలపై తొలి రోజు చర్చించినట్లు తెలిసింది. గురువారం రెండో రోజూ సమావేశం కొనసాగనుంది. ముసాఫిర్ ఖానాకు సంబంధించిన పలు అంశాలపై ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్ణయాలు తీసుకోవాలని అంజుమాన్ సంస్థ వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను కోరింది. సంస్థ అధ్యక్షులు రియాజ్ అహ్మద్, పలువురు మైనార్టీ ప్రముఖులు బుధవారం వక్ఫ్ బోర్డు కార్యాలయంలో చైర్మన్ ఖాదర్ బాషాకు వినతిపత్రాన్ని అందించారు. ముసాఫిర్‌ఖానాలో షామియానా, ఇతర వస్తువులు అద్దెకు ఇచ్చే హక్కులకు బహిరంగ టెండర్లను పిలవాలని కోరారు. లేదంటే ముసాఫిర్ ఖానాకు నష్టం వాటిల్లుతుందన్నారు.

శ్రీశైలం, సాగర్ గేట్లు మళ్లీ ఎత్తివేత

- కృష్ణా, తుంగభద్రలో పెరిగిన వరద
- శ్రీశైలం ప్రాజెక్టులోకి 1,55,467 క్యూసెక్కుల ప్రవాహం
- కుడి, ఎడమ కేంద్రాల్లో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి



సాగర్ నుంచి విడుదలవుతున్న నీరు

సాక్షి, అమరావతి/విజయపురిసౌత్: ఎగువన విస్తారంగా వర్షాలు కురవడంతో కృష్ణా, తుంగభద్ర నదుల్లో మళ్లీ వరద ప్రవాహం పెరిగింది. దీంతో శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల రేడియల్ క్రస్ట్ గేట్లు మళ్లీ తెరుచుకున్నాయి. శ్రీశైలం జలాశయం 3 గేట్లు 10 అడుగులు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా సాగర్ జలాశయంలోకి నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయానికి 99,064 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా.. అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరువలో 589.40 (310.2522టీఎంసీలు) అడుగులకు చేరడంతో బుధవారం సాయంత్రం 6 గంటల 15 నిమిషాలకు 4 రేడియల్ క్రస్ట్‌గేట్లు, 8 గంటలకు 6 గేట్లు 5 అడుగులు ఎత్తి 48,222 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. క్రస్ట్‌గేట్లు, విద్యుదుత్పాదనతో కలిసి సాగర్ వద్ద నదిలోకి 84,864 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గరిష్ఠ స్థాయి నీటిమట్టం 590.00 అడుగులు 312.0450 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. ప్రకాశం బ్యారేజీలోకి సాయంత్రం 6 గంటలకు 18,067 క్యూసెక్కులు చేరుతుండగా.. 15,847 క్యూసెక్కులను కృష్ణా డెల్టాకు విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 2,220 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. గోదావరిలో వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ధవళేశ్వరం బ్యారేజీలోకి 4,35,132 క్యూసెక్కులు చేరుతుండగా.. గోదావరి డెల్టాకు 12,700 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 4,15,664 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు.

మూడు రోజులు వానలు!

- ఆవర్తనాల ప్రభావం
- గురు, శుక్ర, శనివారాల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- భారత వాతావరణ విభాగం వెల్లడి

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో మళ్లీ వర్షాలు కురవడానికి పరిస్థితులు అనుకూలంగా మారాయి. కొద్ది రోజులుగా రాష్ట్రంలో వానలు తగ్గాయి. కొన్నిచోట్ల అరకొరగా కురుస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో ఎండలు కాస్తున్నాయి. తాజాగా ఉత్తర బంగాళాఖాతం మీదుగా వాయవ్య బంగాళాఖాతంలో ఒక ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి నైరుతి వైపునకు వంగి ఉంది. మరోవైపు ఉత్తర మధ్య అంతర్భాగ తమిళనాడు, పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన మరో ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది. వీటి ఫలితంగా బుధవారం రాష్ట్రంలో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. అనంతపురం జిల్లా బీకే సముద్రం మండలం రేకులకుంటలో అత్యధికంగా 17.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గురు, శుక్ర, శనివారాల్లో రాష్ట్రంలో కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అనేక చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. శుక్రవారం రాయలసీమలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

బుధవారం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నమోదైన వర్షపాతం (సెంటీమీటర్లలో..)

జిల్లా	ప్రాంతం	వర్షపాతం
అనంతపురం	రేకులకుంట	17.2
సత్యసాయి	రాలంతపూర్	12.8
అనంతపురం	గార్లదిన్నె	10.0
శ్రీకాకుళం	పొందూరు	8.5
విజయనగరం	గచ్చలవలస	6.6
కాకినాడ	ఏలేశ్వరం	6.3
అనకాపల్లి	వడ్డాది	6.0
కాకినాడ	కాకినాడ	5.7
శ్రీకాకుళం	ఇచ్ఛాపురం	5.3
విజయనగరం	కొత్తవలస	5.2
అల్లూరి	వై.రామవరం	4.6
వైఎస్సార్	తలమంచిపట్నం	4.0

'దేవదాయ' సలహాదారుగా శ్రీకాంత్ నియామకానికి బ్రేక్

- ఆయన నియామక జీవోపై స్టే విధించిన హైకోర్టు
- కౌంటర్లు దాఖలు చేయాలని దేవదాయ శాఖతో పాటు శ్రీకాంత్‌కు నోటీసులు



సాక్షి, అమరావతి: జ్వాలాపురపు శ్రీకాంత్‌ను దేవదాయ శాఖ సలహాదారుగా నియమిస్తూ ప్రభుత్వం ఈ నెల 5న జారీ చేసిన జీవో 630పై హైకోర్టు స్టే విధించింది. దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్‌తోపాటు శ్రీకాంత్‌కు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 19కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ సోమయాజులుతో కూడిన ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. దేవదాయ శాఖ సలహాదారుగా శ్రీకాంత్‌ను నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను రాజ్యాంగ, చట్ట విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధికార ప్రతినిధి రాజశేఖరరావు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై సీజే ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వి.వెంకటరమణ వాదనలు వినిపిస్తూ.. శ్రీకాంత్‌ను దేవదాయశాఖ సలహాదారుగా నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు చట్ట విరుద్ధమన్నారు. ఆయనకు ప్రొటోకాల్‌తో కూడిన జీతభత్యాలు చెల్లిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వానికి అవసరమైన సలహాలిచ్చేందుకు అడ్వొకేట్ జనరల్ ఉన్నారన్నారు. దీంతో ధర్మాసనం స్పందిస్తూ.. శ్రీకాంత్ నియామకంపై స్టే ఇస్తున్నట్లు ప్రకటించింది. రాష్ట్రంలో సలహాదారులు రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేసింది. మంత్రులకు సలహాదారులు ఉండటాన్ని చూశాం గాని.. ప్రభుత్వ శాఖలకు సలహాదారులు ఏమిటంటూ ప్రశ్నించింది. ఈ సమయంలో అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ జోక్యం చేసుకొని.. ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఈ వ్యవహారంలో లోతుగా విచారణ జరుపుతామంది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.

ట్రిపుల్ క్రౌన్‌ను ఈదిన తులసీచైతన్య

3 జలసంధులను ఈదిన తొలి ఇండియన్ పోలీస్‌గా రికార్డు



తులసీచైతన్యను అభినందిస్తున్న సీపీ రాణా

విజయవాడ స్పోర్ట్స్: పసిఫిక్ మహా సముద్రంలోని ట్రిపుల్ క్రౌన్ (ఇంగ్లిష్, కటాలినా, 20 బ్రిడ్జెస్) జలసంధుల ఈతను ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన అంతర్జాతీయ స్విమ్మర్ మోతుకూరి తులసీచైతన్య పూర్తి చేశాడు. కటాలినా నుంచి అమెరికా వరకు 35 కిలోమీటర్లు ఉన్న కటాలినా జలసంధి ఈతను 2019లోనే పూర్తి చేశాడు. మిగిలిన రెండు జలసంధులను ఈదేందుకు ఈ ఏడాది జూలైలో ఇంగ్లండ్‌లోని పసిఫిక్ తీరానికి చేరుకున్నాడు. జూలై 26న ఇంగ్లండ్ నుంచి ఫ్రాన్స్ వరకు 52 కి.మీ ఉన్న ఇంగ్లిష్ చానల్ ఈతను 15 గంటల్లో పూర్తి చేశాడు. ఈ నెల 13న న్యూయార్క్‌లోని మన్‌హట్టన్ సముద్ర తీరం చుట్టూ 45 కి.మీ పొడవున్న 20 బ్రిడ్జెస్ జలసంధిని 7.45 గంటల్లో ఈదాడు. తులసీచైతన్య విజయవాడ పోలీస్ కమిషనరేట్‌లో హెడ్ కానిస్టేబుల్. ట్రిపుల్‌క్రౌన్ జలసంధుల ఈతను పూర్తి చేసుకుని తిరిగి విజయవాడ చేరుకున్న తులసీ చైతన్యను పోలీస్ కమిషనర్ టీకే రాణా బుధవారం అభినందించారు. ఈ జలసంధులను ఈదిన మొదటి ఇండియన్ పోలీస్‌గా రికార్డు సాధించడం గర్వకారణమన్నారు.

- తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ కొనసాగింది. దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి క్యూ లైన్ టీబీసీ వద్దకు చేరుకుంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 68,467 మంది స్వామిని దర్శించుకున్నారు.

పారిశ్రామికవేత్త మద్ది లక్ష్మయ్య కన్నుమూత



మద్ది లక్ష్మయ్య (ఫైల్)

చిలకలూరిపేట: ప్రముఖ పారిశ్రామికవేత్త, ఎంఎల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత మద్ది లక్ష్మయ్య (96) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతికకాయాన్ని చిలకలూరిపేటలోని మద్దినగర్‌లో ఉన్న నివాసంలో ప్రజల సందర్శనార్థం ఉంచి సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. లక్ష్మయ్య భౌతికకాయాన్ని వైఎస్సార్ సీపీ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్, వివిధ పార్టీల నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. ఆయనకు భార్య సీతాదేవి, కుమారులు వెంకటేశ్వరరావు, రమేష్, కుమార్తె అరుణ ఉన్నారు. మద్ది లక్ష్మయ్య పొగాకు పరిశ్రమల ద్వారా దేశవిదేశాల్లో గుర్తింపు పొందారు. పల్నాడు జిల్లా గణపవరాన్ని ప్రధాన కార్యాలయంగా చేసుకున్న ఆయన దేశంలోని వివిధ ప్రాంతాల్లో పొగాకు ప్రాసెసింగ్ కంపెనీలు ఏర్పాటు చేశారు. పొగాకు ఎగుమతి రంగంలో పేరుపొందారు. స్వగ్రామం పసుమర్రులో తన తండ్రి మద్ది కామయ్య పేరుతో జెడ్పీ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయించారు. గ్రామంలో తాండవేశ్వరస్వామి ఆలయం, కోదండరామాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు అందించారు. చిలకలూరిపేటలో కృష్ణమహల్ సెంటర్‌లో ఉన్న సీఆర్ క్లబ్‌కు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

మాజీ మంత్రి శనక్కాయల అరుణ కుమారుడిపై కేసు నమోదు

పసి పిల్లల విక్రయ ముఠాతో సంబంధం ఉందని సమాచారం

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): పసి పిల్లల విక్రయానికి సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ మాజీ మంత్రి శనక్కాయల అరుణ కుమారుడు, గుంటూరులో అహల్య నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్‌పై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం పసిపిల్లలను విక్రయిస్తున్న ముఠాను ఏలూరు టూ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు ఇప్పటి వరకు పది మందిని అరెస్ట్ చేశారు. వీరిలో అహల్య నర్సింగ్ హోంలో పని చేసే ఝాన్సీ అనే నర్సు కూడా ఉంది. ఈమె పిల్లలు లేని తల్లిదండ్రుల వివరాలను ఆ ముఠాకు అందజేస్తున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో జరుగుతున్న విషయాలు తెలిసి కూడా చర్యలు తీసుకోకుండా సిబ్బందికి వత్తాసు పలికిన డాక్టర్ ఉమాశంకర్ పేరును ఈ కేసులో 11వ నిందితుడిగా చేర్చారు. ఈ క్రమంలో బుధవారం ఆయన్ను అదుపులోకి తీసుకునేందుకు ఏలూరు టూ టౌన్ పోలీసులు గుంటూరు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ ఉమాశంకర్ అక్కడి నుంచి పరారయ్యాడు. అతని కోసం పోలీసులు వెతుకుతున్నారు.

వ్యాపారాలు చేసే స్వేచ్ఛ నాకుంది

చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి



కడప కార్పొరేషన్: భారత దేశ పౌరుడిగా వ్యాపారాలు చేసే స్వేచ్ఛ తనకుందని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తనయుడు, వైఎస్సార్ జిల్లా చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి చెప్పారు. ఆయన బుధవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనాడు దినపత్రిక అభూత కల్పనలతో తనపై వార్తలు ప్రచురిస్తోందని, టీడీపీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. రామోజీరావు ఎలా వ్యాపారాలు చేస్తున్నారో తాను కూడా అలాగే వ్యాపారం చేస్తున్నానని అన్నారు. ఇందులో ప్రభుత్వానికేం సంబంధముందని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్ బంధువు అయినందువల్లే తనపై బురద జల్లుతున్నారని మండిపడ్డారు. ఎర్తిన్ ప్రాజెక్ట్స్‌కు ఎండీ, సీఈవోలు వేరే ఉన్నారని, కంపెనీ డైరెక్టర్లలో తానూ ఒకడినని చెప్పారు. తనకు ఉన్న షేర్లు కూడా తక్కువేనని, స్నేహితులు కోరితేనే పెట్టుబడి పెట్టానన్నారు. తప్పు చేస్తే సీఎం వైఎస్ జగన్ ఎవరినీ ఉపేక్షించరన్నారు. మైన్ బ్లాస్టింగ్ విషయంలో వైఎస్ ప్రతాప్‌రెడ్డిపైన, అధికారులను బెదిరించారని వైఎస్ కొండారెడ్డిపైన కేసులు నమోదు చేయించారని గుర్తు చేశారు. తన భుజంపై తుపాకీ పెట్టి వైఎస్సార్‌సీపీని కాల్చాలనుకుంటే అది అవివేకమవుతుందన్నారు.

నీటికుంటలో మునిగి ముగ్గురు మృతి

- వైఎస్సార్ జిల్లా నామాలగుండు వద్ద ఘటన
- మృతుల్లో ఇద్దరు అన్నదమ్ములు





సంజీవ కుమార్, గోపాల్ దాస్ (ఫైల్ ఫొటోలు)



బాల శేఖర్ (ఫైల్)

పులివెందుల: సరదాగా ఈతకు వెళ్లి.. నీటి కుంటలో మునిగి ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. ఈ ఘటన వైఎస్సార్ జిల్లా పులివెందుల మండలంలోని నామాలగుండు వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. ప్రొద్దుటూరు టౌన్‌లోని మోడంపల్లెకు చెందిన సంజీవరాయుడు కుమారుడు సంజీవ కుమార్(29) టైల్స్ వ్యాపారం చేస్తుంటాడు. వ్యాపారం నిమిత్తం సత్యసాయి జిల్లా కదిరికి వెళ్లేందుకు మంగళవారం ఉదయం తన తమ్ముడు బాలశేఖర్(19)తో కలిసి కారును అద్దెకు తీసుకున్నాడు. పొట్లదుర్తికి చెందిన డ్రైవర్ గోపాల్ దాస్(22)తో కలిసి కదిరి వెళ్లి టైల్స్ కొనుగోలు చేశారు. తిరిగి వస్తూ కదిరి–పులివెందుల రోడ్డులోని నామాలగుండు వద్ద కారు ఆపారు. ఆ పరిసరాల్లో ఫొటోలు తీసుకొని.. ఈత కోసం నీటి కుంటలో దిగారు. కొద్దిసేపటికి సుడిగుండంలో చిక్కుకొని ముగ్గురూ మృతి చెందారు. రాత్రి అయినా వాళ్లు రాకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్ చేశారు. ఎలాంటి స్పందన లేకపోవడంతో.. కుటుంబసభ్యులు వెంటనే కారు యజమానిని కలిసి జీపీఎస్ సాయంతో నామాలగుండుకు చేరుకున్నారు. కారు అక్కడే ఉండటంతో చుట్టుపక్కల వెతికారు. నీటి కుంట వద్ద చెప్పులు, దుస్తులు కనిపించడంతో వెంటనే పులివెందుల అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్‌ఐ చిరంజీవి ఘటనా స్థలికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలించగా బుధవారం మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టానికి పులివెందుల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

'సీఎం జగన్ సహకారంతోనే రాష్ట్రానికి అకాడమీ'



తిరుపతి కల్చరల్: రాష్ట్ర విభజన తర్వాత తెలుగు అకాడమీ తిరిగి ఏపీకి రావడానికి సీఎం వైఎస్ జగన్ అందించిన సహకారమే కారణమని తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని ఎస్వీ వర్సిటీ సెనేట్ హాల్ వేదికగా గురువారం తెలుగు భాష వ్యాప్తికి, అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తులకు తెలుగు అకాడమీ పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ ప్రభుత్వం తెలుగు అకాడమీని నూతన ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడానికి కనీస ఆలోచన కూడా చేయలేదన్నారు. సీఎం జగన్ ప్రత్యేక చొరవతో సుప్రీం కోర్టుకు వెళ్లి అకాడమీని, సిబ్బందిని, రావాల్సిన బకాయిలను తీసుకువచ్చారన్నారు. తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా తెలుగు భాషా పురస్కారాలతో పాటు ఉగాది పురస్కారాలు అందించి తద్వారా తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న వారిని మరింత ప్రోత్సహించనున్నట్లు చెప్పారు.

'ముఖ్యమంత్రికి రుణపడి ఉన్నాం'

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆర్టీసీ ఉద్యోగుల దశాబ్దాల కలను నిజం చేసి 52 వేల మంది కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ కే దక్కిందని వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బాబా ఫక్రుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన కడపలో విలేకరులతో మాట్లాడారు. సీఎం చొరవతో ఆర్టీసీ ఉద్యోగుల కల అయిన ప్రభుత్వ ఉద్యోగుల స్కేల్‌తో సమానమైన జీతభత్యాలు సాధించడం సెప్టెంబర్ 1 నుంచి నెరవేరబోతోందన్నారు. సీఎంకు జీవితాంతం రుణపడి ఉంటామని చెప్పారు.

రాష్ట్ర ప్రజలను మోసం చేసిన చంద్రబాబు

696వ రోజు రిలే దీక్షలో మండిపడ్డ బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: అమరావతి పేరుతో రాష్ట్ర ప్రజలను చంద్రబాబు మోసం చేశారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. మూడు రాజధానులకు మద్దతుగా గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు బుధవారం 696వ రోజు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. రైతులకో ప్యాకేజీ, పేదలకో ప్యాకేజీ ఇచ్చి కులవివక్ష చూపిన చంద్రబాబు అదే భూములను తన బినామీల చేత కొనుగోలు చేయించి ప్రత్యేక జీవో ద్వారా చట్టబద్ధం చేసుకొని రూ.వేల కోట్ల లబ్ధి పొందాడన్నారు. వ్యవస్థలను ప్రలోభాలకు గురి చేయడమే లక్ష్యంగా పెట్టుకుని తప్పుడు పనులకు పాల్పడుతున్న చంద్రబాబు ప్రజాక్షేత్రంలో తిరగకుండా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 696 రోజులుగా కొనసాగుతున్న బహుజన పరిరక్షణ సమితి ఉద్యమం వైపు ప్రతిపక్ష పార్టీలు కనీసం తొంగి చూడకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటో అందరికీ తెలుసన్నారు. ప్యాకేజీల కోసం కక్కుర్తి పడి బాబు అవినీతికి సహకరిస్తున్న ఆయా పార్టీలకు ఉనికి లేకుండా చేసేందుకు రాష్ట్రంలో 85 శాతం ఓటు బ్యాంకు ఉన్న బహుజనులంతా ఐక్యతతో పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కాంగ్రెస్ యూట్యూబ్ చానల్ తొలగింపు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీకి చెందిన యూట్యూబ్ చానల్ 'ఇండియన్ నేషనల్ కాంగ్రెస్' ఆన్‌లైన్ నుంచి తొలగించబడింది. దీనిపై యూట్యూబ్ సంస్థ ఇంకా ఎలాంటి వివరణ రాలేదు. అయితే, ఈ ఘటనపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. 'విద్రోహులు కావాలనే చానల్‌ను తొలగించారా? లేక సాంకేతిక పొరపాటే ఇందుకు కారణమా? అనేది తేలుస్తాం. ఇందుకు సంబంధించి గూగుల్/యూట్యూబ్ సంస్థల ఉన్నతాధికారులతో సంప్రతింపులు జరుపుతున్నాం. సమస్యను వెంటనే పరిష్కరించి ఛానల్‌ను పునరుద్ధరించే పనుల్లో నిమగ్నమయ్యాం' అని పార్టీ తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో బుధవారం పేర్కొంది.

జార్ఖండ్‌లో మళ్లీ ఈడీ సోదాలు

సీఎం సోరెన్ సన్నిహితుడి నివాసం నుంచి ఏకే–47 రైఫిల్స్, 60 తూటాలు స్వాధీనం

రాంచీ: జార్ఖండ్‌లోని అక్రమ మైనింగ్ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా దాడులు చేసింది. ఈ కేసులో నిందితుల్లో ఒకరైన ప్రేమ్ ప్రకాశ్ నివాసం నుంచి రెండు ఏకే–47 రైఫిల్స్, 60 తూటాలు, రెండు మ్యాగజైన్స్ స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ అధికారులు వెల్లడించారు. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు ప్రేమ్ ప్రకాశ్ అత్యంత సన్నిహితుడని ప్రచారంలో ఉంది. జార్ఖండ్‌తో పాటు బిహార్, తమిళనాడు, ఢిల్లీ–ఎన్‌సీఆర్ పరిధిలో 17–20 నివాసాల్లో ఈడీ దాడులు జరిపింది. సీఎం సోరెన్ అనుచరుడైన పంకజ్ మిశ్రా, అతని అనుచరుడు బచ్చుయాదవ్‌లని గతంలోనే అదుపులోనికి తీసుకున్న ఈడీ విచారణ సమయంలో వెలుగులోకి వచ్చిన విషయాల ఆధారంగా తాజా దాడులు నిర్వహించారు. ప్రేమ్ ప్రకాశ్ నివాసంలో ఏకే–47 రైఫిల్స్ దొరకడంపై బీజేపీ ఎదురుదాడికి దిగింది. సీఎం సోరెన్, ఆయన ఫ్యామిలీ ఫ్రెండ్ అమిత్ అగర్వాల్‌తో ప్రేమ్ ప్రకాశ్‌కున్న లింకులపై దర్యాప్తు చేయాలని బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే డిమాండ్ చేశారు.

అమెరికాలో 10 వేల డాలర్ల దాకా విద్యార్థి రుణాల మాఫీ

వాషింగ్టన్: ఎన్నికల హామీలను నెరవేర్చే క్రమంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరో కీలక ముందడుగు వేశారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న విద్యార్థుల రుణాల మాఫీ పథకాన్ని ప్రకటించారు. ఇందులో భాగంగా 1.25 లక్షల డాలర్ల కంటే తక్కువ వార్షిక ఆదాయమున్న వారికి 10 వేల డాలర్ల విద్యార్థి రుణాలను మాఫీ చేస్తారంటూ బుధవారం ట్వీట్ చేశారు. న్యాయపరమైన అడ్డంకుల్ని తట్టుకుని ఈ పథకం అమల్లోకి వస్తే లక్షలాది మంది అమెరికా విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. అలాగే ఆర్థికంగా వెనకబడ్డవారికి అదనంగా మరో 10 వేల డాలర్ల దాకా రుణ మాఫీ అందనుంది. అమెరికాలో 4.3 కోట్ల మంది పై చిలుకు మంది సగటున ఒక్కొక్కరు 37 వేల డాలర్ల చొప్పున విద్యార్థి రుణాలు తీసుకున్నారు. బైడెన్ నిర్ణయంతో వీరిలో కనీసం 2 కోట్ల మంది రుణాలు పూర్తిగా రద్దవుతాయని అంచనా. చదువుకునేందుకు విద్యార్థ రుణాలపై ఎక్కువగా ఆధారపడే నల్ల జాతి అమెరికన్లకు పథకంతో మేలు జరుగుతుందని సమాచారం.

యూపీఎస్సీ వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ సదుపాయం

న్యూఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) నిర్వహించే పరీక్షలకు దరఖాస్తు చేసుకొనే అభ్యర్థులు ఇకపై ప్రతిసారి తమ వివరాలు నమోదు చేయాల్సిన అవసరం లేదు. అభ్యర్థుల సౌకర్యార్థం వన్‌టైమ్ రిజిస్ట్రేషన్(ఓటీఆర్) విధానాన్ని యూపీఎస్సీ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఓటీఆర్ వేదికపై ఒకసారి వ్యక్తిగత సమాచారం, ఇతర వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకుంటే చాలు. వేర్వేరు పరీక్షలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పుడు ఓటీఆర్ నంబర్ తెలియజేస్తే సరిపోతుంది. వారి వివరాలన్నీ దరఖాస్తు పత్రంలో ప్రత్యక్షమవుతాయి. దీనివల్ల అభ్యర్థులకు సమయం ఆదా కావడంతోపాటు దరఖాస్తుల ప్రక్రియ మరింత సులభతరంగా మారుతుందని, దరఖాస్తుల్లో పొరపాట్లకు అవకాశం ఉండదని యూపీఎస్సీ వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఓటీఆర్‌లో నమోదు చేసుకున్న అభ్యర్థుల సమాచారం యూపీఎస్సీ సర్వర్లలో భద్రంగా ఉంటుందని తెలిపాయి. ఆన్‌లైన్ దరఖాస్తు పత్రంలో ఈ ఓటీఆర్ నంబర్ నమోదు చేస్తే 70 శాతం దరఖాస్తును పూర్తి చేసినట్లే. యూపీఎస్సీ నిర్వహించే అన్నిపరీక్షలకు ఓటీఆర్ ఉపయోగపడుతుంది. upsc.gov.in లేదా upsconline.nic.in వెబ్‌సైట్ల ద్వారా ఎప్పుడైనా సరే ఓటీఆర్‌లో అభ్యర్థులు వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని యూపీఎస్సీ ఒక ప్రకటనలో సూచించింది.

సోనాలీ ఫోగాట్‌ది హత్యే

పోలీసులకు సోదరుడు రింకూ ఫిర్యాదు

పనాజీ: బీజేపీ నేత, మాజీ టిక్‌టాక్ స్టార్, బిగ్ బాస్ ఫేమ్ సోనాలీ ఫోగాట్‌ది సహజ మరణం కాదని, హత్యకు గురయ్యారని ఆమె సోదరుడు రింకూ ఢాకా ఆరోపించారు. ఈ మేరకు గోవా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోనాలీని సహచరులే హత్య చేశారని పేర్కొన్నారు. తన సోదరి హత్య తర్వాత హరియాణాలోని తమ ఫామ్‌హౌజ్ నుంచి సీసీటీవీ కెమెరాలు, ల్యాప్‌టాప్, ఇతర వస్తువులు కనిపించకుండా పోయానని తెలిపారు. ఇద్దరు అనుమానితులపై తాను ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆక్షేపించారు. సోనాలీ మరణంపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహిస్తున్నారని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ తెలిపారు. గుండెపోటు వల్లే సోనాలీ మరణించినట్ల ప్రాథమిక ఆధారాలను బట్టి తెలుస్తోందని గోవా డీజీపీ అన్నారు.



అడిగి మరీ అరెస్టయింది..

జీన్ బికెంటన్. ఆస్ట్రేలియాకు చెందిన వందేళ్ల బామ్మగారు. కొన్నేళ్లుగా వీల్‌చైర్‌కే పరిమితమైంది. అయినవాళ్ల నడుమ తన వందో పుట్టినరోజు వేడుకలు ఫుల్ జోష్‌గా జరుపుకుంటోంది. ఉన్నట్టుండి పోలీసులు రంగప్రవేశం చేశారు. అందరూ చూస్తుండగా ఆమెను అదుపులోకి తీసుకున్నారు. సంకెళ్లు వేసి మరీ తీసుకెళ్లారు. కానీ, షాకవ్వాల్సింది పోయి బామ్మగారు చప్పట్లు కొడుతూ సంబరపడిపోయారు. పైగా ఆహూతులంతా ఆమెతో శ్రుతి కలిపారు. ఎందుకంటారా? ఎందుకంటే జరిగింది ఉత్తుత్తి అరెస్టే కాబట్టి. పోలీసులు వేసినవీ ఉత్తుత్తి సంకెళ్లే కాబట్టి. అసలు సంగతేమిటంటే జీవితంలో ఒక్కసారైనా ఒక్కసారన్నా అరెస్టు కావాలన్నది ఈ బామ్మగారి చిరకాల వాంఛ. ఈ విచిత్రమైన కోరికను విక్టోరియా పోలీసులు ఇలా తీర్చారన్నమాట. పైగా బామ్మ కోరిక మేరకు పుట్టినరోజు నాడే అరెస్టు చేసి మరింత సంతోష పెట్టారు. తర్వాత కలిసి ఇలా ఫొటోలు దిగి సందడి చేశారు. విక్టోరియా పోలీసు శాఖ వాటినిలా ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసింది. ''అరెస్టయితే ఎలా ఉంటుందో చూడాలన్నది బామ్మగారి చిరకాల కోరిక అని తెలియడంతో దాన్నిలా తీర్చాం. దాంతో ఆమె చెప్పలేనంత ఆనందపడింది. ఇది మాకూ సరదాగానే అన్పించింది'' అని చెప్పుకొచ్చింది. ఈ మొత్తం ఎపిసోడ్ నెటిజన్లను కూడా బాగా ఆకట్టుకుంది. పోలీసుల స్పందన వారి మనసు దోచుకుంది. ఇది కమ్యూనిటీ పోలీసింగ్‌కు అద్దం పట్టిందంటూ కామెంట్లు పెట్టారు. పుట్టిన రోజు నాడు పెద్దావిడకు గొప్ప కానుక ఇచ్చారంటూ కొందరు మెచ్చుకున్నారు. అన్నట్టూ ఈ బామ్మగారు ఆర్మీలో నర్సుగా సుదీర్ఘకాలం పని చేసి రిటైరయ్యారట. తన చిరకాల కోరికను జీవిత చరమాంకంలో మొత్తానికిలా తీర్చుకున్నారు.

'ఉచితాల'తో ఆర్థిక వ్యవస్థకు చేటు..

అఖిలపక్షాన్ని పిలవలేదేం?

- అధ్యయనానికి కేంద్రమే ఒక కమిటీని ఎందుకు నియమించకూడదు?
- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ
- వ్యాజ్యాలను ఇకపై జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల్లో నెగ్గడానికి రాజకీయ పార్టీలు ప్రజలకు 'ఉచిత' హామీలు ఇస్తుండడం తీవ్రమైన అంశమేనని, దీనిపై కచ్చితంగా చర్చ జరగాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పేర్కొన్నారు. చర్చించడానికి అఖిలపక్ష సమావేశానికి ఎందుకు పిలువునివ్వలేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆర్థిక వ్యవస్థకు చేటు కలిగించే ఉచితాల వ్యవహారాన్ని తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. ఉచితాలపై పార్టీలు ఏకాభిప్రాయానికి రాకపోతే ఇవి ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఉచిత హామీలు ఇవ్వకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ న్యాయవాది అశ్వినీకుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ రమణ, జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ రవికుమార్‌ల ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వికాస్ సింగ్ వాదనలు వినిపించారు. ఉచితాలపై అధ్యయనం చేయడానికి నియమించే కమిటీకి సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లోధాను చైర్మన్‌గా నియమించాలని కోరారు. ''పదవీ విరమణ చేసిన, చేయబోతున్న వ్యక్తికి ఈ దేశంలో విలువ లేదు'' అంటూ జస్టిస్ ఎన్వీ రమణ ప్రతిస్పందించారు. కమిటీకి ఒక రాజ్యాంగ సంస్థ నేతృత్వం వహించాలని భావిస్తున్నట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చెప్పారు. ఈ సమస్యను అధ్యయనం చేయడానికి కేంద్రమే కమిటీని ఎందుకు నియమించకూడదని సీజేఐ ప్రశ్నించారు.

ఎఫ్ఆర్‌బీఎం చట్టంతో మేలు

ఎన్నికలకు ఆరు నెలల ముందు ఉచితాలు ప్రకటించడమే ప్రధానమైన సమస్య అని సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అభిప్రాయపడ్డారు. ఆయన 'సెంటర్ ఫర్ పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్' తరఫున వాదనలు వినిపించారు. ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడం, పబ్లిక్ పాలసీని అపహాస్యం చేస్తూ ఉద్దేశపూర్వకంగా రుణ ఎగవేతదారులైన కార్పొరేషన్లకు రుణాలు ఇవ్వడం, ఎన్నికలకు ముందు ఉచిత వాగ్దానాలు చేయడం.. ఈ మూడూ అక్రమమేనని చెప్పారు. పార్టీలు తమ మేనిఫెస్టోలో ఇచ్చే హామీలకు నిధుల మూలాలను సైతం వెల్లడించాలనే ప్రతిపాదనను సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వ్యతిరేకించారు. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులకు సంబంధించిన రికార్డులు ఎన్నికల ముందు రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉండవని గుర్తుచేశారు. ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ, బడ్జెట్ మేనేజ్‌మెంట్(ఎఫ్ఆర్‌బీఎం) చట్టాన్ని అమలు చేస్తే పరిష్కారం లభిస్తుందని, ఆర్థిక లోటు మూడు శాతానికి మించితే తదుపరి సంవత్సరం నుంచి కేటాయింపులు తగ్గించే అధికారం ఆర్థిక కమిషన్‌కు ఉందని తెలిపారు.



పార్టీలు ప్రాథమిక హక్కుగా భావిస్తున్నాయి

ఓటర్లను ప్రభావితం చేసేలా అధికారంలో లేని పార్టీలు హామీలు ఇస్తున్నాయని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వ్యాఖ్యానించారు. ''అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు ఉండవని ఒకరు ప్రజల్ని మభ్యపెట్టొచ్చు. కానీ, అధికారంలోకి వస్తే చంద్రుడిని తీసుకొస్తానని హామీ ఇవ్వగలమా?'' అని ప్రశ్నించారు. దీనికి సీజేఐ స్పందిస్తూ.. ఉచితాల అంశంపై చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం ఎందుకని అఖిలపక్ష సమావేశానికి పిలుపునివ్వలేదని అన్నారు. ఉచితాలపై నియంత్రణను వ్యతిరేకిస్తూ రాజకీయ పార్టీలు కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో అఖిలపక్ష సమావేశంతో ఫలితం ఉండదని మెహతా బదులిచ్చారు. ఉచితాలు అందించడం తమ ప్రాథమిక హక్కుగా కొన్ని పార్టీలు భావిస్తున్నాయని, కేవలం ఉచితాల హామీలతో అధికారంలోకి వచ్చిన పార్టీలూ ఉన్నాయని ఉద్ఘాటించారు.

నేను పోటీ చేస్తే..

''కమిటీకి ఎవరు నేతృత్వం వహిస్తారనేది పెద్ద సమస్య. రాజకీయ పార్టీలు ఎన్నికల్లో పోటీ చేస్తూ ప్రజలకు హామీలు ఇస్తాయి. వ్యక్తులు కాదు. ఒకవేళ నేను పోటీ చేస్తే 10 ఓట్లు కూడా రావు. ఎందుకంటే వ్యక్తులకు అంత ప్రాధాన్యం ఉండదు. ఇదే మన ప్రజాస్వామ్యం. ఇప్పుడు ఎవరైతే ప్రతిపక్షంలో ఉన్నారో వారు తర్వాత అధికారంలోకి రావచ్చు' అని జస్టిస్ రమణ అన్నారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మనూ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ... తుషార్ మెహతా వ్యాఖ్యలను వ్యతిరేకించారు. కేవలం ఉచితాల ద్వారా ఓటర్లను ఆకర్షిస్తారనడం సరైంది కాదన్నారు. బంగారు చైన్లు ఇస్తామంటూ హామీలు ఇవ్వడాన్ని సంక్షేమంగా ఎలా పరిగణించాలని కేంద్ర ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది అరవింద్ దాతర్ ప్రశ్నించారు. ఉచితాల వల్ల తలెత్తే ఆర్థిక ప్రభావాన్ని అంచనా వేయడానికి తగిన సమాచారం అందుబాటులో ఉందని వివరించారు. జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ.. ఉచిత హామీల విషయంలో దాఖలైన వ్యాజ్యాలపై ఇకపై జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ విచారిస్తుందని తెలిపారు. సుబ్రహ్మణ్యం వర్సెస్ తమిళనాడు కేసును పునఃపరిశీలించడానికి ధర్మాసనం ఏర్పాటు చేయొచ్చని పేర్కొన్నారు.

బలపరీక్ష వేళ.. సీబీఐ సోదాలు

- ఆర్‌జేడీ నేతల ఇళ్లు, ఆఫీసులపై అధికారుల దాడులు

న్యూఢిల్లీ/పట్నా: ఆర్‌జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వే శాఖ మంత్రిగా ఉన్నప్పుడు జరిగిన ల్యాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణం కేసు దర్యాప్తును సరిగ్గా బిహార్‌లో నితీశ్ కుమార్ సర్కార్ బలపరీక్ష రోజే సీబీఐ వేగవంతం చేసింది. మంగళవారం ఆర్‌జేడీ ఎమ్మెల్సీ, బిహార్ స్టేట్ కోపరేటివ్ యూనియన్ చైర్మన్ సునీల్ సింగ్, రాజ్యసభ సభ్యులు అష్ఫక్ కరీమ్, ఫయాజ్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ సుబోధ్ రాయ్‌లకు చెందిన నివాస స్థలాలు, కార్యాలయాల్లో మొత్తంగా 27 చోట్ల అధికారులు సోదాలు చేశారు. బిహార్ డిప్యూటీ సీఎం, లాలూ కుమారుడు తేజస్వీయాదవ్‌దిగా భావిస్తున్న గురుగ్రామ్‌లోని అసంపూర్ణ మాల్‌లోనూ దాడులు చేశారు. ఢిల్లీ, పట్నా, మధుబని, కతిహార్, గురుగ్రామ్‌లలో సోదాలు కొనసాగాయి. బిహార్‌లో సీబీఐ, ఈడీ ద్వారా కేంద్రం బలప్రయోగానికి పాల్పడుతోందని జేడీయూ ప్రధాన అధికార ప్రతినిధి, ఎమ్మెల్సీ నీరజ్ కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 2008–09కాలంలో ముంబై, జబల్పూర్, కోల్‌కతా, జైపూర్, హాజీపూర్ రైల్వే జోన్లలో ల్యాండ్ ఫర్ జాబ్స్ స్కామ్ వెలుగుచూడటంతో సీబీఐ కేసులు నమోదుచేసి గతంలోనూ దర్యాప్తు మొదలుపెట్టిన విషయం విదితమే. అక్రమంగా గ్రూప్ డీ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కుటుంబీకులు.. లాలూ భార్య రబ్రీదేవి, కుమార్తెలు మీసా భారతి, హేమా యాదవ్‌ల పేర్ల మీద స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించారని సీబీఐ ఆరోపిస్తోంది.

విశ్వాస పరీక్షలో నెగ్గిన నితీశ్

ఎన్‌డీఏతో బంధం తెంచుకుని ఆర్‌జేడీ, కాంగ్రెస్ కూటమితో ఏర్పాటైన నితీశ్ ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో విశ్వాస పరీక్షలో నెగ్గింది. బీజేపీ ఎమ్మెల్యేల వాకౌట్ తర్వాత మూజువాణి ఓటుతో ప్రభుత్వం పరీక్షలో గట్టెక్కింది. మరోవైపు, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ విజయ్ కుమార్ సిన్హా తన పదవికి రాజీనామా సమర్పించారు. ప్రభుత్వ పగ్గాలు.. కూటముల మధ్య చేతులుమారినా ఇన్నాళ్లూ పదవికి రాజీనామా చేయకుండా భీష్మించుకూర్చున్న సిన్హా ఎట్టకేలకు తప్పుకున్నారు.



ప్రపంచం చుట్టేశాడు.. రెండు రికార్డులు పట్టేశాడు

మాక్ రూథర్‌ఫర్డ్. వయసు 17 ఏళ్లు. బెల్జియం–బ్రిటిష్.. రెండు పౌరసత్వాలు ఉన్నాయి. చిన్న వయసులోనే రెండు గిన్నిస్ ప్రపంచ రికార్డులు సాధించాడు. చిన్న విమానంలో ఒంటరిగా ప్రపంచమంతా చుట్టేశాడు. ఐదు నెలల క్రితం మొదలైన ఈ ప్రయాణం బుధవారం బల్గేరియా రాజధాని సోఫియాలోని ఎయిర్‌స్ట్రిప్‌లో ముగిసింది. ఎవరూ తోడులేకుండా భూగోళాన్ని చుట్టిన అత్యంత పిన్నవయస్కుడిగా, మైక్రోలైట్ ప్లేన్‌లో ప్రపంచమంతా తిరిగి అత్యంత పిన్నవయస్కుడిగా రెండు రికార్డులు రూథర్‌ఫర్డ్ పరమయ్యాయి.

ఆరోగ్యం, ఆధ్యాత్మికం మమేకం

హరియాణాలో అమృత సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ప్రధాని వ్యాఖ్య



మాతా అమృతానందమయి నుంచి ఆశీర్వచనం స్వీకరిస్తున్న మోదీ

ఫరీదాబాద్(హరియాణా): భారత్‌లో ఆరోగ్య సంరక్షణకు, ఆధ్యాత్మికతకు దగ్గరి సంబంధముందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బుధవారం హరియాణాలోని ఫరీదాబాద్‌లో 2,600 పడకల భారీ, అధునాతన అమృత సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించి మోదీ ప్రారంభోపన్యాసం చేశారు. మాతా అమృతానందమయి, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. 'కోవిడ్ ఉధృతి కాలంలో కరోనా టీకాలపై కొందరు దుష్ప్రచారం చేశారు. వాటికి ఆధ్యాత్మికవేత్తలు అడ్డుకట్టవేశారు. దీంతో ప్రజలంతా కోవిడ్ వ్యాక్సినేషన్‌లో భాగస్వాములయ్యారు. దేశంలో వ్యాక్సినేషన్ విస్తృతమైంది. స్పిరిట్యువల్–ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ విజయానికి చక్కని ఉదాహరణ ఇది. భారత్‌లో ఆరోగ్య సంరక్షణకు, ఆధ్యాత్మికతకు అంతర్లీన సంబంధముంది' అని మోదీ వ్యాఖ్యానించారు. అమృత ఆస్పత్రిని 130 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. ఆస్పత్రి భవంతిపై హెలిప్యాడ్ సౌకర్యముంది. మరోవైపు, ప్రధాని పంజాబ్‌లోని ముల్లన్‌పూర్‌లో 300 పడకల హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించారు. హెల్త్‌కేర్ రంగంలో దేశంలో గత ఏడు దశాబ్దాల్లో జరగనంత అభివృద్ధి ఈ ఎనిమిదేళ్లలో సాకారమైందని మోదీ వ్యాఖ్యానించారు.

మా ప్రభుత్వాన్ని కూల్చే యత్నం

- మోదీపై ఆప్ ఆరోపణలు
- నలుగురు ఎమ్మెల్యేలకు ఎర
- ఒక్కొక్కరికీ రూ.20 కోట్ల ఆఫర్
- లేదంటే కేసులు తప్పవన్నారు
- తీవ్రమైన విషయమిది: కేజ్రీవాల్
- 26న ఢిల్లీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం



న్యూఢిల్లీ: ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ఢిల్లీలో తమ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారంటూ ఆప్ సంచలన ఆరోపణలు చేసింది. ''బీజేపీలో చేరాల్సిందిగా నలుగురు ఎమ్మెల్యేలు అజయ్ దత్, సంజీవ్ ఝా, సోమనాథ్ భారతి, కుల్దీప్ కుమార్‌లను ఆ పార్టీ నేతలు ఒత్తిడి చేశారు. లేదంటే మనీశ్ సిసోడియా మాదిరిగా తప్పుడు కేసులు, సీబీఐ, ఈడీ దాడులు తప్పవంటూ బెదిరించారు. ఒక్కొక్కరికీ రూ.20 కోట్లు ఆఫర్ చేశారు. తమతో పాటు మరో ఎమ్మెల్యేను కూడా తీసుకొచ్చిన వారికి రూ.25 కోట్లు ఇస్తామన్నారు'' అని ఆప్ జాతీయ అధికార ప్రతినిధి, ఎంపీ సంజయ్ సింగ్ చెప్పారు. నలుగురు ఎమ్మెల్యేలతో కలిసి బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నయానో భయానో తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రయత్నిస్తుండటం సిగ్గుచేటంటూ మండిపడ్డారు. మహారాష్ట్రలో శివసేనను చీల్చిన వ్యూహాన్నే తమ పార్టీపైనా ప్రయోగిస్తోందని ఆరోపించారు. ''వాళ్ల ప్రలోభాలకు సిసోడియా లొంగకపోవడంతో ఇతర ఎమ్మెల్యేలపై పడ్డారు. కానీ వాళ్లంతా ఉద్యమాల నుంచి పుట్టుకొచ్చారు. బెదిరింపులకు లొంగే, అమ్ముడుపోయే రకం కాదు'' అన్నారు. ప్రాణాలైనా ఇస్తాం గానీ పార్టీకి ద్రోహం చేయబోమని సిసోడియా ట్వీట్ చేశారు. ''మేమంతా కేజ్రీవాల్ సైనికులం. భగత్‌సింగ్ అనుయాయులం. మీ సీబీఐ, ఈడీ మమ్మల్నేమీ చేయలేవు'' అన్నారు. ఇది చాలా తీవ్రమైన విషయమంటూ కేజ్రీవాల్ మండిపడ్డారు. ఈ ఏడాది చివర్లో గుజరాత్ ఎన్నికలు ముగిసేదాకా తమపై సీబీఐ, ఈడీ దాడులు జరుగుతూనే ఉంటాయని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో కేజ్రీవాల్ నివాసంలో ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశమై పరిస్థితిని సమీక్షించింది. విపక్షాలను లేకుండా చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందంటూ దుయ్యబట్టింది. శుక్రవారం ఢిల్లీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం జరపాలని నిర్ణయించింది.

ఈ ప్రశ్నలకు బదులివ్వండి: బీజేపీ

ఆప్ ఆరోపణలను బీజేపీ తోసిపుచ్చింది. మద్యం పాలసీలో అవినీతి బట్టబయలు కావడంతో శిక్ష తప్పదనే అసహనంతోనే ఆ పార్టీ నేతలు ఇలాంటి తప్పుడు ఆరోపణలకు దిగుతున్నారని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత పాత్రా విమర్శించారు. వాళ్లకు దమ్ముంటే డబ్బులు ఆఫర్ చేసిన బీజేపీ నేతల పేర్లు చెప్పాలని సవాలు విసిరారు. ''ఆప్‌కు భారీ కమీషన్లు ముట్టజెప్పిన వాళ్లకే కేజ్రీవాల్ సర్కారు మద్యం లైసెన్సులు కట్టబెట్టింది. ఈ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి కేజ్రీవాలే. విచారణను తప్పించుకునేందుకు వ్యూహాత్మకంగా ఒక్క ఫైలుపై తన సంతకం లేకుండా జాగ్రత్తపడ్డారు. ఎక్సైజ్ పాలసీ కుంభకోణంపై తమ ప్రశ్నలకు బదులివ్వలేక ఆప్ ఇలా తప్పుడు ఆరోపణలకు దిగిందని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు ఆదేశ్ గుప్తా ఆరోపించారు. 'నిపుణుల కమిటీ వద్దన్నా వినకుండా హోల్‌సేల్ మద్యం వ్యాపారాన్ని ప్రైవేట్ వ్యక్తులపరం చేశారు. భారీగా లంచాలు తీసుకుని బ్లాక్ లిస్టెడ్ కంపెనీలకూ లైసెన్సులిచ్చారు' అని అన్నారు. కేజ్రీవాల్ అండ్ కో నిజాయతీ, పారదర్శకతలకు పాతరేసి చూస్తుండగానే అవినీతిలో కూరుకుపోయిందంటూ కాంగ్రెస్ కూడా దుమ్మెత్తిపోసింది.

స్వతంత్ర మీడియాని అణచివేసే కుయత్నాలు

ఎన్డీటీవీలో అదానీ గ్రూపు షేర్ల కొనుగోలుపై కాంగ్రెస్ ఆందోళన

న్యూఢిల్లీ : దేశంలో స్వతంత్ర మీడియాని అణచివేయడానికి బీజేపీ కుట్ర పన్నుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. ప్రముఖ మీడియా కంపెనీ న్యూఢిల్లీ టెలివిజన్ లిమిటెడ్ (ఎన్‌డీటీవీ)ను పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ బలవంతపు కొనుగోలుపై కాంగ్రెస్ పార్టీ మండిపడింది. ప్రధాని మోదీ ''ఖాస్ దోస్త్'' (ఆప్త మిత్రుడు) స్వతంత్ర మీడియాని తన గుప్పిట్లోకి తీసుకోవాలని ప్రయత్నిస్తున్నారంటూ విమర్శించింది. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు జైరామ్ రమేష్, కపిల్ సిబల్ ఈ కొనుగోలు వ్యవహారాన్ని తప్పు పట్టారు. ' అదానీ గ్రూప్ ఎన్‌డీటీవీని బలవంతంగా కొనుగోలు చేయడం అంటే వారి రాజకీయ, ఆర్థిక అధికారాలను కేంద్రీకరించుకోవడం, స్వతంత్ర మీడియా గొంతు అణిచివేయడమే'' అని జైరామ్ దుయ్యబట్టారు. స్వతంత్ర జర్నలిజంను పారిశ్రామికవేత్తలు తమ గుప్పిట్లోకి తీసుకోవడం ఆందోళనకరమని సిబల్ అన్నారు. ఎన్‌డీటీవీ షేర్లు 29.18% ఇప్పటికే పరోక్ష పద్ధతిలో దక్కించుకున్న అదానీ గ్రూపు అదనంగా మరో 26% కొనుగోలు చేయడానికి ఓపెన్ ఆఫర్ ఇవ్వడంతో ఈ విషయం బయటకి వచ్చింది.

3,570 కిలోమీటర్లు.. 12 రాష్ట్రాలు

సుదీర్ఘ మార్గంలో కొనసాగనున్న భారత్ జోడో యాత్ర



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ సెప్టెంబర్ ఏడవ తేదీన శ్రీకారం చుట్టనున్న 'భారత్ జోడో యాత్ర' కన్యాకుమారిలో మొదలై కశ్మీర్‌లో పూర్తికానుంది. ఇందులోభాగంగా దేశంలోని 12 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల గుండా ఏకంగా 3,570 కిలోమీటర్ల పొడవునా ఈ యాత్ర దిగ్విజయంగా కొనసాగనుంది. 'కలిసి నడుద్దాం..దేశాన్ని కలిపి ఉంచుదాం (మిలే కదమ్.. జుడే వతన్)' నినాదంతో సుదీర్ఘంగా ఐదు నెలలపాటు ఈ ప్రజాఉద్యమం ముందుకు కొనసాగుతుంది. ఏకధృవ సామాజిక పోకడ, దేశంలో నెలకొన్న ఆర్థిక అసమానతలు, విద్వేషాలను రూపుమాపేందుకు కాంగ్రెస్ నడుం బిగించింది. కులమతాలకతీతంగా దేశ ప్రజానీకం పాదయాత్రలో కదంతొక్కనున్నారు. పాదయాత్రగా కొనసాగే ఈ కార్యక్రమాన్ని స్వాతంత్ర్యభారతంలో అతి పెద్ద ప్రజాస్వామ్య ఉద్యమ స్థాయికి తీసుకెళ్లాలని పార్టీ భావిస్తోంది. తమిళనాడులోని కన్యాకుమారి నుంచి పాదయాత్రను మొదలుపెట్టనున్నారు. తర్వాత తిరువనంతపురం, కొచ్చి, నీలాంబర్, మైసూరు, బళ్లారి, రాయచూర్ మీదుగా యాత్రను కొనసాగిస్తారు. షెడ్యూల్‌లో భాగంగా తెలంగాణలోని వికారాబాద్‌లోనూ యాత్ర ఉంటుంది. మహారాష్ట్రలోని నాందేడ్, తర్వాత జల్గావ్, మధ్యప్రదేశ్‌లోని ఇండోర్, రాజస్తాన్‌లోని కోటా పట్టణం.. తర్వాత డౌసా, అల్వార్‌లో పాదయాత్ర ముందుకు వెళ్లనుంది. ఉత్తరభారతం విషయానికొస్తే ఉత్తరప్రదేశ్‌లోని బులందర్ షహర్, తర్వాత దేశ రాజధాని ఢిల్లీ, అంబాలా(హరియాణా)లనూ పాదయాత్ర పలకరించనుంది. జమ్మూ పట్టణం, ఆ తర్వాత చివరిగా శ్రీనగర్‌లో పాదయాత్ర పూర్తికానుంది. భౌగోళికంగా నదీజలాలు, కొండలు, అటవీప్రాంతం.. పాదయాత్ర మార్గానికి ఆటంకం కలగకూడదని అవి లేని మార్గాల్లో పాదయాత్ర రూట్‌మ్యాప్‌కు కాంగ్రెస్ నాయకులు తుదిరూపునిచ్చారు.

100 మంది 'భారత యాత్రికులు'

పాదయాత్రలో యాత్ర తొలి నుంచి తుదికంటా 100 మంది మాత్రం కచ్చితంగా పాలుపంచుకోనున్నారు. వీరిని 'భారత యాత్రికులు'గా పిలవనున్నారు. ఏ రాష్ట్రం గుండా అయితే భారత్ జోడో యాత్ర మార్గం లేదో ఆ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ మరో 100 మంది 'అతిథి యాత్ర'లు చేస్తారు. పాదయాత్ర ఉన్న రాష్ట్రాల నుంచి మరో 100 మంది 'ప్రదేశ్ యాత్రికులు' జతకూడుతారు. అంటే ప్రతిసారి 300 మంది పాదయాత్రికులు కచ్చితంగా ఉంటారు. రోజూ దాదాపు పాతిక కిలోమీటర్ల దూరం యాత్ర ముందుకెళ్తుంది.

28న సీడబ్ల్యూసీ భేటీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నికల నిర్వహణ తేదీలను ఖరారు చేయడానికి ఈ నెల 28, ఆదివారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీ కానుంది. కాంగ్రెస్ చీఫ్ సోనియాగాంధీ వైద్య పరీక్షలకు విదేశాలకు వెళ్తున్న నేపథ్యంలో అక్కడినుంచే ఆమె వర్చువల్‌గా భేటీలో పాల్గొంటారని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ వెల్లడించారు. సోనియా వెంట రాహుల్, ప్రియాంక విదేశాలకు వెళ్లారు. దీంతో ఇతర పార్టీ నాయకులు ఢిల్లీలో జరిగే సమావేశానికి హాజరవుతారు. రాజస్థాన్ సీఎం రాజేశ్ గెహ్లాట్ తదుపరి అధ్యక్షుడని ప్రచారం జరిగింది. గెహ్లాట్ ఈ ప్రచారాన్ని తోసిపుచ్చారు. కాంగ్రెస్ పార్టీ పగ్గాలు చేపట్టేలా చివరి నిముషం వరకు రాహుల్‌కి నచ్చజెప్పే ప్రయత్నాలు చేస్తామన్నారు. రాహుల్ అధ్యక్షుడు కాకపోతే ఎంతో మంది నిరాశ నిస్పృహలకు లోనై ఇంటికే పరిమితం అవుతారని పేర్కొన్నారు. అధ్యక్షుడిగా వినిపిస్తున్న పేర్లలో కమల్‌నాథ్, కె.సి. వేణుగోపాల్, మీరా కుమార్, కుమారి సెల్జా ఉన్నారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన గుండేపల్లి సాయి గిరిధర్ పేరిట గుండేపల్లి కొండ సత్యనారాయణ కుటుంబ సభ్యులు రూ. 1.50 లక్షల విరాళాన్ని అందించారు.



గడప గడపకూ సంక్షేమం

జిల్లాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగుతోంది. గుడివాడ 8వ వార్డులో ఎమ్మెల్యే కొడాలి నాని బుధవారం పర్యటించి, ప్రజలతో మమేకం అయ్యారు.



ట్రాఫిక్ సమస్యపై ఫోకస్

విజయవాడ స్పోర్ట్స్: నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ అడిషనల్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ టి.సర్కార్ బుధవారం తెలిపారు.

నేస్తం.. అందుకో సాయం

- పెడనలో రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ
- తొలిసారి పట్టణానికి సీఎం రానుండటంతో పక్కా ఏర్పాట్లు
- కృష్ణా ఎస్పీ ఆధ్వర్యంలో విజయవంతంగా ట్రయల్ రన్
- నేతన్నలతో ముఖాముఖి మాట్లాడనున్న సీఎం

నాల్గో విడత వైఎస్సార్ నేతన్న నేస్తానికి నేడు శ్రీకారం



పెడన తోటమూలలో సిద్ధమైన సీఎం బహిరంగ సభా వేదిక

సాక్షి, మచిలీపట్నం: చేనేతకు చేయూతనిచ్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం నాల్గో విడత అమలుకు రంగం సిద్ధమైంది. గురువారం పెడన పట్టణం తోటమూల వైఎస్సార్ ప్రాంగణంలో కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ పథకం కింద లబ్ధిదారులైన ఒక్కో కుటుంబానికి రూ.24వేల చొప్పున వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయనున్నారు. ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారి పెడన వస్తున్న నేపథ్యంలో మంత్రి జోగి రమేష్, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ జాషువా ఆధ్వర్యంలో పక్కా ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేనేత, కలంకారీ కార్మికులు, జిల్లా వాసులు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఎస్పీ నేతృత్వంలో 2వేల మంది పోలీసులు, స్పెషల్ సెక్యూరిటీ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సభలో సుమారు 40వేల మంది కూర్చొనేందుకు వీలుగా ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. సీఎం వైఎస్ జగన్ హెలిప్యాడ్ నుంచి తోటమూల వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్ ప్రాంగణం వరకు రోడ్డు మార్గాన రానుండటంతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున స్వాగత ఏర్పాట్లు చేశారు. దారి పొడవునా భారీ ఫ్లెక్సీలు, పార్టీ జెండాలతో పండుగ వాతావరణం నెలకొంది.



వేదికపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్సీ తలశిల, ఎస్పీ జాషువా



సభా ప్రాంగణం వద్ద అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

నేతన్నలతో జగనన్న..

నేతన్న నేస్తం నాల్గో విడత ప్రారంభానికి విచ్చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కార్మికులతో ముచ్చటించనున్నారు. వారితో ఫొటో షూట్ కార్యక్రమంలో పాల్గొంటారు. సీఎంతో దిగిన ఫొటోలను అప్పటికప్పుడే చేనేత కార్మికులకు అందించనున్నారు. అదే విధంగా కలంకారీ, చేనేత కార్మికులు రూపొందించిన మెమెంటోను సీఎం వైఎస్ జగన్‌కు బహూకరించనున్నారు. సీఎం పర్యటనకు సంబంధించి బుధవారం ఎస్పీ జాషువా ఆధ్వర్యంలో ట్రయల్ రన్ నిర్వహించారు. మంత్రి జోగి రమేష్, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం, కలెక్టర్ రంజిత్ బాషా ఏర్పాట్లను పర్యవేక్షించి అధికారులకు సూచనలు సలహాలు ఇచ్చారు.

'గ్రామదర్శిని'కి నేడు శ్రీకారం

రాష్ట్ర ప్రభుత్వం గ్రామదర్శిని పేరుతో వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. పల్లెల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలను పర్యవేక్షించి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించింది. దీనిలో భాగంగా అధికారులు వారంలో ఒకరోజు ఎంపిక చేసుకుని గ్రామాల్లో పర్యటించాలి. గుర్తించిన సమస్యలను వాట్సాప్ ద్వారా జిల్లా కేంద్రానికి పంపాలి. వాటిని నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం ప్రత్యేకంగా అధికారుల బృందాన్ని నియమించనున్నారు. ఈ కార్యక్రమాన్ని నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెడన వేదికగా లాంఛనంగా ప్రారంభించనున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో 123 మందికి రూ.29.52 లక్షలు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద 123 మంది నేతన్నలకు రూ. 29.52 లక్షలు లబ్ధి చేకూరనుంది. సొంత మగ్గం ఉన్న ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24 వేలు చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ కానుంది. నేతన్నల మగ్గం ఆధునికీకరణ, నూలు కొనుగోలుకు తోడ్పాటును అందించేందుకు ప్రభుత్వం ఈ సాయం అందిస్తోంది. గంపలగూడెం మండలంలో ముగ్గురు, వీరులపాడులో 63 మంది, నందిగామలో 13మంది, చందర్లపాడులో 27 మందికి, వత్సవాయిలో ఏడుగురు, తిరువూరు అర్బన్‌లో ఒకరు, విజయవాడ రూరల్‌లో ఒకరు, విజయవాడ అర్బన్ ఎనిమిది మందికి ఈ పథకం కింద ఆర్థిక సహాయం అందనుంది.

దుర్గమ్మకు రికార్డు స్థాయిలో ఆదాయం

16 రోజులకుగానూ రూ. 2.98 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రావణ మాసంలో భక్తులు దుర్గమ్మకు రికార్డు స్థాయిలో కానుకలు, మొక్కుబడులను సమర్పించారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను బుధవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ సిబ్బంది లెక్కించారు. 16 రోజులకు గాను 41 హుండీల ద్వారా రూ. 2,98,83,293 ఆదాయం సమకూరింది. అలాగే 864 గ్రాముల బంగారం, 6.643 కిలోల వెండి లభ్యమైనట్లు ఆలయ ఈవో భ్రమరాంబ పేర్కొన్నారు. రోజుకు సరాసరిన రూ. 18.67 లక్షల ఆదాయం హుండీల ద్వారా వచ్చినట్లు వివరించారు. ఇక దేవస్థానానికి ఈ–హుండీ ద్వారా రూ. 62,190 ఆదాయం వచ్చిందన్నారు. కానుకల లెక్కింపులో ఆలయ సిబ్బందితో పాటు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సాహిత్య వజ్ర పురస్కారానికి ప్రసాద్ ఎంపిక



పామర్రు: నందమూరి తారక రామారావు సాహిత్య వజ్ర పురస్కారానికి తనను ఎంపిక చేస్తూ అఖిల భారత తెలుగు అకాడమీ అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ నుంచి బుధవారం లేఖ అందిందని పి.ఎం.ఎస్.ప్రసాద్ తెలిపారు. ఎన్టీఆర్ శత జయంతి మహోత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ జీవన శైలిపై 'మేరునగధీరుడు' అన్న వ్యాసం రాసినందుకు ఈ పురస్కారానికి ఎంపిక చేశారని వివరించారు. ఈ నెల 28వ తేదీన తిరుపతిలో జరిగే అఖిల భారత తెలుగు అకాడమీ నాలుగో ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో తనకు అవార్డు ప్రదానం చేస్తారని తెలిపారు.

న్యూస్‌రీల్

పీజీ ఫలితాలు విడుదల



మచిలీపట్నం: కృష్ణా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల మూడో సెమిస్టర్ ఫలితాలను బుధవారం వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. రామిరెడ్డి విడుదల చేశారు. యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించి విద్యార్థుల తమ పరీక్ష ఫలితాలు పరిశీలించుకోవాలన్నారు. ఫలితాలపై ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే సెప్టెంబర్ 12వ తేదీ వరకు సంబంధిత కాలేజీల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని వర్సిటీ ద్వారా నిర్వహించే అన్ని రకాల పరీక్షల ఫలితాలను వైస్ చాన్సలర్ కేబీ చంద్రశేఖర్ సూచనలకు అనుగుణంగా సకాలంలో విడుదల చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పీజీ కో–ఆర్డినేటర్ భవానీ, సిబ్బంది పాల్గొన్నారు.

దసరా ఏర్పాట్లపై నేడు సమీక్ష

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై సెప్టెంబర్ 26వ తేదీ నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు నిర్వహించే దసరా మహోత్సవాల ఏర్పాట్లపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి దేవదాయ శాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల ముఖ్య అధికారులు హాజరుకానున్నారు. ఉత్సవాలలో అమ్మవారి అలంకరణలు, ఆర్జిత సేవలు, నగరోత్సవం, ఆది దంపతుల తెప్పోత్సవం వంటి ఆధ్యాత్మిక అంశాలపై దేవస్థాన వైదిక కమిటీ ఇప్పటికే చర్చించి, అధికారులకు వివరించింది. ఉత్సవాల ప్రారంభం రోజున జరిగే పూజా కార్యక్రమాలు, భక్తులకు అమ్మవారి దర్శనం ఎన్ని గంటలకు ప్రారంభం అవుతుందనే అంశాలతో పాటు క్యూలైన్ల నిర్వహణ, ప్రతి రోజు సాయంత్రం వేళ నిర్వహించే నగరోత్సవ సేవపైన అధికారులు దృష్టి సారించారు. ఉత్సవాలలో ప్రతి రోజు సాయంత్రం వేళ పెరిగే రద్దీని తట్టుకునేలా చేపట్టాల్సిన చర్యల గురించి నేటి సమావేశంలో చర్చించే అవకాశాలున్నాయి.

కంకిపాడు సొసైటీ కార్యదర్శి సస్పెన్షన్

కంకిపాడు (పెనమలూరు): విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన కంకిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యనిర్వహణాధికారి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు సంఘ చైర్‌పర్సన్ జంపాన వెంకట పద్మావతి బుధవారం మెమో జారీ చేశారు. సహకార శాఖ ఉన్నతాధికారులు ఇటీవల కంకిపాడు సొసైటీ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ తనిఖీలకు ముందు రోజే సొసైటీ నుంచి రూ.10 లక్షల నగదును కంకిపాడు కేడీసీసీ బ్రాంచి కార్యాలయంలో జమ చేసి రశీదులను అధికారులకు అప్పగించారు. ఏ రోజు కారోజు నగదు జమ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించటం, సంఘ కార్యకలాపాలను సక్రమంగా నిర్వహించటంలో అలసత్వం చూపటంపై గుడివాడ డీఆర్ ఈనెల 17న నోటీసు జారీ చేశారు. నోటీసుపై కార్యనిర్వహణాధికారిగా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ వివరణ సజావుగా లేని కారణంగా, సొసైటీలో నిర్వహిస్తున్న విచారణ పూర్తయ్యే వరకూ సస్పెండ్ చేస్తూ సంఘ చైర్‌పర్సన్ జంపాన వెంకట పద్మావతి బుధవారం మెమో జారీ చేశారు. ఈ మేరకు సస్పెన్షన్ ఉత్తర్వుల ప్రతిని ప్రవీణ్‌కుమార్‌కు అందించారు.

సొసైటీలో కొనసాగుతున్న విచారణ

కంకిపాడు సొసైటీలో విచారణ ప్రక్రియ బుధవారం కూడా కొనసాగింది. సంఘ రికార్డులను, రశీదులను సంబంధిత ఆడిట్ విభాగం అధికారులు పరిశీలించారు. లావాదేవీలు, రుణాల జారీ ప్రక్రియ తదితర అంశాలపైనా విచారణ సాగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

చినవెంకన్నను దర్శించుకున్న విప్ ఉదయభాను



ద్వారకాతిరుమల(ఏలూరు): ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలోని చినవెంకన్న దివ్య క్షేత్రాన్ని ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను బుధవారం సాయంత్రం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు, అర్చకులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మ వార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి వేద ఆశీర్వచనాన్ని పలుకగా, దేవస్థానం ఈఈ డీవీ భాస్కర్ స్వామివారి జ్ఞాపిక, ప్రసాదాలను అందజేశారు.

మల్లేశ్వరునికి సరికొత్త వైభవం

శరవేగంగా ఆలయ పునర్ నిర్మాణ పనులు

- కొత్త ఏడాది నుంచి భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించే అవకాశం
- పనుల నిర్వహణపై మంత్రి, అధికారుల నిరంతర పర్యవేక్షణ
- దుర్గగుడి అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ



ముస్తాబవుతున్న సువిశాల మల్లేశ్వరాలయం

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో రెండో దశ పనులు ప్రారంభించగా.. నాలుగు నెలల వ్యవధిలోనే ఆలయ శిథిలాలను తొలగించడంతో పాటు పునాదుల నిర్మాణం పూర్తయ్యింది.

దుర్గగుడి అభివృద్ధికి పెద్ద పీట..

2020 దసరా ఉత్సవాలలో అమ్మవారి దర్శనానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేసిన సందర్భంలో ఘాట్ రోడ్డులో కొండ రాళ్లు జారిపడ్డాయి. దీంతో దుర్గగుడిలో భక్తుల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం పెంచడంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేసింది. ఫలితంగా కొండపై చేపట్టాల్సిన పనులపై అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీని కోసం ముఖ్యమంత్రి రూ. 70 కోట్లు కేటాయించారు. తొలి విడతగా మల్లేశ్వరస్వామి వారి ఆలయాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు దేవదాయ శాఖ నిర్ణయించింది. నాలుగు నెలల కిందట మల్లేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి పనులకు బీజం పడింది. స్వామి వారి ఆలయ శిఖరంతో పాటు ఆలయానికి నలు వైపులా ఉన్న గోడలను, శిథిలాలను తొలగించే పనులు ప్రారంభించారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి పనులు పూర్తి అయ్యేలా కార్యాచరణ రూపొందించారు. ఆ దిశగా పనులు ముందుకు సాగేలా దేవస్థాన ఇంజినీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షిస్తున్నారు.



కొత్తగా ఏర్పాటు చేసిన మండపం

పనులపై మంత్రి పర్యవేక్షణ

మల్లేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి పనులను దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు పలు మార్లు సమీక్షించారు. దేవదాయ శాఖ క్యాంప్ కార్యాలయంలో ప్రతి వారం నిర్వహించే సమీక్ష సమావేశంలో మల్లేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి పనులపై రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి పనులు ఏ మేరకు చేశారనే వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకుంటున్నారు. దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ నిరంతరం ఆలయ ఇంజినీరింగ్ అధికారులతో పనుల తీరును అడిగి తెలుసుకుంటున్నారు.

పర్చూరు నుంచి రాయి..

ఆలయ నిర్మాణానికి అవసరమైన రాయిని పర్చూరులోని క్వారీ నుంచి కొనుగోలు చేసి నిర్మాణానికి అవసరమైన రీతిలో మలుస్తున్నారు. ఆలయ ప్రాంగణానికి తరలించిన రాయిని క్రేన్ సాయంతో పని ప్రదేశానికి తీసుకొస్తూ.. అవసరం మేరకు తొలుస్తున్నారు. ఆలయ పనులను కార్మికులు నిరంతరం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నియమ నిష్ఠలతో చేస్తున్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో పాటు స్వామి వారి దర్శనానికి భక్తులను అనుమతించేలా పనులు వేగవంతం చేస్తున్నారు. వచ్చే ఏడాది మహాశివరాత్రి నాటికి ఆలయ నిర్మాణం పూర్తి స్థాయిలో పూర్తవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.



గిడ్డంగుల నిర్మాణాలపై దృష్టి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునే బహుళ ప్రయోజన సౌకర్యాల కల్గిన గిడ్డంగులకు స్థల సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. గిడ్డంగుల నిర్మాణాలపై జిల్లా స్థాయి అమలు కమిటీ చైర్మన్, కలెక్టర్ ఢిల్లీరావు అధ్యక్షతన బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు పండించిన పంటలను భద్రపరచుకునేలా ప్రభుత్వం బహుళ ప్రయోజన సౌకర్యాల గిడ్డంగులు నిర్మించాలని నిర్ణయం తీసుకుందన్నారు. ఈ గిడ్డంగులలో డ్రైయింగ్ ప్లాట్‌ఫారమ్, పాల సేకరణ కేంద్రాలు, శీతల గదులు, ప్రాథమిక ప్రాసెసింగ్ కేంద్రాలు, పరీక్ష పరికరాలు, జనతా బజార్లు, ఈ–మార్కెటింగ్ వంటి సౌకర్యాలు ఉంటాయన్నారు.

- మూడు దశలలో గిడ్డంగులను నిర్మించాలని లక్ష్యాన్ని నిర్దేశించామన్నారు. మొదటి దశ కింద 58 గిడ్డంగుల నిర్మాణానికి ఇప్పటికే స్థలాన్ని కేటాయించామని తెలిపారు.
- రెండో దశ కింద మరో 50 గిడ్డంగులను నిర్మించుకునేందుకు స్థలాలు సేకరించాల్సి ఉండగా ఇప్పటికే 32 గిడ్డంగులకు స్థల సేకరణ పూర్తయిందన్నారు.
- మూడో దశలో మంజూరైన 18 గిడ్డంగులను నిర్మించేందుకు తహసీల్దార్లు, మార్కెటింగ్ అధికారులు సంయుక్తంగా స్థల సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.

వీరులపాడు వెనుకంజ

స్థల సేకరణలో వీరులపాడు మండలం పూర్తిగా వెనుకబడి ఉందని, ఎనిమిది గిడ్డంగులకు స్థల సేకరణ జరగలేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని కారణంగా జిల్లా ర్యాంకు పడిపోయిందన్నారు. రెండు రోజులలో అక్కడ స్థల సేకరణ పనులను పూర్తి చేయాలని స్థానిక తహసీల్దార్‌ను ఆదేశించారు. అలాగే స్థలాల సమస్య ఉన్న రామవరప్పాడు, ప్రసాదంపాడు గొల్లపూడి, వెలగలేరు గ్రామాలలో గిడ్డంగులను నిర్మించేందుకు ప్రత్యామ్నాయ స్థలాలను పరిశీలించాలన్నారు. సమావేశంలో కమిటీ ఉపాధ్యక్షులు, జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్, కన్వీనర్ డిస్ట్రిక్ కోఆపరేటివ్ అధికారి హెచ్ సీహెచ్ శైలజా, మార్కెటింగ్ ఏడీ కిషోర్ పాల్గొన్నారు.

దోమల దండును తరిమేద్దాం

విజయవాడలో మలేరియా, డెంగీలపై అవగాహన ర్యాలీ

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): పరిసరాల పరిశుభ్రతతో అనేక వ్యాధులకు దూరంగా ఉండొచ్చని వక్తలు సూచించారు. నగరపాలక సంస్థ, కేబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో దోమల నివారణ, డెంగీ, మలేరియా వ్యాధులపై అవగాహన కార్యక్రమాలను బుధవారం ఆ కళాశాల వద్ద నిర్వహించారు. దీనిలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దోమల నివారణపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు నగరపాలక సంస్థ వివిధ కార్యక్రమాలను నిర్వహించటం అభినందనీయమన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే వెలంపల్లి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ తదితరులు

ప్రజా భాగస్వామ్యం ఉండాలి..

మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నగరపాలకసంస్థ ప్రజారోగ్య శాఖ దోమల నివారణ కోసం అనేక చర్యలు తీసుకున్నప్పటికీ, ప్రజలు భాగస్వామ్యం లేకుంటే అది వృథా ప్రయాసే అవుతుందన్నారు. ప్రజలు అధికారులతో సహకరించి వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ వ్యాధులకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేను పాటించి దోమల నివారణకు పూర్తి స్థాయిలో తోడ్పాటు అందించాలని కోరారు. వారం రోజుల పాటు దోమల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

నీటి నిల్వలు ఉండకూడదు..

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ మాట్లాడుతూ ప్రజలు దోమకాటుతో వచ్చే వ్యాధుల బారినపడకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల వ్యాప్తి చెందకుండా ఉండేందుకు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీని మేయర్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్ డాక్టర్ సుహాసిని, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, బయాలజిస్ట్ డాక్టర్ బాబు శ్రీనివాసన్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాలువలో కొట్టుకొచ్చిన మృతదేహం

పెనమలూరు: మండలంలోని యనమలకుదురు లాకుల వద్దకు బందరు కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు. యనమలకుదురు లాకుల వద్దకు బందరు కాలువలో గుర్తు తెలియని మృతదేహం కొట్టుకొచ్చింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి వయస్సు 30–35 సంవత్సరాల మధ్యలో ఉంటుంది. జీన్స్ ప్యాంట్, నీలి రంగు చొక్కా వేసుకుని ఉన్నాడు. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డివైడర్‌ను ఢీకొని పల్టీకొట్టిన కారు



నందిగామ: అతి వేగంగా వచ్చిన కారు జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు స్వల్పంగా గాయపడ్డారు. 65వ నంబర్ జాతీయ రహదారిపై నందిగామ పట్టణ శివారుల్లోని వైజంక్షన్ వద్ద బుధవారం ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న కారు అతి వేగంగా వై జంక్షన్‌ను సమీపించింది. వేగాన్ని నియంత్రించలేక డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. గాయపడిన వారంతా హైదరాబాద్‌కు చెందిన వారని పోలీసులు తెలిపారు.

కృష్ణా మిల్క్ యూనియన్‌లో
బోర్డు డైరెక్టర్ల ఎన్నిక లాంఛనమే

చిట్టినగర్ (విజయవాడ పశ్చిమ): కృష్ణా మిల్క్ యూనియన్ బోర్డు డైరెక్టర్ల ఎన్నిక ఏకగ్రీవమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మూడు బోర్డు డైరెక్టర్ల స్థానాలకు ఐదుగురు సభ్యులు నామినేషన్లు దాఖలు చేశారు. పాలప్రాజెక్టు ఆవరణలోని క్షీరదర్శిని హాల్‌లో ఎన్నికల ప్రక్రియను ఎన్నికల అధికారి ఎల్. గురునాథం పర్యవేక్షించారు. బుధవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. 395 మంది సభ్యులు కలిగిన యూనియన్‌లో ఐదుగురు నామినేషన్లు దాఖలు చేయగా ఎన్నికల అధికారి ఒక నామినేషన్‌ను తిరస్కరించారు. నందిగామకు చెందిన నెలకుదిటి నాగేశ్వరరావు, ఏలూరు జిల్లా ఆగిరిపల్లికి చెందిన పల్లగాని కొండలరావు, కృష్ణాజిల్లా గన్నవరానికి చెందిన పాలడుగు వెంకటరామవరప్రసాద్, తోట్లవల్లూరుకు చెందిన మర్రెడ్డి బసివిరెడ్డితో పాటు వీరపనేని శివరామప్రసాద్ నామినేషన్లు దాఖలు చేశారు. శివరామప్రసాద్ కృష్ణా మిల్క్ యూనియన్‌కు రూ.4.26 లక్షల బకాయి పడటం, ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉండటంతో అతని నామినేషన్‌ను ఎన్నికల అధికారి తిరస్కరించారు. పోటీలో నలుగురు సభ్యులు ఉన్నట్లు ప్రకటించారు. గురువారం సాయంత్రం వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఈ నేపథ్యంలో బుజ్జగింపుల పర్వం ఉంటుందని తెలుస్తోంది. గత ఏడాది నామినేషన్ల ప్రక్రియ సమయంలో కొన్ని గొడవలు జరిగాయి. దీంతో ఈ దఫా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడు అంచెల పద్ధతిలో బోర్డు సభ్యులను మాత్రమే పాలప్రాజెక్టు ఆవరణలోకి అనుమతించారు. కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యంతో పాటు పలువురు స్టేషన్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



నామినేషన్లు దాఖలుచేస్తున్న అభ్యర్థులు

యువకుడి బలవన్మరణం

పెడన: పట్టణానికి చెందిన యువకుడు బుధవారం ఉదయం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బంధువుల కథనం మేరకు.. పెడన 16వ వార్డుకు చెందిన రౌతుల వెంకటేశ్వరరావు (22) మచిలీపట్నంలో డిగ్రీ చదువుతున్నాడు. పరీక్ష రాసేందుకని ఇంట్లో చెప్పి బుధవారం ఉదయం మచిలీపట్నం వెళ్లాడు. ఈ క్రమంలో మచిలీపట్నం, చిలకలపూడి రైల్వే స్టేషన్ల మధ్య రైల్వేట్రాక్ పక్కన యువకుడి మృతదేహం కనిపించడంతో రైల్వే పోలీసులు గుర్తు తెలియని యువకుడిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి ఫొటో వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారమైంది. మృతుడిని వెంకటేశ్వరరావుగా గుర్తించిన స్నేహితులు, అతని తల్లిదండ్రులు, బంధువులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంకటేశ్వరరావు తండ్రి రౌతుల అన్నవరం తన కుమారుడు బలవన్మరణం చేసుకున్న విషయమై బుధవారం పెడన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పెడన 17వ వార్డుకు చెందిన యువతి అదృశ్యంపై పోలీసులు తన కుమారుడిని విచారణకు పిలిచారని, ఈ విషయం తమకు తెలియదని ఫిర్యాదులో పేర్కొన్నారు. యువతి బంధువులు, స్థానిక పెద్దలు మంగళవారం తమ ఇంటికి వచ్చి గొడవకు దిగారని, తన కుమారుడు తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. కనిపించకుండా వెళ్లిన యువతికి వెంకటేశ్వరరావు ఫోన్ నుంచి నగదు లావాదేవీలు జరిగినట్లుగా గుర్తించి అతడిని విచారణకు పిలిచామని ఎస్ఐ మురళి తెలిపారు. తరువాత రావాల్సిందిగా చెప్పి అతడిని పంపించామని చెప్పారు. యువతి, మృతుడి కుటుంబ సభ్యులు పరస్పరం ఫిర్యాదులు చేయడంతో కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని తెలిపారు.



వెంకటేశ్వరరావు మృతదేహం

అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): 'ప్రభుత్వం మనపై ఉంచిన బాధ్యతలను విస్మరించొద్దు. గృహ నిర్మాణ లక్ష్యాల సాధనలో అలసత్వం వహిస్తే ఉపేక్షించను' అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. నగరంలోని కలెక్టరేట్ నుంచి గృహ నిర్మాణాల ప్రగతిపై తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణశాఖ ఏఈలు, మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధపెట్టి, పేదలందరికీ సొంత ఇంటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో చర్యలు చేపట్టిందన్నారు. ఈ గురుతర బాధ్యతలు అధికారులకు అప్పగించిందని పేర్కొన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో అలసత్వం ప్రదర్శించడం తగదని సూచించారు. ఇప్పటికైనా గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు. గృహ నిర్మాణాలలో జిల్లాను అగ్రగామిగా నిలపటంలో భాగస్వాములు కావాలని కోరారు. నిర్దేశించిన లక్ష్యాలపై మండలాల వారీగా సంబంధిత అధికారులతో కలెక్టర్ ఢిల్లీరావు సమీక్షించారు. లక్ష్యాల సాధనలో వెనుకబడిన మండలాల గృహ నిర్మాణ శాఖ అధికారులను అందుకు తగిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల పరిధిలో 10,711, నందిగామ, తిరువూరు, కొండపల్లి, జగ్గయ్యపేట మునిసిపాలిటీల పరిధిలో 1,234 ప్రారంభంకాని, పునాదులకు దిగువ స్థాయిలో ఉన్న నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజయవాడ రూరల్, వత్సవాయి, మైలవరం, జి.కొండూరు, పెనుగంచిప్రోలు, నందిగామ, ఇబ్రహీంపట్నం, కంచికచర్ల, చందర్లపాడు, వీరులపాడు, జగ్గయ్యపేట మండలాల పరిధిలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. పునాది స్థాయిలో ఉన్న నిర్మాణాలను శ్లాబు స్థాయికి, శ్లాబు స్థాయిలో ఉన్నవాటిని పూర్తిచేసేలా అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు కృషిచేయాలని కలెక్టర్ ఢిల్లీరావు కోరారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, హౌసింగ్ పీడీ శ్రీదేవి, ట్రైనీ డెప్యూటీ కలెక్టర్లు రామలక్ష్మి, భాను పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి



కంకిపాడు (పెనమలూరు): విద్యుదాఘాతానికి గురై కార్మికుడు మృతి చెందిన ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఎస్ఐ వై.దుర్గారావు కథనం మేరకు.. మండలంలోని పునాదిపాడు గ్రామానికి చెందిన బత్తుల వెంకటేశ్వరరావు (55) సెంట్రింగ్ కార్మికుడు. గ్రామంలోని జి.ఆంజనేయులు ఇంటి వద్ద బుధవారం ఐరన్ పైపులతో వెంకటేశ్వరరావు సెంట్రింగ్ పనులు చేపట్టాడు. ఆ పైపులు ప్రమాదవశాత్తూ పక్కనున్న విద్యుత్ లైనుకు తగిలి అతను విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గారావు తెలిపారు.

కాలువలో జారిపడి వృద్ధురాలి మృతి

తోట్లవల్లూరు (పామర్రు): ప్రమాదవశాత్తు కేఈబీ కాలువలో జారిపడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని రొయ్యూరు గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. రొయ్యూరు గ్రామానికి చెందిన ఓరుగంటి సుమతి (61) కేఈబీ కాలువ వంతెన సమీపంలోని రేవు వద్ద బుధవారం ఉదయం ఏడు గంటలకు కాళ్లు కడుక్కుంటూ ప్రమాదవశాత్తు నీటిలో జారిపడి గల్లంతైంది. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆమె కోసం గాలింపు చేపట్టారు. వల్లూరుపాలెం లాకుల వద్ద ఉదయం 11.30 గంటల సమయంలో ఆమె మృతదేహం లభ్యమైంది. మృతురాలి కుమారుడు ఓరుగంటి లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి



బంటుమిల్లి (పెడన): గుర్తుతెలియని మహిళ మృతిచెందిన ఘటనపై బంటుమిల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కొర్లపాడు పంచాయతీ శివారు నారాయణపురం గ్రామం వద్ద ఉన్న బస్‌షెల్టర్‌లో బుధవారం కొనఊపిరితో ఉన్న మహిళను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు ఆ మహిళను 108 అంబులెన్స్‌లో బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆమె మృతి చెందింది. గుర్తు తెలియని మహిళ వయసు 50 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఆమె వివరాలు తెలిసిన వారు 94407 96419 సెల్ నంబరును సంప్రదించాలని హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వరరావు కోరారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి కానిస్టేబుల్ దుర్మరణం

ఉంగుటూరు (గన్నవరం): రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని ఆత్కూరులో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మంగళగిరికి చెందిన చదలవాడ శ్రీనివాసరావు(47) ఏపీఎస్పీ 6వ బెటాలియన్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. కొంత కాలంగా గన్నవరం వ్యాక్సిన్ కేంద్రం వద్ద గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి శ్రీనివాసరావు బైక్‌పై గన్నవరం నుంచి ఆత్కూరు జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో వెళ్తుండగా ఆత్కూరు సమీపంలో అకస్మాత్తుగా కుక్క అడ్డు వచ్చింది. దానిని తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి శ్రీనివాసరావు కింద పడ్డారు. ఈ ఘటనలో తలకు తీవ్రగాయలు కావడంతో స్థానికులు విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి కొద్ది సేపటికే మృతి చెందారు. ఆత్కూరు హెడ్ కానిస్టేబుల్ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తీవ్రగాయాలతో ఆస్పత్రిపాలైన యువతి



పోతురాజు (ఫైల్)

హనుమాన్‌జంక్షన్ రూరల్ (గన్నవరం): బాపులపాడు మండలం వీరవల్లి వద్ద బైక్‌పై వెళ్తున్న ప్రేమజంట రోడ్డు ప్రమాదానికి గురైంది. 16వ నంబరు జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా, యువతి తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలైంది. పోలీసుల కథనం మేరకు.. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం చెరువూరుకు చెందిన సారపు పోతురాజు, గుంటూరు జిల్లా తెనాలికి చెందిన మెర్సీ కొంతకాలంగా ఓ స్పిన్నింగ్ మిల్లులో కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి మధ్య ప్రేమ చిగురించింది. తమ ప్రేమ విషయాన్ని ఇద్దరూ తమ పెద్దలకు చెప్పగా వారు అంగీకరించలేదు. ఈ నెల 19వ తేదీన మెర్సీకి వేరే యువకుడితో వివాహం చేసేందుకు ఆమె కుటుంబ సభ్యులు నిర్ణయించారు. దీంతో 18వ తేదీనే మెర్సీ, పోతురాజు తమ ఇళ్ల నుంచి పరారయ్యారు. ఈ నేపథ్యంలో మెర్సీ అదృశ్యమైందని ఆమె తల్లిదండ్రులు తెనాలి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మెర్సీ, పోతురాజుతో కలిసి అతని స్వగ్రామమైన రంపచోడవరం మండలం చెరువూరులో ఉన్నట్లు గుర్తించారు. విచారణ నిమిత్తం తెనాలి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిందిగా ప్రేమికులకు పోలీసులు సూచించారు. ఈంతో పోతురాజు, మెర్సీ బైక్‌పై తెనాలి బయలుదేరారు. వీరవల్లి సమీపంలో జాతీయ రహదారి ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదకు రాగానే పోతురాజు సెల్‌ఫోన్ మోగింది. అతను బైక్ నడుపుతూనే ఫోన్ మాట్లాడేందుకు ప్రయత్నించాడు. బైక్ అదుపుతప్పి వంతెన సైడ్ వాల్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రేమికులు ఇద్దరూ ఎగిరి ఫ్లై ఓవర్ బ్రిడ్జి పై నుంచి కింద ఉన్న సర్వీసు రోడ్డుపై పడ్డారు. తీవ్ర రక్తస్రావంతో పోతురాజు అక్కడికక్కడే మృతిచెందాడు. మెర్సీ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సమాచారం అందుకున్న వీరవల్లి ఏఎస్ఐ వై.ఆంజనేయులు, హైవే రోడ్ సేఫ్టీ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మెర్సీని హుటాహుటిన విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఘటనాస్థలంలో పోతురాజు మృతదేహం



తీవ్రంగా గాయపడిన మెర్సీ

రెండున్నరేళ్ల చిన్నారికి అరుదైన ఆపరేషన్



కోలుకున్న బాలిక

లబ్బీపేట (విజయవాడ తూర్పు): రెండున్నరేళ్ల చిన్నారికి ఎడమ సర్వైకల్–యాక్సిలరీ ప్రాంతంలో హైబ్రిడ్ న్యూరోఫైబ్రోమా ష్వానోమా అనే అరుదైన ట్యూమర్ (గడ్డ) ఏర్పడింది. విజయవాడ అంకుర ఆస్పత్రి వైద్యులు శస్త్ర చికిత్సతో ఆ గడ్డను విజయవంతంగా తొలగించారు. ఈ వయస్సు చిన్నారికి ఇలాంటి ట్యూమర్ రావడం చాలా అరుదని ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఆస్పత్రిలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లికి చెందిన రెండున్నరేళ్ల చిన్నారికి ఏడాది కిందట ఎడమవైపు మెడపై చిన్న గడ్డ ఏర్పడి క్రమంగా ఆక్సిలా(చంకభాగం)కు విస్తరించిందని తెలిపారు. చిన్నారిని కుటుంబ సభ్యులు తమ ఆస్పత్రికి తీసుకురాగా, పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ వరుణ్‌కుమార్ పరీక్షించి, హైబ్రీడ్ న్యూరోఫైబ్రోమా ష్వానోమాగా నిర్ధారించారని పేర్కొన్నారు. ఈ ట్యూమర్ మెడ నరాలకు సమీపంలో ఉండటంతో శస్త్ర చికిత్స చేయడం అత్యంత క్లిష్టంగా మారిందన్నారు. సుమారు ఏడు గంటల పాటు శస్త్రచికిత్స చేసి ట్యూమర్‌ను తొలగించామని, ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యంగా ఉందని వివరించారు. పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ వరుణ్‌కుమార్, పీడియాట్రిన్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

ప్రేమ పేరిట యువతిపై లైంగికదాడి

చిట్టినగర్ (విజయవాడ పశ్చిమ): ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... విజయవాడ ఫ్రైజర్‌పేటకు చెందిన 23 ఏళ్ల యువతి ఎంబీఏ చదివి, ఉద్యోగం కోసం ప్రయత్నిస్తోంది. డిగ్రీ చదివే సమయంలో సహచర విద్యార్థి అయిన సంధక లోకేశ్వరరావు ప్రేమిస్తున్నానంటూ ఆ యువతి వెంట పడ్డాడు. అతడి మాటలను ఆ యువతి నమ్మింది. నాలుగేళ్లలో లోకేశ్వరరావు తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతిని తీసుకువెళ్లి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. కొద్ది రోజులుగా ఆయువతి ఫోన్ చేస్తే లోకేశ్వరరావు స్పందించడంలేదు. తన మరదలిని పెళ్లి చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. దీంతో ఆ యువతి తాను మోసపోయానని గుర్తించి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చంపి.. రాళ్లుకట్టి.. కాలువలో పడేసి..

- రవి కిరణ్‌రెడ్డి దారుణ హత్య
- మంగళవారం లభ్యమైన మృతదేహం
- మనస్తాపంతో తల్లి ఆత్మహత్య
- ప్రేమ వివాదమే కారణంగా గుర్తింపు



రవికిరణ్‌రెడ్డి(ఫైల్)

బాపట్ల టౌన్: అసహనం.. మానవత్వం మరిచేలా చేసింది.. ప్రేమ ప్రాణాలు బలిగొంది. ఎదిగొచ్చిన కొడుకును కొందరు బలి తీసుకోవడంతో కన్నతల్లి పేగు తల్లడిల్లింది.. తానూ తనువుచాలించింది. ఈ ఘటన బాపట్ల మండలం నాగేంద్రపురంలో జరిగింది. గ్రామానికి చెందిన దొంతిన రవికిరణ్‌రెడ్డి(24), రాజమండ్రిలో బీటెక్ పూర్తి చేసి, విజయవాడలో బ్యాంక్ ఉద్యోగాల కోసం కోచింగ్ తీసుకుంటున్నాడు. అతడికి పర్చూరు మండలం, చిననందిపాడుకు చెందిన యువతితో ఫేస్‌బుక్‌లో పరిచయమై, ప్రేమగా మారింది. యువతి చీరాలలో బీటెక్ చదువుతోంది. ఈ ఏడాది జూలైలో ఆమె తన పుట్టిన రోజును చీరాలలో చేసుకోగా, రవికిరణ్‌రెడ్డి కేక్ తీసుకెళ్లాడు.

బెదిరింపులు ఇలా..

అప్పటికే ఆ యువతిని పెళ్లి చేసుకోవాలనుకుంటున్న చీరాలకు చెందిన కార్‌ట్రావెల్స్ నిర్వాహకుడు, రవికిరణ్‌ను చూసి రెండోసారి అమ్మాయితో కనిపిస్తే చంపుతానని బెదిరించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ విషయాన్ని రవికిరణ్ తన తమ్ముడుకి ఫోన్ ద్వారా వివరించాడు. తమ్ముడు చీరాల చేరుకుని అక్కడి నుంచి రవికిరణ్‌ను ఇంటికి తీసుకెళ్లాడు.

సర్టిఫికెట్ కోసం వెళ్లి కానరాని లోకాలకు..

రవికిరణ్ ఇటీవల బెంగళూరు వెళ్లి బ్యాంక్ ఉద్యోగ పరీక్ష రాసి వచ్చాడు. ఈ నెల 22న చీరాల తహసీల్దార్ కార్యాలయంలో సర్టిఫికెట్ తీసుకునేందుకు వెళ్తున్నానని ఇంటి నుంచి బయటకొచ్చాడు. మధ్యాహ్నం కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ అని వచ్చింది. ఇంటికి తిరిగి రాకపోవడంతో మంగళవారం ఉదయం బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీశారు. ఇంతలో కాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందనే విషయం తెలుసుకున్నారు. ఏరియా వైద్యశాలలో ఉన్న మృతదేహం తమ కుమారుడిదేనని తల్లిదండ్రులు గుర్తించారు.

కార్ ట్రావెల్స్ నిర్వాహకుడిపైనే అనుమానం

చీరాల వచ్చిన రవికిరణ్‌రెడ్డిని కార్ ట్రావెల్స్ నిర్వాహకుడు తన అనుచరులతో హత్య చేసి, రాళ్లుకట్టి గుడిపూడి–ఏత్రవారిపాలెం వెళ్లే కాలువలో పడేశారని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. నెల క్రితమే ఈ అమ్మాయి వెంట కనపడితే చంపుతానని కార్ ట్రావెల్స్ నిర్వాహకుడు తన అన్నను బెదిరించాడని, అతనే హత్యచేసి ఉంటారని మృతుడి తమ్ముడు పోలీసులు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడు లేని లోకంలో ఉండలేక..

కుమారుడు రవికిరణ్‌రెడ్డిను హత్యచేశారన్న విషయం తెలుసుకున్న తల్లి మల్లీశ్వరి మనస్తాపంతో బుధవారం పట్టణంలోని చాకలిపాలెం గేటు సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. కొడుకు హత్యకు గురికావడం, తల్లి ఆత్మహత్య చేసుకోవడంతో నాగేంద్రపురం గ్రామం ప్రజలు విషాదంలోమునిగిపోయారు. మృతుడి తండ్రి సూర్యనారాయణరెడ్డి, తమ్ముడు మహేష్ భోరున విలపించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భవానీపురం(విజయవాడ పశ్చిమ):న్యూ రాజ రాజేశ్వరిపేట విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో 11 కేవీ జనప్రియ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు సాయిబాబా గుడి రోడ్, జేపీ అపార్ట్‌మెంట్ రోడ్, మహంకాళి అమ్మవారి గుడి రోడ్, అల్లు అప్పలనారాయణ నగర్, జయలక్ష్మి నగర్ తదితర ప్రదేశాల్లో కరెంట్ ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సేంద్రియ సాగుపై అవగాహన కల్పించాలి

కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పి.భాస్కర్



మధురానగర్(విజయవాడ సెంట్రల్):విద్యార్థులు సేంద్రియ ఎరువులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పి.భాస్కర్ తెలిపారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జువాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యాన ప్రిపరేషన్ అండ్ సేల్ ఆఫ్ లీఫ్ కంపోస్ట్ కార్యక్రమం ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి లీఫ్ కంపోస్ట్ తయారీ గురించి వివరించారు. వ్యర్థాలతో తమ విద్యార్థులు లీఫ్ కంపోస్ట్‌ను తయారు చేస్తున్నారని తెలిపారు. ఈ కంపోస్ట్ వల్ల భూమి సారం పెరగటంతో పాటు మంచి దిగుబడి వస్తుందన్నారు.

రైతులు శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి



గరికపాడు(జగ్గయ్యపేట): రైతులు వ్యవసాయ శాఖాధికారులు, శాస్త్రవేత్తల సలహాలు పాటించాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రాన్ని రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కేవీకేను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఈ వ్యవసాయ క్షేత్రంలో అన్ని రకాల పంటలపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయటంతో పాటు రైతులకు సలహాలు, సూచనలు అందిస్తామని తెలిపారు. వివిధ రకాల పంటలకు అనువైన దిగుబడులు కూడా క్షేత్ర స్థాయిలో పరిశీలించవచ్చని చెప్పారు. ముఖ్యంగా మహిళా రైతులను ప్రోత్సహించి వారికి లాభాలు అందించే పెరటి తోటల పెంపకం, తదితరాలపై హోంసైన్స్ శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం పలువురు రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విస్తరణ సంచాలకుడు రాంబాబు, పరిశోధనా సంచాలకురాలు ప్రశాంతి, శాస్త్రవేత్తలు మాధవి, శివప్రసాద్, వెంకటరెడ్డి, రాజశేఖర్, జశ్వంత్‌రెడ్డి, ప్రబావతి తదితరులు పాల్గొన్నారు.

నేతి లక్ష్మీనారాయణ కళా సేవలు వెలకట్టలేనివి



విజయవాడ కల్చరల్: వేద పండితులు, బహు గ్రంథకర్త హరికథకు జాతీయస్థాయి కీర్తి సంపాదించి పెట్టిన నేతి లక్ష్మీనారాయణ సాంస్కృతిక సేవలు వెలకట్టలేనివని శాతవాహనా కళాశాల కరస్పాండెట్ నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. ఆదిభట్ల నారాయణదాసు శిష్య ప్రశిష్య బృందం ఆధ్వర్యంలో సీతారామ కల్యాణ మండపంలో బుధవారం నేతి లక్ష్మీనారాయణ సంస్మరణ సభ నిర్వహించారు. రమా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి దేవాలయంలో హరికథా పీఠం ఏర్పాటు చేసి కథలకు ప్రాధాన్యం ఇస్తూ కళాకారులను ప్రోత్సహించాలని సూచించారు. అన్నమయ్య పరివారం (హైదరాబాద్) యనమండ్ర వెంకట కృష్ణయ్య, సంస్కృతాంధ్ర పండితులు డాక్టర్ ములుకుట్ల బ్రహ్మానందశాస్త్రి, వాయిలీన విద్వాంసురాలు అమ్ముల దుర్గాభవాని ప్రసంగించారు. మోపిదేవి దుర్గాభవాని సత్కరించారు. ఉదయం శివాలయంలో ఉన్న నారాయణదాసు విగ్రహానికి పూజాదికాలు నిర్వహించారు. హరికథా మహోత్సవాల్లో భాగంగా పలువురు కథకులు హరికథా గానం చేశారు.

అగ్రవర్ణాల పేదలకూ సంక్షేమ పథకాల అమలు

గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెలంపల్లి



మహిళలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలంపల్లి

భవానీపురం(విజయవాడ పశ్చిమ):రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ప్రజలకే కాకుండా అగ్రవర్ణాల పేదలకూ కాపు నేస్తం, ఈబీసీ నేస్తం వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తుందని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా ఆయన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ గోదావరి గంగతో కలిసి 47వ డివిజన్ 147వ వార్డ్ సచివాలయం పరిధిలో బుధవారం ఇంటింటికీ తిరిగారు. మూడేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీతో తైతక్కలాడిన పవన్ కల్యాణ్ కులాన్ని అడ్డుపెట్టుకుని కాపులను ఓటు బ్యాంక్‌గా వాడుకున్నాడు తప్ప కాపు నేస్తం వంటి పథకాలకు కనీసం ప్రతిపాదన కూడా పెట్టలేదన్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ అన్ని ఫలాలు అందాలన్న మంచి మనసుతో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నారని తెలిపారు. ఈ సచివాలయం పరిధిలో 990 కుటుంబాలు నివసిస్తుండగా అందులో 975 కుటుంబాలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందాయన్నారు. వరద నీరు వచ్చినప్పుడల్లా విజయవాడ కృష్ణలంకలో కొన్ని ప్రాంతాలు ముంపుకు గురయి స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నా స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు పట్టించుకున్న దాఖలాలు లేవని, సీఎం జగన్ ముందుచూపుతో రిటైనింగ్‌వాల్ నిర్మించి స్థానిక పేదల ముంపు కష్టాల నుంచి విముక్తి కల్పించారని తెలిపారు.

ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీలకు మనుగడ లేదు...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇకపై టీడీపీ, జనసేన, బీజేపీ, ఇతర ప్రతిపక్ష పార్టీలకు మనుగడ లేదని, అందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలనే నిదర్శనమని వెలంపల్లి పేర్కొన్నారు. నాడు ప్రతిపక్ష నాయకుడిగానే 175కు 151 శాసనసభ స్థానాలు, 23 ఎంపీ స్థానాలను సాధించిన జగన్‌మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికల్లో 175 సీట్లకు 175 సాధించనున్నారని తెలిపారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ, 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేశానని చెప్పుకుంటున్న చంద్రబాబు తన కుప్పం నియోజకవర్గంలోనే మౌలిక సదుపాయాలను కల్పించలేని అసమర్థుడని విమర్శించారు. సీఎం జగన్ కుప్పం నియోజకవర్గానికి స్పెషల్ ప్యాకేజి ప్రకటించి అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు.

వినాయకచవితిని కూడా రాజకీయం చేస్తున్నారు...

ప్రతి దానిని రాజకీయం చేయటం ప్రతిపక్ష టీడీపీకి అలవాటయి పోయిందని, చివరికి వినాయక చవితి పండుగనుకూడా ఇప్పుడు రాజకీయం చేస్తుందని వెలంపల్లి మండిపడ్డారు. వినాయకచవితి సాకుతో ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందని దుష్ప్రచారం చేస్తున్న బొండా ఉమ జీవితంలో మరోసారి ఎమ్మెల్యే కాలేడని అన్నారు. నాడు కాపుల గొంతు కోశారని చంద్రబాబుపై ధ్వజమెత్తిన బొండా ఉమ అదే పార్టీలో కొనసాగటానికి సిగ్గుండాలన్నారు. గతంలో పుష్కరాల వంకతో 42 దేవాలయాలను కూల్చేసిన దుర్మార్గుడు చంద్రబాబుకు పవన్ కల్యాణ్, బీజేపీ వత్తాసు పలికారని గుర్తు చేశారు. బీజేపీని పెళ్లి చేసుకున్న పవన్‌కల్యాణ్ చంద్రబాబుతో కాపురం చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. కార్పొరేటర్లు గోదావరి గంగ, యలకల చలపతి రావు, వైఎస్సార్ సీపీ నాయకులు గోదావరి బాబు, కూరాకుల నాగ, సోమిశెట్టి వెంకటేష్, మద్దిరాల కమలాకర్, బండి కాళేశ్వరరావు, దిద్దుకూరి శివ, యరజర్ల మురళి, కుంభ నాగేశ్వరరావు, వై రవి, నన్నం దుర్గ, ఇలిపిల్లి విజయలక్ష్మి, పోలిమెట్ల శరత్, బూదాల శ్రీను, కొరగంజి భాను, మజ్జి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న ఏడీసీపీ సర్కార్ పక్కన ఏసీపీలు

ఏడీసీపీ సర్కార్

విజయవాడ స్పోర్ట్స్:నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ అడిషనల్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏడీసీపీ) టి.సర్కార్ తెలిపారు. బందరు రోడ్డులోని ట్రాఫిక్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు విజయవాడ నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెప్పారు. అన్ని ప్రధాన కూడళ్లలో సిగ్నల్ లైట్లను, సోలార్ ఫ్లాషర్స్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రమాదాలు ఎక్కువ జరిగే ప్రాంతాలను గుర్తించి సూచన బోర్డులు, బారికేడ్లు, స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదాల కారణంగా తలెత్తే సమస్యలను వివరిస్తూ నగరంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఇంటిలిజెన్స్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఐటీఎంఎస్)ను అందుబాటులోకి తెచ్చే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాల ప్రతిష్టను నిషేధించామని స్పష్టం చేశారు. పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసుకునే భక్తులు ట్రాఫిక్‌కు సమస్యలు తలెత్తకుండా వారి సొంత స్థలాల్లోనే విగ్రహాలను ప్రతిష్ట చేసుకోవాలని సూచించారు.

మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు....

మద్యం తాగి వాహనం నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గడిచిన మూడేళ్లతో పోల్చితే ఈ ఏడాది అత్యధికంగా కేసులు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు. 2020లో 971 మందిపై కేసులు నమోదు చేయగా రూ.20.16 లక్షలు జరిమానా చెల్లించారని, వీరిలో 68 మందికి జైలు శిక్ష పడిందన్నారు. 2021లో 444 మందిపై కేసులు నమోదు చేయగా రూ.9.30 లక్షలు జరిమానా కట్టారని, వీరిలో 73 మందికి జైలు శిక్ష పడిందన్నారు. 2022 ఆగస్టు 24వ తేదీ వరకు 754 మందిపై కేసులు నమోదు చేయగా రూ.33.74 లక్షలు జరిమానా చెల్లించారని, వీరిలో 496 మందికి జైలు శిక్ష పడిందన్నారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష పడిన వ్యక్తుల పాస్ పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. వాహనం నడిపే మైనర్లను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇస్తున్నామన్నారు. గడిచిన మూడు నెలల్లో 4 వేల మందికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. 14,619 ట్రిబుల్ రైడింగ్ కేసులను నమోదు చేసినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న మైనర్లు నగరంలో సరికొత్త నేరాలకు పాల్పడుతున్నట్లు ఇటీవల జరిగిన కొన్ని ఘటనల విచారణలో తేలిందన్నారు. మైనర్లకు వాహనం ఇచ్చిన వ్యక్తిపై, తల్లిదండ్రులుపైనా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ ఏసీపీలు జి.శ్రీనివాసరావు, జె.వెంకటనారాయణ, కె.దామోదర్, ఆర్.రామచంద్రరావు పాల్గొన్నారు.

స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ నేత్రదాన పక్షోత్సవాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు):స్వేచ్ఛాగోరా ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి సెప్టెంబరు 8 వరకూ నేత్రదాన ప్రచార పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జి.సమరం తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వాసవ్య మహిళా మండలిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ సమరం మాట్లాడారు. ఈ నెల 26న పక్షోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. నేత్రదానంపై ఏర్పాటు చేయనున్న ఎగ్జిబిషన్‌ను ఈ నెల 29న హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పి.శ్యామ్‌ప్రసాద్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, స్లోగన్, క్విజ్, పాటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వాసవ్య మహిళా మండలి కార్యదర్శి రశ్మి, మెడికల్ డైరెక్టర్ పి.దీక్ష పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ):ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన యువకుడిపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కొత్తూరు తాడేపల్లికి చెందిన గుడవర్తి స్వామి వ్యవసాయం చేస్తుంటాడు. స్వామి ఇంటి సమీపంలో నాని నివాసం ఉంటున్నాడు. ఈ నెల 22వ తేదీన స్వామి వద్దకు వచ్చిన నాని బైక్ తాళం బలవంతంగా తీసుకుని వెళ్లాడు. ఆదే రోజు సాయంత్రం బైక్‌ను రోడ్డుపై వదిలేయడంతో స్వామి వెళ్లి చూడగా, బైక్‌ను రోడ్డుపై పడేసినట్లు గుర్తులు కనిపించాయి. దీంతో స్వామి నానిని ప్రశ్నించగా వివాదం చోటు చేసుకుంది. స్వామిని ఇష్టం వచ్చినట్లు కొట్టడంతో గాయాలయ్యాయి. దీంతో బాధితుడు నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నాడు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాలను క్రమం తప్పకుండా సక్రమంగా వేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం అమలుపై బుధవారం పునశ్చరణ శిక్షణ నిర్వహించారు. నగరంలోని ఓ కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చు ప్రక్రియను విశ్లేషణాత్మకంగా వివరించారు. చిన్నారులకు ఏ సమయంలో ఏ టీకాలు ఇవ్వాలి, టీకాలను నిల్వ ఉంచే విధానం వంటి అంశాలను వివరించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ పద్మావతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మోతీబాబు, ఆర్‌బీఎస్‌కే సమన్వయ అధికారిణి డాక్టర్ మాధవి, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ శృతి మౌనిక తదితరులు పాల్గొన్నారు. కొత్తపేటలోని కుటుంబ నియంత్రణ కేంద్రాన్ని తనిఖీ చేసారు. ఈ సందర్భంగా అందుబాటులో ఉన్న కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స సామగ్రిని పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్‌ని అందుబాటులోకి తీసుకొచ్చి, సత్వరమే కు.ని శస్త్ర చికిత్సలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో ఆగస్టులో జరిగిన మాతా శిశు మరణాలపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా మాతృమరణాల సమీక్ష కమిటీ సభ్యులు, ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ మాతా శిశు మరణాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. మాతృ మరణాలకు గల కారణాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫోక్సీ అధ్యక్షురాలు డాక్టర్ సుశీల, గైనకాలజిస్ట్ డాక్టర్ అరుణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ అతృత తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు

- ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి
- జిల్లాలో నాడు–నేడు ఫేజ్–2 కింద 84 భవన నిర్మాణాలకు నిధులు

కంచికచర్ల: అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఉమాదేవి అన్నారు. మండలంలోని పెండ్యాల, కంచికచర్లలో అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు అధికారులతో కలసి బుధవారం ఆయన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు– నేడు పథకం ఫేజ్–2 కింద జిల్లాలో 84 అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. కంచికచర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కంచికచర్లలో 13, వీరులపాడు మండలంలో 1 అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.13.5 లక్షలు, ఫర్నిచర్ కోసం రూ.2.5 లక్షలు వెరసి మొత్తం రూ.16 లక్షల నిధులు ప్రభుత్వం కేటాయించినట్టు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు కొన్ని గ్రామాల్లో స్థలం కేటాయించామని మరికొన్ని గ్రామాల్లో స్థలాలు అందుబాటులో లేకపోవటంతో రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలిస్తున్నామన్నారు. త్వరలోనే భవన నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి, సీడీపీఓ జి.లక్ష్మీభార్గవి, వీఆర్వో బ్రహ్మం, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వెంకయ్య స్వామి ఆరాధనోత్సవాలు



ఆరాధన మహోత్సవాల్లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి తదితరులు

మధురానగర్(విజయవాడ సెంట్రల్):గొలగమూడి వెంకయ్య స్వామివారి దివ్య ఆరాధన మహోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వెంకయ్యస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో పారాయణం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధురానగర్ కొబ్బరితోట కోలా సన్యాసిరావు రోడ్డులో గొలగమూడి వెంకయ్య స్వామివారి దివ్య ఆరాధన మహోత్సవాలు కనులపండువగా చేశారు. స్వామివారిని ఎమ్మెల్యే మల్లాది విష్ణు దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన స్వామి వారిని భక్తితో సేవిస్తే సకల కష్టాలు తీరుతాయన్నారు. కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, వైఎస్సార్ సీపీ నగర మహిళ అధ్యక్షురాలు పిల్లి కృష్ణవేణి, నగర అధికార ప్రతినిధి కంభం కొండలరావు, వైఎస్సార్ సీపీ నాయకులు నాయకులు కోలా రమేష్, శీమల గోవిందు, సుధాకర్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు. అయోధ్యనగర్ నవభారత్ అపార్ట్‌మెంట్ సమీపంలో నిర్వహించిన వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాల్లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది.

ఘనంగా బాలగోపాలుని ఊరేగింపు

మధురానగర్(విజయవాడ సెంట్రల్):మనిషి పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకు సమాజంలో ఆధ్యాత్మిక కోణంలో ఎలా జీవించాలో భగవద్గీత తెలియజేస్తుందని, ఉత్తమ జీవన విధానానికి భగవద్గీత స్ఫూర్తి అని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఆంధ్రప్రభ కాలనీలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకల ముగింపు సందర్భంగా బాలగోపాలుని ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గీతా పారాయణం, కోలాట నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం మల్లాది విష్ణు మాట్లాడుతూ ఆధ్యాత్మిక మార్గనిర్దేశం ద్వారా సమాజాన్ని సన్మార్గంలో నడిపే శక్తి భగవద్గీతకు ఉందన్నారు. చిన్న వయస్సులోనే భగవద్గీత శ్లోకాలను శాస్త్రబద్ధంగా పఠించడం, దానిలోని సందేశం అర్థం చేసుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని తెలిపారు. ఆస్ట్రేలియా, బ్రిటన్ వంటి దేశాలలోనూ భగవద్గీత సాక్షిగా ఎంపీలు ప్రమాణ స్వీకారం చేయడాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

నూతన ఆలోచనలకు పదును పెట్టాలి



ఎంఓయు చేసుకుంటున్న డ్రీమ్స్ ఈల్యాబ్స్ సీఈవో బాబుహరికృష్ణ

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగటానికి అవసరమైన నూతన ఆలోచనలకు పదును పెట్టాలని డ్రీమ్స్ ఈల్యాబ్స్ సీఈవో ఎల్.బాబుహరికృష్ణ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈడీసీ సెల్ ఆధ్వర్యంలో స్టార్టప్ ఎకో సిస్టమ్ అంశంపై సదస్సును ఆ కళాశాల సెమినార్ హాల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన బాబు హరికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న సాంకేతిక వికాసాన్ని గమనంలో ఉంచుకొని నూతన ఆవిష్కరణల దిశగా తమ ఆలోచనలకు పదును పెట్టాలని సూచించారు. ఆ దిశగా అధ్యయనం, పరిశోధనలు చేయాలన్నారు. వ్యాపార పరిస్థితులు, మార్కెటింగ్ అవసరాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వివిధ కంపెనీల అభివృద్ధి, వారు అవలంభించిన వినూత్న ఆలోచనలపై ఉదాహరణలతో వివరించారు. తొలుత కళాశాల ఈడీసీ సెల్‌తో డ్రీమ్ ఈల్యాబ్స్ ఎంఓయు పత్రాలను ఇచ్చిపుచ్చుకున్నారు. కళాశాల విద్యార్థులలో నూతన స్టార్టప్‌ల దిశగా ఆలోచనలను కల్పించేందుకు ఆ సంస్థతో చేసుకున్న ఒప్పందాలు ఉపకరిస్తాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతాంజలిశాస్త్రి, ఈడీసీ సెల్ కన్వీనర్ కె.సుధాకర్, అధ్యాపకులు జాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందచేస్తున్న అసోసియేషన్ సభ్యులు

భవానీపురం(విజయవాడ పశ్చిమ):నగరానికి చెందిన సుప్రీమ్ ఎంజీఎఫ్ వాకర్స్ అసోసియేషన్, అప్పన వెంకట కృష్ణయ్య–కామేశ్వరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోగల మోహన్‌లాల్ చంద్ర బాగ సాబు మెమోరియల్ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు తల్లం గంగాధర్, శ్రీనివాస్ నోట్ పుస్తకాలతోపాటు బిస్కట్స్ బుధవారం అందచేశారు. ఊర్మిళానగర్‌లోగల సిద్దెం కృష్ణారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రావి కృష్ణారావు, ఆలమూరి అమర్‌నాథ్, ఎం.చంద్రశేఖర్ పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు, అప్పన వెంకట కృష్ణయ్య–కామేశ్వరమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అప్పన వెంకట సత్య సాయిబాబు నోట్ పుస్తకాల వితరణకు ఆర్థిక సాయం అందించారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం



వెంకన్న ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవం

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): పాతబస్తీలోని వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి కల్యాణోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. విష్వక్సేనా మహిళా సేవా సమితి ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. తొలుత మంగళ వాయిద్యాలతో స్వామివారి ఉత్సవమూర్తులను వేదికపైకి తీసుకొచ్చారు. అనంతరం మహా సంకల్పం, ప్రవర, యజ్ఞోపవీతధారణ, మాంగళ్యధారణ, తలంబ్రాల సమర్పణ తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకోవటానికి తరలివచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గెల్లి హరిగోపీనాథ్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. అర్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, దీక్షిత్, సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు సంకా రత్నకుమారి, అరసవల్లి లక్ష్మీకుమారి, కోశాధికారి సుచరిత పాల్గొన్నారు.

వంతెన మరమ్మతులకు ప్రతిపాదనలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):నగరంలోని ఫోర్‌మెన్ బంగ్లా సమీపంలోని ఎర్రకట్ట వద్ద నిజాం గేటు వంతెన మరమ్మతు పనులకు ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఢిల్లీరావు సంబంధిత అధికారులకు సూచించారు. నిజాం గేటు వంతెన మరమ్మతులపై కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు రైల్వే, ఆర్ అండ్‌బీ రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఢిల్లీరావు మాట్లాడుతూ ఫోర్‌మెన్ బంగ్లా సమీపంలో గల నిజాం గేటు వంతెన వద్ద ఎర్రకట్టపై రైల్వే ఓవర్ బ్రిడ్జి పూర్తిగా దెబ్బతిందని, వంతెన పక్కన రింగ్ వాల్స్ కూడా పాడైపోవడంతో ముందస్తు జాగ్రత్తలలో భాగంగా ఆ ప్రాంతంలో ప్రజల రాకపోకలను నిషేధించామని చెప్పారు. వంతెన సమీపంలోని కేఎల్‌రావు నగర్, భావనారాయణ నగర్, అంబేద్కర్ నగర్ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలతో పాటు అంబాపురం, నైనవరం, తదితర గ్రామీణ ప్రాంతాల నుంచి నిత్యం వేలాది మంది ప్రజలు ఎర్రకట్టమీదగా నగరానికి రాకపోకలు సాగిస్తారన్నారు. రాకపోకలు నిషేధించడం వలన ఆయా ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీనిని నివారించేందుకు వంతెన మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. వంతెన పనులకు అవసరమైన ప్రతిపాదనలను రూపొందించి పంపాలని రైల్వే అధికారులకు సూచించారు. సంబంధిత ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. నిధులు మంజూరైన వెంటనే రైల్వే, ఆర్అండ్‌బీ అధికారులు సంయుక్తంగా పనులను పూర్తి చేసి నిజాంగేటు వంతెనపై తిరిగి రాకపోకలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఆర్వో కె. మోహన్ కుమార్, రైల్వే డివిజనల్ మేనేజర్ పీవీఎస్ నాయుడు, మున్సిపల్ కార్పొరేషన్ ఈఈ కె. నారాయణ, ఆర్ అండ్ బి ఈఈ డి. బలరామ్, ఏఈ వంశీ, స్థానిక తహశీల్దార్ వి. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ పాతబస్తీలో టెన్షన్!

ఎమ్మెల్యే రాజాసింగ్ విడుదలను నిరసిస్తూ ర్యాలీలు
- మొఘల్‌పురాలో పోలీసు వాహనానికి నిప్పు
- నిరసనకారులను చెదరగొట్టేందుకు పలుమార్లు లాఠీచార్జి
- ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు, స్థానిక పోలీసుల ఫ్లాగ్‌మార్చ్


బుధవారం రాత్రి శాలిబండలో ఉద్రిక్త పరిస్థితి నెలకొన్న ప్రాంతంలో పోలీసులు

సాక్షి, హైదరాబాద్: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వివాదాస్పద వీడియోతో నెలకొన్న టెన్షన్ కొనసాగుతూనే ఉంది. హైదరాబాద్ పాతబస్తీలోని అనేక ప్రాంతాల్లో మంగళవారం అర్ధరాత్రి, ఆ తర్వాత ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు జరిగాయి. చార్మినార్, మొఘల్‌పురా, షాలిబండ పరిసరాల్లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రాజాసింగ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఆందోళనకారుల దాడుల్లో ఓ పోలీసు వాహనం ధ్వంసమైంది. పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు పలుమార్లు లాఠీచార్జి చేశారు. ఉద్రిక్తతల నేపథ్యంలో ఉన్నతాధికారులు పాతబస్తీలోనే మకాం వేసి పరిస్థితిని పర్యవేక్షించారు. ఇతర విభాగాలకు చెందిన సిబ్బందినీ ఆయా ప్రాంతాల్లో మోహరించారు.

బుధవారం ఉదయం నుంచీ..

బుధవారం ఉదయం నుంచి కూడా పాతబస్తీతోపాటు పశ్చిమ, తూర్పు మండలాల్లోని కొన్ని ప్రాంతాల్లో రాజాసింగ్‌కు వ్యతిరేకంగా నిరసనలు జరిగాయి. నిరసనకారులు పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీలు నిర్వహించారు. దీనితో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్‌ఏఎఫ్)తోపాటు సాయుధ బలగాలను సున్నిత ప్రాంతాల్లో మోహరించారు. ఆయాచోట్ల స్థానిక పోలీసులు, బలగాల సిబ్బంది కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దక్షిణ, తూర్పు, పశ్చిమ మండలాల్లోని 17 సమస్యాత్మక, సున్నిత ప్రాంతాల్లో పోలీసులు ఆంక్షలను అమలు చేస్తున్నారు. పాతబస్తీలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం రాత్రి 7–8 గంటలకే దుకాణాలు, వ్యాపార సంస్థలను మూసేయించారు. ఇక బుధవారం రాత్రంతా షాహినాయత్‌గంజ్, మంగళ్‌హాట్ ప్రాంతాల్లో.. రాజాసింగ్ అనుకూల, వ్యతిరేక వర్గాలు రోడ్లపైకి వచ్చి ర్యాలీలు నిర్వహించేందుకు ప్రయత్నించాయి. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు. ఇక రాజాసింగ్ విడుదలను నిరసిస్తూ బుధవారం పాతబస్తీలోని కొన్ని ప్రాంతాల్లో వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. కాగా, బుధవారం రాత్రి నుంచి పాతబస్తీలో, ఆ ప్రాంతం మీదుగా వెళ్లే ట్రాఫిక్‌ను ఇతర మార్గాల మీదుగా మళ్లించారు. ఎలాంటి ర్యాలీలు, ధర్నాలకు అనుమతి లేదని పోలీసులు ప్రకటించారు. ఇదిలా ఉండగా, విద్వేషపూరిత వీడియోకు సంబంధించి రాజాసింగ్‌పై పోలీసులకు ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. బుధవారం రాత్రి వరకు ఈ కేసుల సంఖ్య 15కు చేరినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

ఏ మతాన్నీ కించపరచలేదు

నాపై కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటా: రాజాసింగ్



తాను చేసిన వీడియోలో ఏ మతాన్నీ కించపర్చలేదని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. అయితే కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ అంశానికి సంబంధించి తాను మాట్లాడలేనని తెలిపారు. తనపై నమోదైన కేసులను న్యాయపరంగా ఎదుర్కొంటానన్నారు. బీజేపీ జాతీయ క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన షోకాజ్ నోటీసుపై వీలైనంత త్వరగా సమాధానం ఇస్తానని చెప్పారు. తాను ఇచ్చే వివరణతో పార్టీ సంతృప్తి చెందుతుందని, బీజేపీ తనను వదులుకోబోదని భావిస్తున్నానని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. కాగా స్వామి పరిపూర్ణానంద బుధవారం రాజాసింగ్ నివాసానికి వెళ్లి కలిశారు. రాజాసింగ్‌ను పరామర్శించి, అరెస్టుకు దారితీసిన పరిణామాలు, అరెస్ట్, అనంతరం విడుదల, కేసుకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.

ఎవరినీ ఉపేక్షించొద్దు!

- శాంతి భద్రతలకు విఘాతం కలగడానికి వీల్లేదు: తెలంగాణ సీఎం కేసీఆర్
- శుక్రవారం ప్రార్థనల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టండి
- సున్నిత ప్రాంతాల్లో బందోబస్తు పెంచాలి.. అవాంఛనీయ ఘటనలు తలెత్తితే కఠినంగా అణిచివేయాలి
- తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలపై ఉన్నతాధికారులతో సమీక్ష



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో శాంతి భద్రతలకు ఎట్టి పరిస్థితుల్లోనూ విఘాతం కలగడానికి వీల్లేదని, చట్టాన్ని చేతిలోకి తీసుకునే వారిని ఎవరినీ ఉపేక్షించొద్దని తెలంగాణ సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. శాంతి భద్రతలను చేతుల్లోకి తీసుకునే వారిపైన, మతాల మధ్య చిచ్చుపెట్టే వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వివాదాస్పద వీడియో, తదనంతర పరిణామాల నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఉన్నతాధికారులతో బుధవారం అత్యవసర సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. దాదాపు నాలుగు గంటల పాటు పలు అంశాలపై చర్చించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కొందరు మతాల మధ్య చిచ్చుపెట్టడానికి, విద్వేషాలను రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నారని కేసీఆర్ మండిపడ్డారు. కొన్ని సంఘ వ్యతిరేక శక్తులు రెచ్చిపోయే అవకాశం ఉంటుందని, ఆదిలోనే దీనిని తుంచివేయాలని ఉన్నతాధికారులకు సీఎం స్పష్టం చేశారు. అవాంఛనీయ ఘటనలను కఠినంగా అణిచివేయాలని చెప్పారు. శుక్రవారం ప్రార్థనల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే మరిన్ని బలగాలను రప్పించాలని సూచించారు. ఏ చిన్న అవాంఛనీయ ఘటన జరిగినా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీ దెబ్బతింటుందని హెచ్చరించారు. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా సున్నిత ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు.

'జగనన్న విదేశీ విద్యా దీవెన' కాపులకు ఓ వరం

- మూడేళ్లలో కాపుల కోసం రూ.32 వేల కోట్లు ఖర్చు చేశాం
- కాపు కార్పొరేషన్ చైర్మన్ శేషగిరి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు విదేశాలలో ఉన్నత చదువులు చదువుకునేందుకు 'జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం' ఒక వరమని రాష్ట్ర కాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి చెప్పారు. ఆయన బుధవారం మంగళగిరి కాపు కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాపు సామాజికవర్గంలో వెనుకబడిన కుటుంబాల విద్యార్థుల కలలను సాకారం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు. రూ. 8 లక్షల లోపు వార్షికాదాయం ఉండి, విదేశీ విద్యార్హత పరీక్షలో స్కోరు సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ పథకం ద్వారా విదేశాలలో పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ చదవొచ్చని తెలిపారు. ప్రపంచంలో 1 నుంచి 100 ర్యాంకుల్లోని యూనివర్సిటీలకు ఎంపికైన విద్యార్థులకు 100 శాతం ట్యూషన్ ఫీజు ప్రభుత్వమే చెల్లిస్తుందని, 200 వరకు ర్యాంకుల్లో ఉన్న వర్సిటీలకు ఎంపికైన వారికి రూ.50 లక్షలు, లేదా ట్యూషన్ ఫీజులో 50 శాతం చెల్లిస్తుందని వివరించారు. ఈ పథకం కుటుంబంలో ఒక్కరికి మాత్రమే వర్తిస్తుందన్నారు. అర్హత గలవారు సెప్టెంబర్ 30వ తేదీలోపు http://jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలు, సందేహాల నివృత్తికి 63054 48393, 63051 59559 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. రాష్ట్రంలో గత మూడేళ్లలో కాపుల సంక్షేమానికి వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా రూ.32 వేల కోట్లు, కాపు నేస్తం కింద మహిళలకు రూ.1,500 కోట్లు అందించామని తెలిపారు. కాపు కార్పొరేషన్ ద్వారా త్వరలో రుణాలు ఇస్తామన్నారు. విజయవాడ సింగ్‌నగర్‌లో కాపు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసిందని చెప్పారు.

మీ వెంటే మేమంతా


వైఎస్సార్ జిల్లా చాపాడు మండలం వెదురూరు గ్రామంలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి


అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం లబ్బూరులో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్గుణ


ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం ఆంజనేయపురంలో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటి వద్ద ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. ప్రజా సంక్షేమానికై అహర్నిశలూ శ్రమిస్తున్న జగనన్న వెంటే తామంతా నడుస్తామని నాయకులతో ప్రజలు చెబుతున్నారు. అన్ని జిల్లాల్లో బుధవారం ఈ కార్యక్రమం వేడుకగా సాగింది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలు తమ దృష్టికి వస్తే అక్కడికక్కడే పరిష్కరించారు. మేనిఫెస్టోలో అన్ని హామీలను నెరవేరుస్తున్నామని ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు.

భయం భయంగా టీడీపీ

- ప్రశ్నార్థకంగా చంద్రబాబు, లోకేశ్ జీవితాలు
- వైఎస్సార్‌సీపీకి పెరుగుతున్న జనాదరణ
- తాజా సర్వేలన్నీ సీఎం జగన్ వైపు మొగ్గు
- జూ.ఎన్టీఆర్ బీజేపీకి మద్దతుదారుగా మారతాడనే భయంలో టీడీపీ ఉంది
- వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: ఒక రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం ఏదైనా అసెంబ్లీ ఎన్నికలకు ఏడాదిన్నర ముందు ఉత్సాహంతో ముందుకు సాగుతుందని, దానికి భిన్నంగా రాష్ట్రంలో టీడీపీ భయం భయంగా గడుపుతోందని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ వేణుంబాక విజయసాయిరెడ్డి అన్నారు. చంద్రబాబు, లోకేశ్ చలి జ్వరం వచ్చిన పిల్లల్లా వణికిపోతున్నారని, వారి జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయని ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుప్పంలో ఓడిపోవడం ఖాయమనే స్థితికి చంద్రబాబు వచ్చారన్నారు. మంగళగిరిలో స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ ఎం.హనుమంతరావు సూర్యోదయం నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రజలతోనే ఉంటూ లోకేశ్‌కు సూది మోపేంత అవకాశం కూడా ఇవ్వడంలేదని చెప్పారు. టీడీపీ రథసారథులకే ప్రజాదరణ లేదని, పార్టీ లేదు బొక్కా లేదన్న అచ్చెన్నాయుడి మాట ప్రజల్లోకి, కార్యకర్తల్లోకి బాగా వెళ్లిందన్నారు. పాలక పక్షమైన వైఎస్సార్‌సీపీకి రోజురోజుకు అనూహ్యంగా జనాదరణ పెరుగుతోందని, తాజాగా అనేక సర్వేలు ప్రజలు సీఎం జగన్‌వైపే మొగ్గు చూపుతున్నట్లు స్పష్టంగా చెబుతున్నాయని తెలిపారు. దీంతో చంద్రబాబు, టీడీపీ నేతలు గందరగోళంలో పడిపోయారన్నారు. ఎన్నికలు తరుముకొస్తున్న తరుణంలో మిత్రపక్షం ఏదీ లేక దిక్కులు చూడటం చంద్రబాబు, లోకేశ్‌ల ఫుల్ టైం వ్యాపకంగా మారిందన్నారు. హైదరాబాద్ వచ్చిన కేంద్ర హోంమంత్రి పర్యటన టీడీపీలో, ఆ పార్టీ అగ్రనేతల్లో మరింత అయోమయాన్ని నింపిందన్నారు. ఈ బీజేపీ మంత్రి ఓ మీడియా గ్రూపు అధిపతి ఇంటికి వెళితే అది వారికి అనుకూల పరిణామమని పచ్చ చొక్కాల పార్టీ నేతలు, కార్యకర్తలు అనుకున్నారని తెలిపారు. కేంద్రంలోని పాలకపక్షం అండ దొరుకుతుందని ఆశపడ్డారని చెప్పారు. జూనియర్ ఎన్టీఆర్‌కు కేంద్ర మంత్రిని కలవడానికి ఆహ్వానం అందితే ఇదే పసుపచ్చ శిబిరం కంగారు పడిపోయిందని తెలిపారు. ఎక్కడ ఈ యువ హీరో బీజేపీకి మద్దతుదారుగా మారిపోతాడోననే భయం టీడీపీని చుట్టుముట్టిందని చెప్పారు.

అన్ని రాష్ట్రాల చూపు ఏపీ వైపే

వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షురాలు మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర ప్రగతికి దిక్సూచి అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బలంగా నమ్మి విద్యారంగంపై వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత వెల్లడించారు. అంకిరెడ్డిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మున్నంగి సంజీవరెడ్డి దాతృత్వంతో నిర్మించతలపెట్టిన పాఠశాల ముఖ ద్వారం(ఆర్చి) పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకతోటి సుచరిత మాట్లాడుతూ, అన్ని రాష్ట్రాలు ఏపీ వైపు చూసే రీతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు.

అక్షరాశ్యతలోనూ అగ్రగామిగా..
: ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ అంటే అక్షర క్రమంలోనే కాదు అక్షరాశ్యతా శాతంలోనూ అన్ని రాష్ట్రలను అధిగమించి దేశంలోనే అగ్రగామిగా నిలవాలన్నదే ముఖ్యమంత్రి జగన్ ఆలోచన, ఆశయం కూడా అని పేర్కొన్నారు. అందుకే కేవలం మన పిల్లల్ని బడికి పంపితే చాలు ఫీజుతో సహా వారు చదువుకునేందుకు అవసరమైనవన్నీ తానే సమకూర్చుతున్నట్లు తెలిపారు. అంతే కాకుండా వారికి పౌష్టికాహారం కూడా అందిస్తున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి, హెచ్‌ఎం చెరుకూరి జాన్ మణికుమార్, కె.సాంబిరెడ్డి, శ్యామల బ్రహ్మారెడ్డి, మున్నంగి సంజీవరెడ్డి, దేవగిరి సీతారామిరెడ్డి, కె.వీరారెడ్డి, మెట్టు చిన వెంకటప్పారెడ్డి, మెట్టు వెంకటప్పారెడ్డి పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ కలలు మాత్రమే కంటారు..

గుంటూరు రూరల్: జనసేన అధినేత పవన్ కల్యాణ్ అధికారం కోసం కలలు మాత్రమే కంటారని, అయితే అవి నెరవేరడం కష్టమని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ఎద్దేవా చేశారు. గుంటూరు జిల్లా అంకిరెడ్డి పాలెంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మాట్లాడటం అందరి హక్కని, అందుకే పవన్ ఏది పడితే అది మాట్లాడుతున్నారని అన్నారు. అయితే ఏది పడితే అది మాట్లాడితే బాగోదన్నారు. అధికారంలో వస్తే గుర్తు పెట్టుకుంటాను.. ప్రతీకారం తీర్చుకుంటాను అంటూ లోకేష్ అసందర్భ ప్రేలాపనలు పేలుతున్నారని, ప్రతీకారాలు తీర్చుకోవడానికి రాజకీయాలు చేస్తున్నావా అంటూ సూటిగా ప్రశ్నించారు. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ఎలా విమర్శించాలా అని ఆలోచిస్తుంటే.. తాము మాత్రం సంక్షేమం, అభివృద్ధి పథకాలపై దృష్టిపెట్టి, పేదవారి బాగోగుల గురించి ఆలోచిస్తున్నామని పేర్కొన్నారు.


నాడు-నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

బధిరుల విజయ గీతిక


మడోనా కాలేజీలో బధిర విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయిని


పతకాలు సాధించిన బధిర విద్యార్థులతో ప్రిన్సిపాల్ మెర్సీ

తమకు మాటలు రావని.. చెవులు వినిపించవని వారు దిగులు చెందలేదు.. తమ భావాలను, ఆలోచనలను తోటివారితో పంచుకోలేకపోతున్నామని కుంగిపోలేదు. చదువుల్లో, క్రీడల్లో సత్తా చాటుతూ ప్రభుత్వ కొలువులు సాధిస్తూ విజయ గీతిక వినిపిస్తున్నారు. నలుగురికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

- చదువుల్లో రాణిస్తున్న దివ్యాంగులు
- క్రీడల్లోనూ సత్తాచాటుతున్న ధీరులు
- బధిరుల సేవలో మడోన్న బధిర విద్యా సంస్థలు

గుణదల (విజయవాడ తూర్పు): మేనరికపు వివాహాలు, గర్భిణులు అనారోగ్యానికి గురైన సమయంలో జన్మించే పిల్లలకు శారీరక వైకల్యం ఏర్పడుతుంది. కొంత మంది అవయవ లోపాలతో, మరి కొందరు అంధులుగా, ఇంకొందరు బధిరులుగా జన్మిస్తారు. చెవి నుంచి మెదడు వరకు ఉండే నరాలు దెబ్బతినడంతో వినికిడి శక్తి పూర్తిగా కోల్పోవడం, వోకల్ కార్డ్స్ స్పందించక పోవడంతో మూగతనం ఏర్పడుతుంది. ఫలితంగా బధిరులుగా జీవించాల్సి వస్తుంది. బధిరులు తమ వైకల్యానికి చింతించకుండా చదువు సంధ్యలు, ఆటపాటల్లో రాణిస్తూ ప్రభుత్వ కొలువులు సాధించి ఉన్నత స్థానాలకు చేరుతున్నారు. వారికి అండగా నిలిచి వారికి విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు పలు సేవా సంస్థలు కూడా కృషిచేస్తున్నాయి. విజయవాడ గుణదలలో ఉన్న మడోన్న బధిర విద్యా సంస్థలు మూడున్నర దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నాయి. వందలాది మంది బధిరులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్నాయి.

చదువుల్లో మేటి..

మడోన్న బధిర విద్యా సంస్థలు పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యాబోధన సాగిస్తున్నాయి. సాధారణ విద్యార్థుల మాదిరిగానే బధిరులకూ పాఠ్యాంశాలు ఉంటాయి. బధిరులకు అర్థమయ్యేలా సంజ్ఞల ద్వారా ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తారు. బధిరులు సైతం సాధారణ విద్యార్థులకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నారు. 2021–22 విద్యాసంవత్సరానికి సంబంధించి డిగ్రీ ద్వితీయ సంవత్సరంలో ఎ.మైథిలి 97 శాతం, నవీన్‌కుమార్ 95 శాతం, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సోనియా ఎలిజబెత్ 96.5 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. మిగిలిన విద్యార్థులు సైతం మెరుగైన మార్కులు సాధించారు.


వాలీబాల్ ఆడుతున్న బధిర విద్యార్థులు

క్రీడల్లో ఘనులు

కేవలం చదువులకు మాత్రమే పరిమితం కాకుండా ఆటపాటల్లో సైతం బధిర విద్యార్థులు ప్రతిభచాటుతున్నారు. వాలీబాల్, చెస్, క్యారమ్స్, క్రికెట్ టోర్నీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు. ఆయా క్రీడాంశాల్లో జిల్లాస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు పతకాలు సాధిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఎం.మానస రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించింది. పరుగు పందెంలో సాయిసంతోష్, మోషే జాతీయ స్థాయి సత్తాచాటి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఎన్‌ఎస్ఎస్ సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొని మొక్కలు నాటడం, పరిసరాలను శుభ్రం చేయడం వంటి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. విద్యా సంస్థల్లో జరిగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో తమ ప్రత్యేకతను చాటుతున్నారు. గ్రూప్ డ్యాన్స్, మైమ్, స్కిట్‌లు ప్రదర్శిస్తూ అలరిస్తున్నారు.

సులువుగా ఉద్యోగాలు

ఎంతో మంది బధిర విద్యార్థులు చదువులు పూర్తి చేసిన అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడ్డారు. మడోన్న కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన ఎం.రెడ్డి గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆడిటర్‌గా ఉద్యోగం సాధించారు. ఇదే విద్యా సంస్థకు చెందిన షేక్ మౌలాలి ఆదయపు పన్ను శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా, ఎస్.నాగరాజు ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు సాధించారు. ఇలా ఎంతో మంది బధిరులు ఉద్యోగాలు సాధిస్తూ తోటివారికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. తలిదండ్రుల నైతిక ప్రోత్సాహం, ప్రభుత్వం సహకారం ఉంటే బధిరులు మరిన్ని విజయాలు సొంతం చేసుకుంటారని మడోన్న విద్యా సంస్థ నిర్వాహకులు అంటున్నారు.

ప్రెసిడెంట్స్ ఎలెవన్ జట్టుపై ట్రెజరర్స్ ఎలెవన్ విజయం

మంగళగిరి: ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఏసీఏ సీనియర్ ఉమెన్ ట్వంటీ ట్వంటీ క్రికెట్ పోటీల్లో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ప్రెసిడెంట్స్ ఎలెవన్ జట్టుపై ట్రెజరర్స్ ఎలెవన్ జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన ప్రెసిడెంట్స్ ఎలెవన్ జట్టు 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 113 పరుగులు చేసింది. జట్టు బ్యాటర్ ఎం.దుర్గ 44 బంతుల్లో 44 పరుగులు, ఎస్.హిమబిందు 28 బంతుల్లో 31 పరుగులు చేసింది. ట్రెజరర్స్ ఎలెవన్ బౌలర్ బి.అనూష రెండు వికెట్లు తీసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ట్రెజరర్స్ ఎలెవన్ జట్టు 19.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 114 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టు బ్యాటర్ సీహెచ్ ఝాన్సీలక్ష్మి 33 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 54 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. ప్రెసిడెంట్స్ ఎలెవన్ జట్టు బౌలర్ కె.జ్యోతి 2 వికెట్లు సాధించింది.


అర్ధసెంచరీ సాధించిన ట్రెజరర్స్ ఎలెవన్ బ్యాటర్ ఝాన్సీలక్ష్మి


44 పరుగులు సాధించిన ప్రెసిడెంట్స్ ఎలెవన్ జట్టు బ్యాటర్ దుర్గ

అరుదైన జీబీ సిండ్రోమ్ సోకిన బాలుడికి చికిత్స

వ్యాధి నుంచి కోలుకోవడంతో బుధవారం డిశ్చార్జి చేసిన జీజీహెచ్ వైద్యులు

గుంటూరు మెడికల్: అత్యంత అరుదుగా వచ్చే గులియన్ బెర్రి సిండ్రోమ్ వ్యాధికి గుంటూరు జీజీహెచ్ వైద్యులు చికిత్స చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలుడికి నూతన జీవితాన్ని ప్రసాదించారు. వివరాల్లోకి వెళితే ఉమ్మడి గుంటూరు జిల్లా కారంపూడి మండలం గాదెవారిపల్లెకు చెందిన మల్ల రమేష్, పార్వతి దంపతుల 13 ఏళ్ల కుమారుడు పూర్ణచంద్ జూన్‌లో జీబీ సిండ్రోమ్ వ్యాధి బారిన పడ్డాడు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలోని అమ్మమ్మ ఇంటికి బాలుడు వెళ్లిన సమయంలో వ్యాధి బారిన పడటంతో తొలుత అక్కడే చికిత్స చేయించారు. అక్కడ వ్యాధి తగ్గకపోవడంతో నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. వారం రోజులపాటు రూ.7 లక్షలు ఖర్చు చేసినప్పటికీ బాలుడి ఆరోగ్య పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేకపోవడం, వ్యాధి తీవ్రత పెరిగిపోవడంతో జూన్ 14న చికిత్స కోసం జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. జీజీహెచ్ న్యూరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గొట్టిపాటి బిందునర్మద ఆధ్వర్యంలో వైద్యులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి, జీబీ సిండ్రోమ్‌గా నిర్ధారించుకుని చికిత్స ప్రారంభించారు. సుమారు రెండు నెలలకు పైగా ఐసీయూలో అపస్మారక స్థితిలో ఉన్న బాలుడికి న్యూరాలజీ వైద్యులు మెరుగైన చికిత్స అందించి ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించారు. వ్యాధి నుంచి కోలుకోవడంతో బుధవారం ఆస్పత్రి నుంచి బాలుడిని డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బిందునర్మద మీడియాతో మాట్లాడుతూ జీబీ సిండ్రోమ్ వ్యాధి సోకినప్పుడు అకస్మాత్తుగా కాళ్లలో, చేతుల్లో తిమ్మిర్లు ప్రారంభమై కాళ్లు, చేతులు పటుత్వాన్ని కోల్పోతాయన్నారు. పూర్ణచంద్ అనే బాలుడికి ఐసీయూలో రెండు నెలల పాటు చికిత్స అందిస్తున్న సమయంలో మూడు సార్లు కార్డియాక్ అరెస్ట్ (గుండె ఆగింది) అయిందని, అయినప్పటికీ న్యూరాలజీ వైద్యులంతా టీమ్‌గా బాలుడిని ప్రాణాపాయ స్థితి నుంచి బయటకు తీసుకొచ్చామన్నారు. ఎటువంటి ఖర్చు లేకుండా పూర్తి ఉచితంగా చికిత్స అందించి బాలుడి ప్రాణాలు కాపాడిన న్యూరాలజీ వైద్యులకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో న్యూరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ పాలపర్తి క్రీస్తుదాసు, డాక్టర్ అరుణ కుమారి, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ మైత్రి, పీజీ వైద్యులు నవీన్, యమున, అమర్, గీతా, కాంతిమా, ముబషీర్ అజ్మా, కార్తీక్ పాల్గొన్నారు.


వ్యాధి నుంచి కోలుకున్న బాలుడితో న్యూరాలజీ వైద్యులు



తన టీమ్‌తో మానసి చౌదరి



మానసి చౌదరి

హక్కులకు మానసిక బలం 'పింక్ లీగల్'

దేశం ఎంత అప్‌డేట్ అవుతున్నప్పటికీ.. ఆడవాళ్లపై భౌతిక దాడులు, అత్యాచారాలు, అవమానాలు మాత్రం ఆగడం లేదు. వంటింట్లో మొదలు ఆఫీస్, స్కూల్, కాలేజీ, రోడ్డు మీద... ఇలా ప్రతిరోజూ మహిళ అవమానాలను ఎదుర్కొంటూనే ఉంది. మహిళలకు ఉన్న చట్టాలు ఏంటి... ఆ చట్టాలు ఎలా పనిచేస్తున్నాయి, ఎవరైనా ఏదైనా ఇబ్బందిలో ఉంటే ఆ ఇబ్బందికి పరిష్కార మార్గం ఏ సెక్షన్ ద్వారా దొరుకుతుంది, పోలీసు స్టేషన్‌లో, కోర్టులో, ఆఫీస్‌లో, బయట అవమానాలు ఎదుర్కొన్న మహిళ ఏయే సెక్షన్‌ల గురించి తెలుసుకోవడం అవసరం... వంటి వివరాలతో 'పింక్ లీగల్' అనే వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చారు హైదరాబాద్‌కు చెందిన మానసి చౌదరి.

ఢిల్లీలోని జిందల్ గ్లోబల్ లా స్కూల్లో మానసి న్యాయ శాస్త్రంలో పట్టా పొంది, రాష్ట్రహైకోర్టులో రెండేళ్లపాటు ప్రాక్టీస్ చేశారు. సుప్రీంకోర్టు జస్టిస్ డీవై చంద్రచూడ్ వద్ద అసిస్టెంట్‌గా చేశారు. ఆ సమయంలోనే సెక్షన్ 377పై తీర్పు, శబరిమల ఆలయంలోకి అన్ని వయసుల స్త్రీలు ప్రవేశించ వచ్చనే తీర్పు రావడం జరిగింది. సుదీర్ఘ అనుభవం కలిగిన మానసి తనకు వ్యక్తిగతంగా ఎదురైన ఓ పరిణామాన్ని జీర్ణించుకోలేక ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ)లో మహిళల హక్కులు తెలిపే సెక్షన్‌లు ఎన్ని ఉన్నాయి, ఏయే సెక్షన్ల కింద ఏయే హక్కులు మహిళలకు ఉన్నాయనే సమాచారాన్ని సంక్షిప్తంగా అందించేందుకు చేసిన కృషి నేడు ఎందరో స్త్రీలకు ఆసరాగా నిలుస్తోంది.

ఫలించిన మూడేళ్ల పోరాటం

ఐదేళ్ల క్రితం ఓ రోజు రాత్రి ఆఫీసు పని ముగించుకుని ఇంటికి వెళుతున్న సమయంలో నలుగురు యువకులు తప్పు తమదే అయినా మానసిపై భౌతిక దాడి చేసేందుకు సిద్ధపడ్డారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన మానసి తన వద్ద ఉన్న సాక్ష్యాలను పోలీసులకు ఇచ్చి ఆ యువకులకు శిక్షపడేలా చేశారు. న్యాయవాదిని కాబట్టి నాకు రూల్స్ తెలుసు.'హక్కులు తెలియని మహిళల పరిస్థితి ఏంటి?' అని ఆలోచించిన మానసి ఆ రోజు నుంచి మూడేళ్లపాటు మహిళలకు న్యాయ సమాచారాన్ని అందించేందుకు కసరత్తు చేసింది. ఓ పక్క ఉద్యోగం చేస్తూ.. ఇంకోపక్క సీనియర్ న్యాయవాది వద్ద ప్రాక్టీస్ చేస్తూనే రాత్రివేళల్లో వెబ్‌సైట్ పనుల్లో నిమగ్నమయ్యేవారు. హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో ఉన్న లా బుక్స్ తిరగేశారు. రాజ్యాంగంలో మహిళలకు ఉన్న హక్కుల గురించి తెలుసుకున్నారు. 2018లో తొలుత 'లైంగిక వేధింపులు, మహిళల ఆస్తి హక్కులు' అనే అంశాలపై పైలట్ ప్రాజెక్ట్‌గా వెబ్‌సైట్ ద్వారా సమాచారాన్ని అందించారు. దీనికి మంచి ఆదరణ, స్పందన వచ్చినప్పటికీ, మహిళకు దక్కాల్సిన న్యాయం, హక్కుల గురించి మరింత లోతుగా తెలుసుకోవాలనే సంకల్పంతో మరో అడుగు ముందుకేశారు. ఇందుకోసం సుప్రీం, హైకోర్టులకు చెందిన సీనియర్ క్రిమినల్ లాయర్లను సంప్రదించారు, సుమారు పదిమంది లా విద్యార్థుల సాయం తీసుకున్నారు. మూడేళ్లపాటు రాత్రింబవళ్లు కష్టపడి చివరికి మహిళలకు ధైర్యం చేకూర్చేలా, వారి హక్కులు తెలుసుకునేలా 'లైంగిక వేధింపులు, గృహహింస, వివాహం, విడాకులు, ఆస్తిహక్కులు, బాలల హక్కులు, సైబర్ బెదిరింపులు..' వంటి వాటిపై అవగాహన కలిగించేలా ఓ వెబ్‌సైట్‌ను రూపొందించారు.

> **పింక్ లీగల్ కాన్సెప్ట్ నచ్చి మానసితో కలసి మహిళలకు అండగా నిలిచేందుకు, న్యాయ సలహాలు అందించేందుకు లా విద్యార్థులు జత కలిశారు. దేశవ్యాప్తంగా పలు యూనివర్సిటీల్లో చదువుతున్న సుమారు 30 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మహిళల హక్కులు, న్యాయ సలహాలను గుర్తుచేస్తున్నారు.**

లక్షమంది ముందడుగు

2020 మార్చి 8న వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకు రావడంతోపాటు దానికి సోషల్ మీడియా వేదికగా ప్రచారాన్ని నిర్వహించారు. 'పింక్ లీగల్' కాన్సెప్ట్ నచ్చి ఆమెతో కలసి మహిళలకు అండగా నిలిచేందుకు, న్యాయసలహాలు అందించేందుకు లా స్టూడెంట్స్ కొందరు జత కలిశారు. దేశవ్యాప్తంగా పలు యూనివర్సిటీల్లో చదువుతున్న సుమారు 30 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మహిళల హక్కులు, న్యాయ సలహాలను గుర్తుచేస్తున్నారు. దీనిలోనే 'ఫ్రీ హెల్ప్ లైన్' ను ప్రారంభించారు. బాధితులు ఎవరైనా అప్లికేషన్‌ను పూర్తి చేసి దానిలో ఫోన్ నంబర్ రాసి, సబ్‌మిట్ చేస్తే వాలంటీర్ సదరు మహిళకు ఫోన్ చేసి న్యాయ సలహా అందిస్తారు. అంతేకాదు, ఆ సమస్య పరిష్కారం అయ్యే వరకు వెన్నంటి ఉంటారు. సాంకేతికంగా ఎటువంటి పరిజ్ఞానం లేని వారిని దృష్టిలో పెట్టుకున్న మానసి గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలతో ఒప్పందమయ్యారు. ఆయాప్రాంతాల్లో మహిళలకు ఏదైనా ఇబ్బంది కలిగితే 'పింక్‌లీగల్' గురించి చెప్పి, వారికి ఏయే సెక్షన్‌లు ఎలా ఉపయోగపడతాయనే దానిపై అవగాహన కల్పిస్తున్నారు. ఏదైనా అంశంపై వికీపీడియా ఎలా అయితే పూర్తి సమాచారాన్ని అందిస్తుందో.. మహిళలకు చట్టాలు, హక్కులపై 'పింక్ లీగల్' అలా ఒక ఎన్‌సైక్లోపిడియాలా పని చేస్తుందంటున్నారు మానసి.

– చైతన్య వంపుగాని

ఉమెన్-ఫ్రెండ్లీ




శిక్షణ కఠినంగా ఉండాలి. అదే సమయంలో అవసరాలు, సౌకర్యాల విషయంలో కరుణతో వ్యవహరించాలి. కళింగ గడ్డ మీద ఉన్న సువిశాల 'ఐఎన్‌ఎస్ చిలికా' శిక్షణా కేంద్రం ఫస్ట్ బ్యాచ్ అగ్నివీర్ ఉమెన్ ట్రైనీలను దృష్టిలో పెట్టుకొని 'ఉమెన్-ఫ్రెండ్లీ' విధానానికి శ్రీకారం చుట్టింది...

ధీర... అగ్నివీర

అగ్నివీర్ చుట్టూ రగిలిన వివాదాల మాట ఎలా ఉన్నా సైన్యంలోని వివిధ విభాగాల్లో పని చేయాలనే ఆసక్తి, ఉత్సాహాన్ని ఆ వివాదాలు అంతగా ప్రభావితం చేయలేకపోయాయి. నేవీలో 3,000 ఉద్యోగాల కోసం లక్షలాది మంది పోటీలోకి దిగారు. వీరిలో 82,000 మంది మహిళలు ఉన్నారు.

భువనేశ్వర్‌కు సమీపంలోని ప్రసిద్ధ 'ఐఎన్‌ఎస్ చిలికా' శిక్షణా కేంద్రంలోకి నేవి అగ్నివీర్ ఫస్ట్ ఉమెన్ బ్యాచ్‌కు చెందిన 600 మంది మహిళలు అడుగుపెట్టబోతున్నారు.

దాంతో మహిళా శిక్షణార్థుల అవసరాలు, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది ఐఎన్‌ఎస్.



భువనేశ్వర్ సమీపంలోని 'ఐఎన్‌ఎస్ చిలికా' శిక్షణా కేంద్రం

సువిశాలమైన ఐఎన్‌ఎస్ శిక్షణాకేంద్రంలో మహిళల కోసం ప్రత్యేకమైన గదులు, డైనింగ్ ఏరియాను ఏర్పాటు చేస్తారు. అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని మరిన్ని టాయిలెట్‌లను నిర్మిస్తున్నారు. శానిటరీ పాడ్ వెండింగ్, డిస్పోజల్ యంత్రాలను, సెక్యూరిటీ కెమెరాలను ఏర్పాటు చేయబోతున్నారు. వర్కర్స్, స్విమ్మింగ్ ఇన్‌స్ట్రక్టర్స్‌గా మహిళలనే నియమిస్తారు.

ఉమెన్ ఆఫీసర్స్ ట్రైనీలకు సంబంధించి శిక్షణపరమైన పర్యవేక్షణ బాధ్యతలతో పాటు వారి వ్యక్తిగత ఇబ్బందులు, అసౌకర్యాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరిస్తారు.

'ప్రైవసీతో సహా మహిళా శిక్షణార్థులకు సంబంధించి రకరకాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వారికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నాం. సమస్యలు, సౌకర్యాలపై వారి అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తగిన మార్పులు చేయనున్నాం' అంటున్నారు నేవీ ఉన్నతాధికారి ఎం.ఏ.హంపిహోలి.

స్త్రీ, పురుషులకు సంబంధించి ట్రైనింగ్ కరికులమ్‌లో తేడా అనేది లేకపోయినా తప్పనిసరి అనిపించే ఫిజికల్ స్టాండర్డ్స్‌లో తేడాలు ఉంటాయి.

అగ్నిపథ్ తొలిదశలో పర్సనల్ బిలో ఆఫీసర్ ర్యాంక్ (పిబివోఆర్) క్యాడర్‌లో మహిళలను రిక్రూట్ చేస్తున్న తొలి విభాగం నేవి.

'సెయిలర్స్'గా మహిళలకు తొలిసారిగా అవకాశం కల్పించడం ఒక చారిత్రక అడుగు.

'భవిష్యత్ అవసరాలు, స్త్రీ సాధికారతను దృష్టిలో పెట్టుకొని నావికాదళం ప్రగతిశీలమైన అడుగులు వేస్తుంది' అంటుంది కమాండర్ గౌరీ మిశ్రా.

కొన్ని నెలలు వెనక్కి వెళితే...

నేవీకి చెందిన ఆల్-ఉమెన్ టీమ్ 'నావిక సాగర్ పరిక్రమ' పేరుతో ప్రపంచ నౌకాయాత్ర చేసి చరిత్ర సృష్టించింది.

'ఇది మా వ్యక్తిగత సంతోషానికి, సాహసానికి సంబంధించిన విషయం మాత్రమే కాదు... ఎంతో మంది మహిళలకు స్ఫూర్తిని ఇచ్చి సాహసంతో ముందుకు నడిపే చారిత్రక విజయం' అన్నారు 'నావిక సాగర్ పరిక్రమ'లో భాగం అయిన అయిదు మంది మహిళా అధికారులు.

కొన్ని రోజులు వెనక్కి వెళితే...

ఉత్తర అరేబియా సముద్రంలో సర్వైవలెన్స్ మిషన్‌లో భాగం అయిన 'ఆల్-ఉమెన్ క్రూ' మరో సంచలనం.

తాజా విషయానికి వస్తే...

భవిష్యత్ పనితీరుకు శిక్షణ సమయం పునాదిలాంటిది. అది గట్టిగా ఉండాలంటే సౌకర్యాలు, అవసరాల విషయంలో తగిన శ్రద్ధ చూపాలి. ఇప్పుడు మహిళా ట్రైనీల విషయంలో 'ఐఎన్‌ఎస్ చిలికా' చేస్తున్నది అదే.

బ్యూటిప్



ముడతలకు బెల్లం వాష్

బెల్లంతో తయారు చేసిన ఫేస్ వాష్ యాంటీ ఏజింగ్‌గా పని చేసి ముడతలను తగ్గిస్తుంది.

- చిన్న బెల్లం ముక్క తీసుకుని ఒక గిన్నెలో వేసి, టీస్పూను నీళ్లుపోసి మరిగించాలి. బెల్లం కరిగిన తరువాత టీస్పూను శనగపిండి, టీస్పూను పెరుగు వేసి చక్కగా కలుపుకోవాలి.
- ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి ఏడు నిమిషాలపాటు గుండ్రంగా మర్దన చేయాలి. ఆరిన తర్వాత చల్లటి నీటితో కడిగేయాలి. ముఖాన్ని పొడిగా తుడుచుకుని మాయిశ్చరైజర్ లేదా అలోవెరా జెల్ రాసుకోవాలి.



- ఈ ఫేస్‌వాష్‌ను వాడడం వల్ల ముఖం కాంతిమంతంగా కనిపిస్తుంది. వారానికి రెండుసార్లు క్రమం తప్పకుండా వాడడం వల్ల ముఖం మీద ముడతలు తగ్గి ముఖం పడతాయి.

ఇంటిప్స్

- దోమలు రాకుండా పెట్టుకునే మెష్‌డోర్‌లు దుమ్ము పడుతుంటాయి. ఈ డోర్‌లకు ఒకవైపు ఏదైనా క్లాత్‌ను కప్పాలి. రెండోవైపు పెయింట్ బ్రష్‌తో క్లీన్ చేయాలి. శుభ్రం చేసినప్పుడు మెష్ డోర్ దుమ్ము అంతా వెనుకవైపు కప్పిన గుడ్డకు అతుక్కుంటుంది. ఇలా క్లీన్ చేయడం వల్ల దుమ్ము వదలడంతో పాటూ, ఆ దుమ్ము వల్ల మనకు తుమ్ములు కూడా రావు.



- పిన్స్ పెట్టకుండా చీరలు కట్టడం కుదరదు. అయితే పిన్‌లు వాడినప్పటికీ అవి కనిపించకుండా ఉంటే మరింత అందంగా కనిపిస్తుంది. ఈమధ్యకాలంలో రంగు రంగుల పిన్నులు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఆ రంగుల పిన్నులు లేనప్పుడు... ఏ చీర కట్టుకుంటున్నామో ఆ రంగు నెయిల్ పాలిష్‌ను పిన్స్‌కు వేసి ఆరిన తరువాత చీరకు పెట్టుకుంటే పిన్స్ పెట్టినట్లు అస్సలు తెలియదు.



- వెల్లుల్లిని నిల్వ చేసే బుట్టలో ఎండుమిర్చి, బంగాళ దుంపలను వేసి ఉంచి ఎక్కువ రోజులపాటు పాడవకుండా ఉంటాయి.



సైబర్ టాక్

మహిళలే లక్ష్యం

నేటి ప్రపంచంలో ఇంటర్నెట్ రోజువారీ అవసరం. తెలిసినా, తెలియకపోయినా ప్రజలు ఏ వ్యక్తితోనైనా క్షణాల్లో మాట్లాడే సౌలభ్యం వచ్చేసింది. దీంతో వేధింపులకు సంబంధించి ఆడ-మగ తేడా లేకుండా ఆన్‌లైన్ దుర్వినియోగం చేయడమూ పెరిగింది. అయితే, వీటిలో మహిళలు అనుభవించే హింస మాత్రం తరచూ లైంగిక లేదా స్త్రీ వ్యతిరేకపరమైన వేధింపులు ఉంటున్నాయి.

మహిళలను వేధించే సమస్యల్లో గృహహింస, యాసిడ్ దాడి, ఈవ్ టీజింగ్, వరకట్నం, లైంగిక దాడులు, హ్యూమన్ ట్రాఫికింగ్, భ్రూణహత్యలు.. ఇలా ఇప్పటికే ఎన్నో ఉన్నాయి. వీటికితోడు కోవిడ్–19 మహమ్మారి సామాజిక, ఆర్థిక ఒత్తిడిని బలపరిచింది. ఈ రకమైన హింస విస్తృతమైన లింగ ఆధారిత వివక్షకు దారి తీస్తోంది. దీంతో ఈ హింస ఉధృతితో మహిళలపై సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. వీటిలో తరచూ వినిపించేవి సైబర్ స్టాకింగ్, మార్ఫింగ్, అసభ్యకరమైన, పరువు నష్టం కలిగించే, బాధించే సందేశాలు, బ్లాక్‌మెయిలింగ్ ... వంటి నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి.



ప్రతీకాత్మక చిత్రం

స్టాకింగ్

డిజిటల్ ప్రపంచం ఎక్కువగా మాట్లాడే వాటిలో సైబర్ స్టాకింగ్ ఒకటి. దీంట్లో మహిళలు, పిల్లలనే లక్ష్యంగా చేసుకుని వేధింపులు ఉంటాయి. ఇది ఆన్‌లైన్ ముప్పు అని చెప్పవచ్చు. అవతలి వ్యక్తితో మనకు ప్రత్యక్ష సంబంధం ఉండదు. కానీ ఈ రోజుల్లో ఆఫ్‌లైన్ స్టాకింగ్ కంటే సైబర్ స్టాకింగ్ నేరాలు ఎక్కువయ్యాయి. ఎందుకంటే నేరస్థుడిని కనుక్కోవడం అంత సులభం కాదు. దీంట్లో అధికంగా టీనేజర్లు బాధితులవుతున్నారు. మహిళలపై ట్రోల్‌ల సంఖ్య పెరిగింది. కరోనా కాలం ఆన్‌లైన్ హింస, లైంగిక వేధింపుల గురించి ఒక కొత్త ఆందోళనలను లేవనెత్తింది. కోవిడ్ –19 తర్వాత ప్రపంచం ఆన్‌లైన్ వైపు వేగంగా కదులుతున్నందున, స్త్రీవాద దృక్పథం మారాల్సి ఉంది.

పరువు నష్టం

తమ తమ అభిప్రాయాలు, ఆలోచనలు, భావాలను వ్యక్తీకరించడానికి ప్రజలకు ఒక వేదిక ఇంటర్నెట్. దీని ద్వారా కలిగించే పరువు నష్టం మరో వ్యక్తి ప్రతిష్ఠకు కలిగే గాయం. ఇది ఇంటర్నెట్ సహాయంతో ఏ వ్యక్తికైనా వ్యతిరేకంగా పరువు నష్టం కలిగించే విషయాలను ప్రచురించడాన్ని సూచిస్తుంది. ఇప్పటికే సైబర్ పరువు నష్టంపై అనేక కేసులు ఉన్నాయి. ఇది ఎక్కువగా ఫేస్‌బుక్, గూగుల్ లేదా ఏదైనా ఇతర సోషల్ నెట్‌వర్కింగ్ లేదా మెయిల్ వెబ్‌సైట్ లో ఒకరి ఐడీ హ్యాక్ చేయడం ద్వారా ఉంటుంది. అలాగే, ఒక వ్యక్తి తాలూకు పూర్తి సమాచారంతో మరో నకిలీ ఖాతాను సృష్టించడం ద్వారా కూడా జరుగుతుంది.

ఫోటో మార్ఫింగ్

మార్ఫింగ్ అనేది అసలు ఫొటోలను మార్ఫిడి చేయడం. హ్యాకర్ మీ ఫొటోలను ఉపయోగించి, దానిని మార్ఫ్ చేసి, దుర్వినియోగం చేయడం సులభం. మార్ఫింగ్ చేయకుండా మీరు ఎవ్వరినీ ఆపలేరు. మీ ఫొటోలు పబ్లిక్‌గా ఉంటే, వ్యక్తులు వాటిని సులభంగా యాక్సెస్ చేయవచ్చు. వాటిని మార్ఫ్ చేయడానికి ఉపయోగించుకోవచ్చు. తమ లైంగిక ఊహలను సంతృప్తి పరుచుకోవడానికి పోర్న్ సైట్‌లలో వాటిని ఉపయోగిస్తుంటారు. ఎవరైనా మీ ఫోటో తీసి వాటిని అలా ఉపయోగించినా మీకు ఎప్పటికీ తెలియకపోవచ్చు.

ఇ-మెయిల్ స్పూఫింగ్

ఒకదాని నుంచి పంపించినట్టు ఇ-మెయిల్‌ను సూచిస్తుంది. కానీ అది మరొక దగ్గర నుండి పంపించిఖై ఉంటుంది. ఈ సాంకేతికతను ఉపయోగించే ఇ-మెయిల్స్ తరచూ కొన్ని మెసేజ్‌లు, పంక్తులు, లోగోలను కలిగి ఉంటాయి. ఇ-మెయిల్ స్పూఫింగ్ అనేది ఫిషింగ్, స్పామ్ ప్రచారాలలో ఉపయోగించే ఒక ముఖ్యమైన వ్యూహం. అంటే లాటరీ వచ్చిందనో, వర్క్ ఫ్రమ్ హోమ్ జాబ్స్.. అనో వీటిని ప్రధానంగా ఉపయోగిస్తుంటారు. ఇలాంటప్పుడు అవి సరైన మెయిల్స్ అని గుర్తించినప్పుడే వాటిని ఓపెన్ చేయడం మంచిది.

సైబర్ సేఫ్టీ పాయింట్స్

పాస్‌వర్డ్‌లను షేర్ చేయద్దు

బ్యాంక్ ఖాతా అయితే ఎవరికి వారు తమ పాస్‌వర్డ్‌ను గుర్తుంచుకుంటారు. లేదా ఎవరికీ చెప్పకుండా ఒక చోట రాసి పెట్టుకుంటారు. అలాగే, మీ డిజిటల్ పాస్‌వర్డ్‌ను ఎంత నమ్మకమున్న స్నేహితుడు లేదా భాగస్వామితోనైనా షేర్ చేయకూడదు. దీనికి సంబంధించిన భయం మంచిదే. స్నేహితులు ఉద్దేశపూర్వకంగా మీకు హాని కలిగించకపోయినా, వారు అనుకోకుండా ఎవరికైనా మీ పాస్‌వర్డ్‌ను చెప్పవచ్చు. కొన్నిసార్లు మీ పాస్‌వర్డ్ మారకముందే సంబంధాలు మారిపోతుంటాయి. మీ విచక్షణను ఉపయోగించండి, ఆ పాస్‌వర్డ్‌లను ప్రైవేట్‌గా, సంక్లిష్టంగా ఉంచండి.

మీ వెబ్‌క్యామ్‌ని కనెక్ట్ చేసి ఉంచద్దు

మీ వెబ్ కెమెరాను ఆన్ చేసి, మీకు తెలియకుండానే మీ కదలికలను చాకచక్యంగా రికార్డ్ చేయగల అనేక యాప్‌లు ప్రస్తుతం ఉన్నాయి. ఉపయోగంలో లేనప్పుడు మీ కెమెరా లెన్స్‌ను మూసి ఉంచండి లేదా పూర్తిగా ఏదైనా కవర్‌తో కప్పి ఉంచండి.

అవసరానికి మించి షేర్ చేయద్దు

సంబంధాలలో మంచి, చెడు రెండూ ఉంటాయి. అత్యుత్తమ వ్యక్తులు కూడా ఒకోసారి మరోవైపుకు మారచ్చు. అందుకే మీరు షేర్ చేసిన మీ సన్నిహిత సందేశాలు, ఫొటోలు, సమాచారం వచ్చి మిమ్మల్ని ఇబ్బంది పెట్టే అవకాశం ఉంటుంది. కనుక ఏదైనా షేర్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండండి.

ఆన్‌లైన్ పరిచయస్తులను ఒంటరిగా కలవవద్దు

ఆన్‌లైన్ వ్యక్తులను బయట కలిసే ముందు మీరు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరిని కలుస్తున్నారో మీ స్నేహితులు, కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ తెలియజేయండి. మీరు రద్దీగా ఉండే అంటే కాఫీ షాప్ లేదా మాల్‌లో సదరు వ్యక్తిని కలుసుకోవడానికి నిర్ణయించుకోవడం శ్రేయస్కరం.

అవసరమైనంత వరకే..

అనుమానం లేని మహిళలతో స్నేహం చేయడానికి సోషల్ మీడియా సైట్‌లను బ్రౌజ్ చేస్తున్న వారిలో చెడ్డవారు అనేకం ఉన్నారు. అందుకని.. మీ ఆచూకీ, జీవనశైలి గురించిన వివరాలను పోస్ట్ చేయడంలో జాగ్రత్తగా ఉండండి. స్టాకర్‌లు ఒక సాధారణ ఫొటోగ్రాఫ్ లేదా స్టేటస్ అప్‌డేట్‌తో మిమ్మల్ని చేరుకోవడానికి మార్గాలను కనుక్కోగలరు. మీ కెమెరాలో జియోట్యాగింగ్‌ని స్విచాఫ్ చేయండి. అవసరమైనప్పుడు మాత్రమే ఉపయోగించండి.

ఆపరేటింగ్ సిస్టమ్ అప్‌డేట్

ఈ ప్రక్రియ కొంత ఇబ్బందిని కలిగించవచ్చు. కానీ మిమ్మల్ని సురక్షితంగా ఉంచడానికి సిస్టమ్ అప్‌డేట్ చాలా ముఖ్యమైనది. ఇది భద్రతా అప్‌డేట్‌లు, ప్యాచ్‌లు తాజా బెదిరింపులను దూరంగా ఉంచుతుంది.

యాంటీవైరస్ సాఫ్ట్‌వేర్‌తో పరికరాలు భద్రం

భద్రతా వ్యవస్థ లేకుండా మొబైల్ ఫోన్ లేదా టాబ్లెట్ కలిగి ఉండటం అనేది తలుపులు తెరిచి ఇంట్లో కూర్చున్నట్లే. ఆండ్రాయిడ్, మ్యాక్ పరికరాలకు రెండూ హానికరమైన సాఫ్ట్‌వేర్ దాడికి ఉపకరణాలు. ఇవి మీ జీవితాన్ని తమ చేతుల్లోకి తీసుకోగలవు కాబట్టి మీ అన్ని పరికరాలలో 'నార్టన్ సెక్యూరిటీ' వంటి భద్రతా వ్యవస్థను ఇన్‌స్టాల్ చేయండి.

ఫైన్ ప్రింట్

ఏదైనా సేవ, రహస్యానికి సంబంధించిన సమాచారం, సేవా నిబంధనలను అర్థం చేసుకోండి. కొన్ని వెబ్‌సైట్‌లు మీ సమాచారాన్ని ఎవరికైనా ఇచ్చేయవచ్చు. లేదా అమ్మచ్చు, అద్దెకు తీసుకోవచ్చు. ఇది పెద్ద సమస్యగా మీకే తిరిగి రావచ్చు, మీరు నిబంధనలు షరతులకు అంగీకరించినందున చట్టం మిమ్మల్ని రక్షించలేకపోవచ్చు.

'ఉచితం' అంటూ ఏదీ లేదు

ఫ్రీ గేమ్‌లు, ఆఫర్లు, డీల్‌లు మొదలైనవిగా కుప్పలు తెప్పలుగా వస్తుంటాయి. అవి వైరస్‌లు, స్పైవేర్, హానికరమైన సాఫ్ట్‌వేర్‌లతో చిక్కుకుపోయి ఉండవచ్చు. ఇవి మీ పరికరంలోకి ప్రవేశించి, మీ మొత్తం డేటాను పొందగలవు.

వద్దనుకున్న వారు బ్లాక్

అవసరం లేని వ్యక్తులను జాబితా నుండి అన్‌ఫ్రెండ్ చేయండి లేదా బ్లాక్ చేయండి. మీ స్నేహితుల జాబితాలో ఎవరు ఉండాలో మీరు ఎంచుకోవచ్చు. భద్రత విషయానికి వస్తే ఆనఖలైన్, ఆఫ్‌లైన్ రెండింటిలోనూ సరైన జ్ఞానం, రక్షణ మొదటి వరుసలో ఉండాలి. మీ రక్షణలో మీ ప్రవృత్తులే కీలక పాత్ర పోషిస్తాయని గ్రహించండి.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



గిల్ ర్యాంక్ పైపైకి...

వన్డేల్లో విశేషంగా రాణిస్తున్న భారత యువ ఓపెనర్ శుబ్‌మన్ గిల్ అంతర్జాతీయ వన్డే ర్యాంకింగ్స్‌లో దూసుకెళ్తున్నాడు. జింబాబ్వేతో జరిగిన వన్డే సిరీస్‌లో అద్భుతంగా రాణించిన గిల్ ఏకంగా 45 స్థానాల్ని మెరుగుపర్చుకొని 38వ ర్యాంక్ కు ఎగబాకాడు. ప్రస్తుతం భారత్‌కు వన్డే, టెస్టు సిరీస్‌లు లేకపోవడంతో గిల్ ఇంగ్లండ్ కౌంటీ చాంపియన్‌షిప్‌పై దృష్టి సారించాడు. మిగిలిన కౌంటీ సీజన్‌లో గిల్ గ్లామోర్గాన్ జట్టు తరఫున మ్యాచ్‌లు ఆడతాడు.



రాబిన్సన్‌కు పిలుపు

సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో ఇన్నింగ్స్ తేడాతో ఓడిన ఇంగ్లండ్ ఇప్పుడు రెండో టెస్టులో పుంజుకోవాలనే పట్టుదలతో ఉంది. గురువారం నుంచి దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ జట్ల మధ్య రెండో టెస్టు జరుగనుంది. ఇందుకోసం స్టార్ సీమర్ ఒలీ రాబిన్సన్‌ను జట్టులోకి తీసుకున్నారు. గత కొంతకాలంగా ప్రత్యర్థులపై నిప్పులు చెరుగుతున్న రాబిన్సన్ బౌలింగ్ దళంలో ప్రధాన సీమర్‌గా ఎదిగాడు. మ్యాథ్యూ పాట్స్ స్థానంలో అతను బరిలోకి దిగనున్నాడు.

స్పోర్ట్స్ రీల్

యూకీ శుభారంభం



న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత అగ్రశ్రేణి ప్లేయర్ యూకీ బాంబ్రీ శుభారంభం చేశాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 552వ ర్యాంకర్ యూకీ 7-6 (7/4), 6-4తో తొమ్మిదో సీడ్, ప్రపంచ 107వ ర్యాంకర్ రాడూ అల్బోట్ (మాల్డోవా)పై గెలుపొంది రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. గంటా 34 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసి తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయాడు. అయితే భారత నంబర్‌వన్, ప్రపంచ 241వ ర్యాంకర్ రామ్‌కుమార్ రామనాథన్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయాడు. ప్రపంచ 762వ ర్యాంకర్ బ్రూనో కుజుహారా (అమెరికా) 6-3, 7-5తో రామ్‌కుమార్‌ను ఓడించాడు.

రన్నరప్ అనుపమ



కాంస్య, రజత పతకాలతో కీర్తన, అనుపమ

బుకారెస్ట్ (రొమేనియా): ప్రపంచ అండర్-21 మహిళల స్నూకర్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు రెండు పతకాలు లభించాయి. అంతర్జాతీయ బిలియర్డ్స్ స్నూకర్ సమాఖ్య (ఐబీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన ఈ మెగా ఈవెంట్‌లో భారత క్రీడాకారిణులు అనుపమ రామచంద్రన్ రజత పతకం... కీర్తన పాండ్యన్ కాంస్య పతకం సాధించారు. ఫైనల్లో అనుపమ 42-82, 57-50, 5-73, 3-65, 35-68తో పంచాయ చనోయ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. సెమీఫైనల్లో కీర్తన 18-59, 7-56, 32-71తో పంచాయ చనోయ్ చేతిలో ఓడిపోయి కాంస్య పతకం దక్కించుకుంది.

ప్రణయ్ సంచలనం

- ప్రపంచ రెండో ర్యాంకర్, రెండుసార్లు విశ్వవిజేత కెంటో మొమోటాపై విజయం
- నేడు ప్రిక్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్‌తో ‘ఢీ’
- రెండో రౌండ్‌లోనే ఓడిన శ్రీకాంత్

తనదైన రోజున ఎలాంటి ప్రత్యర్థినైనా హడలెత్తిస్తానని భారత అగ్రశ్రేణి షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ మరోసారి నిరూపించాడు. ఎంతో ప్రతిభ ఉన్నా.. తరచూ గాయాల బారిన పడుతూ... ఆశించినన్ని విజయాలు అందుకోలేకపోయిన ఈ కేరళ ప్లేయర్ అడపాదడపా అద్భుత విజయాలతో అలరిస్తుంటాడు. తాజాగా ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ప్రణయ్ పెను సంచలనం సృష్టించాడు. రెండుసార్లు ప్రపంచ చాంపియన్, రెండో ర్యాంకర్, టైటిల్ ఫేవరెట్స్‌లో ఒకడైన జపాన్ స్టార్ కెంటో మొమోటాను ప్రణయ్ వరుస గేముల్లో ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో గత ఏడాది కాంస్య పతక విజేత, భారత్‌కే చెందిన యువతార లక్ష్య సేన్‌తో ప్రణయ్ తలపడతాడు. గత సంవత్సరం రజత పతకం నెగ్గిన భారత స్టార్ కిడాంబి శ్రీకాంత్ ఈసారి మాత్రం రెండో రౌండ్ అడ్డంకిని దాటలేకపోయాడు.



మొమోటా



5
ప్రపంచ చాంపియన్స్‌పై ప్రణయ్ నెగ్గడం ఇది ఐదోసారి. గతంలో లిన్ డాన్ (చైనా), తౌఫిక్ హిదాయత్ (ఇండోనేసియా), చెన్ లాంగ్ (చైనా), అక్సెల్‌సన్ (డెన్మార్క్)లపై కూడా ప్రణయ్ గెలిచాడు.

టోక్యో: అత్యున్నత వేదికపై అద్భుత ఆటతీరుతో భారత అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ ప్లేయర్ హెచ్ఎస్ ప్రణయ్ అదరగొట్టాడు. ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఈ కేరళ ఆటగాడు సంచలన విజయంతో అందరి దృష్టిని ఆకర్షించాడు. 2018, 2019 ప్రపంచ చాంపియన్, ప్రపంచ రెండో ర్యాంకర్ కెంటో మొమోటా (జపాన్)పై ప్రణయ్ వరుస గేముల్లో గెలిచి ఈ మెగా ఈవెంట్‌లో వరుసగా రెండో ఏడాది ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ 18వ ర్యాంకర్ ప్రణయ్ 21-17, 21-16తో కెంటో మొమోటాను ఓడించాడు. గతంలో మొమోటాతో ఆడిన ఏడుసార్లూ ఓడిపోయిన ప్రణయ్ ఎనిమిదో ప్రయత్నంలో విజయం సాధించడం విశేషం. మొమోటాతో 54 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో ప్రణయ్ కీలకదశలో ఒత్తిడికి లోనుకాకుండా సంయమనంతో ఆడి పాయింట్లు గెలిచాడు. తొలి గేమ్ ఆరంభంలో ఇద్దరూ 4-4తో సమంగా నిలిచారు. ఆ తర్వాత ప్రణయ్ వరుసగా రెండు పాయింట్లు గెలిచి 6-4తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అనంతరం ఒక పాయింట్ కోల్పోయిన ప్రణయ్ మళ్లీ విజృంభించి వరుసగా నాలుగు పాయింట్లు నెగ్గి 10-5తో ముందంజ వేశాడు. ఇదే దూకుడును కొనసాగిస్తూ ప్రణయ్ తొలి గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో గేమ్ మొదట్లో ప్రణయ్ 1-4తో వెనుకబడ్డాడు. కానీ వెంటనే తేరుకున్న ప్రణయ్ స్కోరును సమం చేశాడు. అనంతరం 8-6తో ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత మొమోటాకు పుంజుకునే అవకాశం ఇవ్వకుండా ప్రణయ్ ఈ ఆధిక్యాన్ని కాపాడుకుంటూ చిరస్మరణీయ విజయాన్ని అందుకున్నాడు. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత్‌కే చెందిన లక్ష్య సేన్‌తో ప్రణయ్ తలపడతాడు. మరో రెండో రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 10వ ర్యాంకర్ లక్ష్య సేన్ 36 నిమిషాల్లో 21-17, 21-10తో లూయిస్ ఎన్రిక్ పెనాల్వర్ (స్పెయిన్)పై గెలుపొందాడు.

శ్రీకాంత్ అవుట్...

గత ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించిన ప్రపంచ మాజీ నంబర్‌వన్, భారత స్టార్ కిడాంబి శ్రీకాంత్ ఈసారి మాత్రం రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. ప్రపంచ 23వ ర్యాంకర్ జావో జున్ పెంగ్ (చైనా)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 13వ ర్యాంకర్ శ్రీకాంత్ 9-21, 17-21తో ఓడిపోయాడు.

పోరాడి ఓడిన శిఖా–అశ్విని జోడీ

మహిళల డబుల్స్‌లో భారత పోరాటం ముగిసింది. బుధవారం బరిలోకి దిగిన నాలుగు భారత జోడీలు రెండో రౌండ్‌లోనే నిష్క్రమించాయి. శిఖా గౌతమ్–అశ్విని భట్ 5-21, 21-18, 13-21తో ప్రపంచ నాలుగో ర్యాంక్ జోడీ కిమ్ సో యోంగ్–కాంగ్ హి యోంగ్ చేతిలో పోరాడి ఓడిపోయింది. సిక్కి రెడ్డి–అశ్విని పొన్నప్ప 15-21, 10-21తో టాప్ సీడ్ చెన్ కింగ్ చెన్–జియా యి ఫాన్ (చైనా) చేతిలో... దండు పూజ–సంజన 15-21, 7-21తో మూడో సీడ్ లీ సో హీ–షిన్ సెయుంగ్ చాన్ (కొరియా) చేతిలో... పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ 8-21, 17-21తో పదో సీడ్ పియర్లీ తాన్–థినా మురళీధరన్ (మలేసియా) చేతిలో ఓడిపోయారు.



ధ్రువ్-అర్జున్ జోడీ అద్భుతం

పురుషుల డబుల్స్‌లో భారత రెండు జోడీలు ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకున్నాయి. రెండో రౌండ్‌లో ధ్రువ్ కపిల–ఎం.ఆర్.అర్జున్ ద్వయం 21-17, 21-16తో ప్రపంచ ఎనిమిదో ర్యాంక్ జోడీ కిమ్ ఆస్ట్రప్–ఆండెర్స్ రస్ముసెన్ (డెన్మార్క్)పై సంచలన విజయం సాధించింది. మరో రెండో రౌండ్ మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి ద్వయం 21-8, 21-10తో సోలిస్ జొనాథన్–అనిబెల్ మార్క్విస్ (గ్వాటెమాలా) జోడీపై గెలిచింది. నేడు జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో జెప్ బే–లాసి మోల్డే (డెన్మార్క్)లతో సాత్విక్–చిరాగ్... హీ యోంగ్ కాయ్ టెరీ–లో కీన్ హీన్ (సింగపూర్)లతో అర్జున్–ధ్రువ్ ఆడతారు.

ఆసియా కప్‌లో భారత్ కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్



ముంబై: జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్‌కు మరో సిరీస్ బాధ్యతలు అప్పజెప్పారు. ఆసియా కప్ టి20 టోర్నమెంట్‌లో పాల్గొనే టీమిండియా తాత్కాలిక కోచ్‌గా నియమించారు. రెగ్యులర్ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు కరోనా సోకడంతో ఇక్కడే ఉండిపోయారు. దీంతో ఇటీవల జింబాబ్వేలో కోచ్ పాత్రను విజయవంతంగా పోషించిన లక్ష్మణ్‌కు ఆసియా కప్ బాధ్యతలు అప్పగించారు. మరింత సమయం లేకపోవడంతో ఆయన హరారే (జింబాబ్వే) నుంచి నేరుగా దుబాయ్‌కి వెళ్లారు. దీనికి సంబంధించిన వీసా ప్రక్రియను బోర్డు పూర్తి చేసింది. అందువల్లే లక్ష్మణ్ బుధవారం జట్టుతో కలిసేందుకు మార్గం సుగమమైందని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వర్గాలు తెలిపాయి. మరోవైపు బోర్డు వైద్యబృందం ద్రవిడ్ ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని, వైరస్ నుంచి బయటపడగానే యూఏఈకి వెళ్లే ఆకాశముందని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ప్రత్యక్షంగా జట్టుతో లేకపోయినప్పటికీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ద్రవిడ్... ఇన్‌చార్జ్ కోచ్ లక్ష్మణ్, బౌలింగ్ కోచ్ పారస్ మాంబ్రే, బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్‌లకు అందుబాటులో ఉన్నారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. బుధవారం సాయంత్రం టీమిండియా ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంది.

సింగిల్స్ విజేత హన్సిని



న్యూఢిల్లీ: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) యూత్ కంటెండర్ టీటీ టోర్నీలో భారత క్రీడాకారిణులు అదరగొట్టారు. మూడు సింగిల్స్ విభాగాల్లో టైటిల్స్ గెల్చుకున్నారు. ఈక్వెడార్‌లో జరిగిన ఈ టోర్నీలో తమిళనాడుకు చెందిన హన్సిని మథన్ రాజన్ అండర్-13 బాలికల సింగిల్స్ విభాగంలో విజేతగా నిలిచింది. ఫైనల్లో హన్సిని 11-7, 11-8, 11-7తో మరియానా రోడ్రిగెజ్ (ఈక్వెడార్)పై గెలిచింది. అండర్-19 బాలికల సింగిల్స్ విభాగంలో యశస్విని, అండర్-17 బాలికల సింగిల్స్ విభాగంలో సుహానా సైనీ కూడా టైటిల్స్ సాధించారు.

భారత ‘ఎ’ జట్టులో తిలక్ వర్మ

న్యూజిలాండ్ ‘ఎ’తో సిరీస్‌కు ఎంపిక



ముంబై: పరిమితంగా జరిగిన దేశవాళీ టోర్నీలతో పాటు, ఈ సీజన్ ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున మెరిసిన హైదరాబాదీ యువ క్రికెటర్ నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ భారత ‘ఎ’ జట్టులోకి ఎంపికయ్యాడు. ఇందులో ఆంధ్ర వికెట్ కీపర్–బ్యాటర్ శ్రీకర్ భరత్‌కు కూడా సెలక్టర్లు అవకాశమిచ్చారు. ఈ జట్టు భారత పర్యటనకు వచ్చే న్యూజిలాండ్ ‘ఎ’తో నాలుగు రోజుల అనధికారిక టెస్టు మ్యాచ్‌లు ఆడుతుంది. సెప్టెంబర్ 1 నుంచి బెంగళూరు, హుబ్లీ వేదికగా మూడు మ్యాచ్‌ల సిరీస్ జరుగుతుంది. అనంతరం ఇరు జట్ల మధ్య చెన్నైలో వన్డే సిరీస్ నిర్వహిస్తారు. ప్రస్తుతం ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో తలపడే జట్టును మాత్రమే ఎంపిక చేశారు. వన్డే జట్టును తర్వాత ఎంపిక చేయనున్నట్లు ఆలిండియా సీనియర్ సెలక్షన్ కమిటీ వర్గాలు తెలిపాయి.

భారత్ ‘ఎ’ జట్టు: ప్రియాంక్ పాంచల్ (కెప్టెన్), ఠాకూర్ తిలక్ వర్మ, శ్రీకర్ భరత్ (వికెట్ కీపర్), అభిమన్యు ఈశ్వరన్, రుతురాజ్ గైక్వాడ్, రజత్ పటిదార్, సర్ఫరాజ్ ఖాన్, ఉపేంద్ర యాదవ్ (వికెట్ కీపర్), కుల్దీప్ యాదవ్, సౌరభ్ కుమార్, రాహుల్ చహర్, ప్రసిధ్ కృష్ణ, ఉమ్రాన్ మలిక్, ముకేశ్ కుమార్, యశ్ దయాళ్, అర్జాన్ నాగ్వాస్‌వాలా.

సినిమా

మళ్లీ ఆరంభం



కమల్‌హాసన్

‘ఇండియన్ 2’ సినిమా మళ్లీ ట్రాక్‌లోకి వచ్చింది. హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన ‘ఇండియన్’ (తెలుగులో ‘భారతీయుడు’) చిత్రం ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ చిత్రం విడుదలైన పాతిక సంవత్సరాల తర్వాత లైకా ప్రొడక్షన్స్ నిర్మాణంలో ‘ఇండియన్’కు సీక్వెల్‌గా ‘ఇండియన్ 2’ను ఆరంభించారు కమల్–శంకర్. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో ఓ పెద్ద ప్రమాదం జరగడం, ఆ తర్వాత బడ్జెట్ విషయంలో దర్శకుడు శంకర్, నిర్మాణ సంస్థ లైకాకు మధ్య అభిప్రాయభేదాలు రావడంతో షూటింగ్ తాత్కాలికంగా నిలిచిపోయింది. తాజాగా ‘ఇండియన్ 2’ సినిమా షూటింగ్ బుధవారం తిరిగి ప్రారంభం అయ్యింది. ఈ విషయాన్ని ధ్రువీకరిస్తూ ఈ చిత్రానికి సంబంధించిన కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. అలాగే పూజా కార్యక్రమం కూడా నిర్వహించారు. ‘‘సెప్టెంబరు నుంచి ‘ఇండియన్ 2’ సినిమా షూటింగ్‌లో పాల్గొననున్నాను’’ అని పేర్కొన్నారు కమల్‌హాసన్. కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్, ప్రియాభవానీ శంకర్, సిద్ధార్థ్, బాబీ సింహా ఇతర ముఖ్య తారాగణంగా నటిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నారు.

జైలర్‌కి అతిథి

జైలర్‌కి జోడీనా?

స్నేహితురాలా... తమన్నా పాత్ర గురించి కొన్ని రోజులుగా జరుగుతున్న చర్చ ఇది. రజనీకాంత్ హీరోగా ‘జైలర్’ టైటిల్‌తో సినిమా ఆరంభమైన సంగతి తెలిసిందే. ఇందులో తమన్నా నటించనున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. అప్పటినుంచి ఆమె రజనీ సరసన నటించనున్నారా? ఫ్రెండ్ క్యారెక్టరా అనే చర్చ మొదలైంది. ఈ రెండూ కాదట.. తమన్నా అతిథి పాత్రలో కనిపించనున్నారని సమాచారం. అది కూడా నిడివి తక్కువ ఉన్న పాత్ర అని కోలీవుడ్ టాక్. అయితే రజనీతో స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం, నిడివి తక్కువ అయినప్పటికీ ప్రాధాన్యం ఉన్న పాత్ర కావడంతో తమన్నా అంగీకరించారట. ఇదిలా ఉంటే బుధవారం ఈ చిత్రనిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ‘వెల్‌కమ్ ఆన్ బోర్డ్’ అంటూ ఈ చిత్రంలో నటించనున్న రమ్యకృష్ణ, యోగిబాబు, వసంత్ రవి, వినాయకన్ పేర్లను ట్వీట్ చేసింది. ఇక తమన్నా పాత్ర, హీరోయిన్ల విషయంపై క్లారిటీ రావాల్సి ఉంది. ఈ చిత్రానికి నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకుడు.



తమన్నా

సూర్య @ 42 షురూ

సూర్య హీరోగా నటించనున్న 42వ సినిమాకి శ్రీకారం జరిగింది. మాస్ దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న శివ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందనుంది. స్టూడియో గ్రీన్ బేనర్‌తో కలిసి టాలీవుడ్‌లో అగ్ర బేనర్లలో ఒకటైన యూవీ క్రియేషన్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఈ చిత్రం ప్రారంభోత్సవం పలువురు ప్రముఖుల సమక్షంలో జరిగింది. ‘‘త్వరలో పూర్తి వివరాలు తెలియజేస్తాం’’ అని దర్శక- నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, నిర్మాతలు: వంశీ, ప్రమోద్, జ్ఞానవేల్ రాజా, విక్రమ్.



శివ, సూర్య, దేవిశ్రీ ప్రసాద్

నాకు ఇది చివరి సినిమా కాదు



ఉషా ముల్పూరి

‘‘ఏ లక్ష్యంతోనూ నేను ఇండస్ట్రీకి రాలేదు. అనుకోని పరిస్థితుల్లో నిర్మాతగా నా జర్నీ మొదలుపెట్టాను. నా ప్రతి సినిమాకు ఇదే చివరి సినిమా అనుకుని పని చేశాను. ‘కృష్ణా వ్రింద విహారి’కి కూడా ఇలానే ఫీలయ్యాను. కానీ మా స్నేహితులు, శ్రేయోభిలాషుల సలహా మేరకు నిర్మాతగా కొనసాగాలనుకుంటున్నాను’’ అన్నారు ఉషా ముల్పూరి. నాగశౌర్య, షిర్లే సేతియా జంటగా అనీష్ కృష్ణ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘కృష్ణా వ్రింద విహారి’. ఉషా ముల్పూరి నిర్మించిన ఈ సినిమా సెప్టెంబరు 23న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఉషా ముల్పూరి చెప్పిన విశేషాలు.

- ‘కృష్ణా వ్రింద విహారి’ షూటింగ్ 95 శాతం పూర్తయింది. ఓ సాంగ్, కాస్త రీ రికార్డింగ్ బ్యాలెన్స్ ఉన్నాయి. ఓ నిర్మాతగా ఈ సినిమా అవుట్‌పుట్‌పై సంతృప్తిగా ఉన్నాను. అయితే కరోనా పరిస్థితుల వల్ల ఈ సినిమా బడ్జెట్ అనుకున్నదానికన్నా కాస్త పెరిగింది. ఇందులో బ్రాహ్మణ యువకుడు కృష్ణ పాత్రలో నాగశౌర్య కనిపిస్తాడు. వ్రింద పాత్రలో షిర్లే నటించింది. బ్రాహ్మణ యువకుడి నేపథ్యంలో ‘డీజే’, ‘అంటే సుందరానికీ..’ వంటి సినిమాలు వచ్చి ఉండొచ్చు. కానీ ‘కృష్ణా వ్రింద విహారి’ కథ వేరు. ఆ చిత్రాలతో ఏ మాత్రం సంబంధం లేదు.
- పల్లెటూరి కుర్రాడు, బ్రాహ్మణ యువకుడు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, కొడుకు, ప్రేమికుడు, భర్త... ఇలా భిన్నమైన కోణాల్లో నాగశౌర్యను చూస్తారు. కృష్ణ పాత్ర కోసం నాగశౌర్య ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. షిర్లే కూడా బాగా నటించింది. అనీష్ కృష్ణ సినిమాను బాగా డీల్ చేశాడు. మంచి కథతో నిర్మించిన ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నాం. ఇక మా అబ్బాయి నాగశౌర్య పెళ్లి విషయంలో తనదే తుది నిర్ణయం.



రక్షిత్ అట్లూరి, కోమలీ ప్రసాద్ జంటగా సాయిమోహన్ ఉబ్బన దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ‘శశివదనే’. గౌరీ నాయుడు సమర్పణలో అహితేజ బెల్లంకొండ నిర్మిస్తున్న సినిమా ఇది. బుధవారం కోమలీ బర్త్ డే సందర్భంగా ఈ చిత్రంలోని ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు.



తెలుగు పరిశ్రమలో సమస్యల పరిష్కారానికి ఆగస్ట్ 1 నుంచి షూటింగ్‌లు ఆపివేసిన విషయం విదితమే. కాగా సెప్టెంబర్ 1 నుంచి షూటింగ్‌లు పునః ప్రారంభించుకోవచ్చని మంగళవారం చలన చిత్ర వాణిజ్య మండలి ఆధ్వర్యంలో నిర్మాత ‘దిల్’ రాజు తెలిపారు. అయితే అప్పటివరకూ ఇంకొన్ని సమావేశాలు జరుపుతామన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం దర్శకులతో సమావేశం అయ్యారు. ముఖ్యంగా సినిమాల కాస్ట్ కట్టింగ్ గురించి చర్చ జరిగిందట. త్రివిక్రమ్, సుకుమార్, బోయపాటి శ్రీను, కొరటాల శివ, మెహర్ రమేశ్, శ్రీవాస్, అనిల్ రావిపూడి, పరశురామ్, బాబీ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ‘బ్రహ్మాస్త్ర’ ప్రమోషన్‌లో భాగంగా చెన్నై వెళ్లిన రాజమౌళి పాల్గొనలేకపోయారు.

కథ అంతేలే!

తనీష్, వికాస్ వశిష్ఠ హీరోలుగా సహర్ కృష్ణన్ హీరోయిన్‌గా, శ్రీనివాస్ (ప్రముఖ నటి గీతాంజలి తనయుడు) ముఖ్య పాత్రలో రూపొందుతున్న చిత్రం ‘అంతేలే కథ అంతేలే’. స్వీయ దర్శకత్వంలో ఎం. నివాస్ రూపొందిస్తున్నారు. విలేకరుల సమావేశంలో ఎం. నివాస్ మాట్లాడుతూ– ‘‘రాయలసీమ ప్రాంతంలోని ఒక గ్రామంలో జరిగే కథ ఇది. ఈ కథలో పలు భావోద్వేగాలు మిళితమై ఉంటాయి’’ అన్నారు. ‘‘అద్భుతమైన ఎమోషన్స్‌తో, హ్యూమన్ రిలేషన్స్‌తో సాగే ఈ సినిమాలో డిఫరెంట్ క్యారెక్టర్ చేస్తున్నాను’’ అని తనీష్ అన్నారు. ‘‘సినిమా బండి’ తర్వాత ఈ సినిమా చేస్తున్నాను. ఈ సినిమాలో ఎక్కువ మాటలు ఉండవు కానీ కథను ఎమోషన్ క్యారీ చేస్తుంది’’ అన్నారు వికాస్ వశిష్ఠ. ‘‘నేను గీతాంజలి రామకృష్ణగారి అబ్బాయిని. ఇంతకుముందు కొన్ని సినిమాలు చేశాను. ఈ సినిమాలో నాకు మంచి గుర్తింపు వచ్చే పాత్ర దొరికింది’’ అన్నారు శ్రీనివాస్.



వికాస్, నివాస్, తనీష్

కథ విని ఆశ్చర్యపోయాను

- హెబ్బా పటేల్



హెబ్బా, రాధామోహన్, అశోక్ తేజ్, సాయి రోనక్

హెబ్బా పటేల్, వశిష్ఠ సింహా, సాయి రోనక్, పూజిత పొన్నాడ ప్రధాన పాత్రల్లో అశోక్ తేజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘ఓదెల రైల్వేస్టేషన్’. దర్శకుడు సంపత్ నంది అందించిన కథ, స్క్రీన్ ప్లేతో కేకే రాధామోహన్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 26 నుంచి ఆహా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా బుధవారం విలేకర్ల సమావేశంలో హెబ్బా పటేల్ మాట్లాడుతూ – ‘‘సంపత్ నందిగారు చెప్పిన కథ విని ఆశ్చర్యపోయాను. నా కెరీర్‌లో నేను చాలా కష్టపడి చేసిన సినిమా ఇది. సవాల్‌గా తీసుకుని చేశాను. నటిగా ఈ సినిమాతో చాలా నేర్చుకున్నాను’’ అన్నారు. ‘‘ఓదెల రైల్వేస్టేషన్’ క్రైమ్ థ్రిల్లర్. 50 రోజుల్లో సినిమా షూటింగ్‌ను పూర్తి చేసినా కోవిడ్ వల్ల రిలీజ్ కాస్త ఆలస్యమైంది’’ అన్నారు రాధామోహన్. ‘‘నాకు దర్శకుడిగా చాన్స్ ఇచ్చిన సంపత్ నందిగారికి రుణపడి ఉంటాను. ఈ సినిమాలో నటించిన అందరికీ మంచి పేరు వస్తుంది’’ అన్నారు అశోక్ తేజ్. ‘‘ఈ సినిమా కథ విన్నపుడు థ్రిల్ అయ్యాను. ప్రతి సన్నివేశం ఉత్కంఠగా సాగుతుంది’’ అన్నారు వశిష్ఠ సింహా. ‘‘ఇప్పటివరకు ఎక్కువగా సాఫ్ట్ పాత్రలు చేసిన నేను ఇందులో సీరియస్ పోలీస్ ఆఫీసర్‌గా చేశాను’’ అన్నారు సాయి రోనక్. ఈ కార్యక్రమంలో ‘ఆహా’ ప్రతినిధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలతో కథ

హేమంత్, అషు రెడ్డి, రచన, శ్వేతా, అప్పాజీ, మాధురి, యార్లి ముఖ్య తారలుగా నటించిన చిత్రం ‘పీకే’. హేమంత్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని ధనలక్ష్మి వెంకటేష్ నిర్మించారు. ఈ నెల 26న ఈ చిత్రం విడుదల కానుంది. ‘‘ఒక వ్యక్తికి వచ్చిన కలను కథగా మార్చి తీసిన చిత్రం ఇది. వాస్తవ ఘటనలను జోడించి తెరకెక్కించాం’’ అన్నారు చిత్ర హీరో– దర్శకుడు హేమంత్. ఈ చిత్రానికి కో– ప్రొడ్యూసర్: రవికాంత్ నల్లూరు.



రచన, హేమంత్

కామెడీ.. సస్పెన్స్.. థ్రిల్



శివ, ప్రియాంక

శివ ఆలపాటి, ప్రియాంకా శర్మ, ‘షకలక’ శంకర్, రాజీవ్ కనకాల, నోయల్ ప్రధాన తారాగణంగా ఎమ్. అభిరామ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘డైహార్డ్ ఫ్యాన్’. చంద్రప్రియ సుబుధి నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను దర్శకులు సుకుమార్ విడుదల చేశారు. వీడియో బైట్‌లో సుకుమార్ మాట్లాడుతూ – ‘‘సస్పెన్స్ కామెడీ డ్రామాగా రూపొందిన ‘డైహార్డ్ ఫ్యాన్’ ట్రైలర్ బాగుంది. మంచి కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమా విజయం సాధించాలి’’ అన్నారు. ‘‘నా మొదటి సినిమాకే సీనియర్ ఆర్టిస్టులతో నటించినందుకు చాలా హ్యాపీ’’ అన్నారు ఆలపాటి శివ. ‘‘టైటిల్ క్రేజీగా ఉందని పెట్టారా? అని చాలామంది అడిగారు. కానీ సినిమాకు తగ్గట్టే టైటిల్ ఉంటుంది. హీరోయిన్‌కి, అభిమానికి మధ్య జరిగే సస్పెన్స్ కామెడీ డ్రామాయే ఈ చిత్రం’’ అన్నారు అభిరామ్. ‘‘ఈ సినిమాకు కథే హీరో’’ అన్నారు చంద్రప్రియ.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 54	నిఫ్టీ ▲ 27
59,085	17,605

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 సమయం)			
నాస్‌డాక్	12,432	▲	51
డోజోన్స్	32,931	▲	21
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,472	▽	17
డాక్స్	13,220	▲	26
షాంఘై	3,215	▽	61
నికాయ్	28,313	▽	139

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

మార్కెట్లోకి మెర్సిడెస్ బెంజ్ ఈక్యూఎస్ 53

ధర రూ. 2.45 కోట్ల నుంచి ప్రారంభం



ముంబై: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ తాజాగా పూర్తి ఎలక్ట్రిక్ కారు మెర్సిడెస్-ఏఎంజీ ఈక్యూఎస్ 53 4మ్యాటిక్‌ను దేశీ మార్కెట్లో ఆవిష్కరించింది. దీని ధర రూ. 2.45 కోట్ల (ఎక్స్ షోరూం) నుంచి ప్రారంభమవుతుంది. ఈ కారు ఒక్కసారి చార్జి చేస్తే 529–586 కి.మీ. వరకూ నడుస్తుంది. 3.4 సెకన్లలో గంటకు వంద కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదు. భారత్‌లో తమ ఎలక్ట్రిక్ కార్ల శ్రేణిని పెంచుకునే దిశగా నాలుగు నెలల్లో మూడు విద్యుత్ వాహనాలను ప్రవేశపెట్టాలని నిర్దేశించుకున్నట్లు మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ మార్టిన్ ష్వెంక్ తెలిపారు. ఈ ప్రణాళికలో భాగంగా వచ్చే నెలలో ఈక్యూఎస్ 580, ఆ తర్వాత నవంబర్‌లో సెవెన్ సీటర్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఈక్యూబీని తేనున్నట్లు వివరించారు. రాబోయే అయిదేళ్లలో తమ వాహన విక్రయాల్లో ఎలక్ట్రిక్ కార్ల వాటా 25 శాతంగా ఉండగలదని అంచనా వేస్తున్నట్లు మార్టిన్ చెప్పారు.

ముత్తూట్ ఫైనాన్స్ 'మిల్లీగ్రామ్ గోల్డ్ ప్రోగ్రామ్'



కొచ్చి: గోల్డ్ ఫైనాన్సింగ్ దిగ్గజం ముత్తూట్ ఫైనాన్స్ 'మిల్లీగ్రామ్ గోల్డ్ ప్రోగ్రామ్'ను ప్రారంభించింది. ఇందులో భాగంగా ముత్తూట్ గ్రూప్ వద్ద లావాదేవీలను నిర్వహించే కస్టమర్లకు కనీసం మిల్లీగ్రామ్ బంగారం బహుమతిగా అందజేస్తుంది. రిఫరల్ లావాదేవీపై 20 మిల్లీగ్రాముల బంగారం పొందవచ్చు. ఈ ప్రోగ్రామ్ ఏప్రిల్ 2022 నుంచి నిర్వహించిన అన్ని లావాదేవీలపై వర్తిస్తుంది. ఏటా రూ.50 కోట్ల విలువైన(100 కేజీలు) బంగారాన్ని కస్టమర్లకు అందించాలని కంపెనీ భావిస్తోంది. 'రెండేళ్ల పాటు జరిగే ఈ కార్యక్రమం ద్వారా కస్టమర్లతో మా అనుబంధం మరింత బలోపేతం అవుతుందని విశ్వసిస్తున్నాము. ఎన్నో ఏళ్లుగా వారు మాపై చూపుతున్న అభిమానానికి కృతజ్ఞత ఇది' అని కంపెనీ ఎండీ జార్జ్ అలెగ్జాండర్ ముత్తూట్ తెలిపారు.

డిస్కౌంట్ల పండగొచ్చింది..!

- ఎలక్ట్రానిక్స్ నుంచి నిత్యావసరాల వరకు ఆఫర్లు
- వ్యయాలు తగ్గడంతో కస్టమర్లకు బదిలీ
- 5–8 శాతం తగ్గిన టీవీల ధరలు
- స్మార్ట్‌ఫోన్లపై 4–5 శాతం డిస్కౌంట్
- ల్యాప్‌టాప్‌లపై 2,000 వరకు ఆఫర్



న్యూఢిల్లీ: పండుగల సమయాల్లో డిస్కౌంట్ సేల్స్ నిర్వహించడాన్ని చూశాం. కానీ, ఈ విడత పండుగలకు ముందే ఆఫర్ల విక్రయాలు మొదలయ్యాయి. కన్జ్యూమర్ గూడ్స్ అయిన టీవీలు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, వస్త్రాలు, నిత్యావసర ఉత్పత్తులను సైతం తగ్గింపు ధరలపై కంపెనీలు విక్రయిస్తున్నాయి. బిస్కెట్లు, పప్పులపైనా ఈ తగ్గింపు ధరలు అమలవుతుండడం విశేషం. కరోనా తర్వాత సరఫరా వ్యవస్థలో ఏర్పడిన సమస్యలు, ముడి సరుకుల ధరలు పెరుగుదల ప్రభావంతో అధిక వ్యయాలను అధిగమించేందుకు, కంపెనీలు ఉత్పత్తుల ధరలను పెంచుతూ వచ్చాయి. ఇది డిమాండ్‌పై ప్రభావం చూపించింది. ఈ విడత పండుగల నాటికి విక్రయాలు జోరందుకుంటాయని కంపెనీలు అంచనా వేస్తున్నాయి. ఎల్‌జీ, శాంసంగ్, సోనీ టీవీల ధరలు గత కొన్ని వారాల్లో 5–8% వరకు తగ్గాయి. మధ్య శ్రేణి నుంచి అధిక ధరల ల్యాప్‌టాప్ ధరలను సైతం రూ.1,500 నుంచి రూ.2,000 వరకు కంపెనీలు తగ్గించి విక్రయిస్తున్నాయి. ఇక స్మార్ట్‌ఫోన్లపై కంపెనీలు 4–5% డిస్కౌంట్ ఇస్తున్నట్టు పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

నూనెలు సైతం..

నిత్యావసర వస్తువుల ధరలు కూడా దిగి వస్తుండడం వినియోగదారులకు ఊరటనిస్తోంది. వంట నూనెల ధరలు 15–20 శాతం వరకు తగ్గాయి. పెద్ద బిస్కెట్ ప్యాక్‌ల ధరలపై ఎఫ్‌ఎంసీజీ కంపెనీలు 15–20 శాతం వరకు డిస్కౌంట్ ఆఫర్ చేస్తున్నాయి. వచ్చే కొన్ని నెలల పాటు విస్తృత ప్రచారం నిర్వహించనున్నట్టు ఎఫ్‌ఎంసీజీ కంపెనీలు తెలిపాయి. ''తయారీ వ్యయాలు తగ్గినందున ఆ ప్రయోజనాన్ని వినియోగదారులకు బదిలీ చేస్తూ ఆగస్టు 15 నుంచి మా బిస్కెట్ ప్యాక్‌లపై 10–15 శాతం తగ్గింపు ఇస్తున్నాం'' అని పార్లే ప్రొడక్ట్స్ సీనియర్ కేటగిరీ హెడ్ మయాంక్ షా తెలిపారు. మరికొంత కాలం పాటు ముడి సరుకుల ధరల తీరును గమనించిన తర్వాత, అన్ని రకాల ఉత్పత్తులపై ధరల తగ్గింపు పరిశీలిస్తామని చెప్పారు. ఎలక్ట్రానిక్ కాంపోనెంట్లు, సెమీకండక్టర్లు, ఓపెన్ సెల్ ధరలు ఇటీవలి కాలంలో చెప్పుకోతగ్గ మేర తగ్గాయి. ఎఫ్‌ఎంసీజీ కంపెనీలకు సైతం తయారీ వ్యయాలు 15 శాతం వరకు శాంతించాయి. ధరలు తగ్గించినప్పటికీ, ఇప్పటికీ ఉత్పత్తుల ధరలు కరోనా మహమ్మారి ముందు నాటితో పోలిస్తే అధికంగానే ఉండడం గమనించాలి. దీనికి కారణం కంపెనీలు గత రెండేళ్ల కాలంలో ధరలను గణనీయంగా పెంచాయి.

స్వల్ప లాభాల ముగింపు

సెన్సెక్స్ లాభం 54 పాయింట్లు



ముంబై: పరిమిత శ్రేణిలో కదలాడిన సూచీలు బుధవారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఇంట్రాడేలో 411 పాయింట్ల పరిధిలో ట్రేడైన సెన్సెక్స్ చివరికి 54 పాయింట్లు పెరిగి 59,085 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో నిఫ్టీ 124 పాయింట్ల మధ్య కదలాడింది. మార్కెట్ ముగిసేసరికి 27 పాయింట్లు బలపడి 17,605 వద్ద నిలిచింది. సూచీలకిది వరుసగా రెండోరోజూ లాభాల ముగింపు. బ్యాంకింగ్, ఆర్థిక, మెటల్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఐటీ, ఆటో, ఫార్మా షేర్లు నష్టపోయాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఇండెక్సులు వరుసగా 0.80%, 0.73 శాతం చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.323 కోట్ల షేర్లను, దేశీయ ఇన్వెస్టర్లు రూ.23 కోట్ల షేర్లను కొన్నారు. నిరుత్సాహకర స్థూల ఆర్థిక గణాంకాల నమోదు, వడ్డీరేట్ల పెంపు భయాలతో అంతర్జాతీయ మార్కెట్లు నీరసంగా కదలాడుతున్నాయి.

అప్పర్ సర్క్యూట్ తాకిన ఎన్‌డీటీవీ షేరు

ఎన్‌డీటీవీలో మెజారిటీ వాటాను దక్కించుకునేందుకు అదానీ గ్రూప్ పావులు కదుపుతున్న తరుణంలో ఎన్‌డీటీవీ షేరుకు డిమాండ్ నెలకొంది. ట్రేడింగ్ ప్రారంభంలోనే 5% దూసుకెళ్లి రూ.384.50 అప్పర్ సర్క్యూట్ వద్ద లాకయింది. ఈ ముగింపు షేరుకు 14 ఏళ్ల గరిష్ట స్థాయి.

అదానీ షేర్లలో కొనసాగిన అమ్మకాలు

స్థాయికి మించి రుణాలు తీసుకున్నట్లు ఫిచ్ రేటింగ్ ఏజెన్సీకి చెందిన క్రెడిట్‌సైట్స్ నివేదిక వెల్లడించడంతో అదానీ షేర్లలో రెండోరోజూ అమ్మకాలు కొనసాగాయి. అదానీ పవర్, అదానీ విల్మర్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ టోటల్ గ్యాస్ షేర్లు వరుసగా 5%, 2%, 2.50%, అరశాతం చొప్పున నష్టపోయాయి.

వీ-మార్ట్‌లో వినాయక చవితి ఆఫర్లు

హైదరాబాద్: ఫ్యాషన్ రిటైల్ సంస్థ వీ-మార్ట్... రాబోయే వినాయక చవితి సందర్భంగా గొప్ప ఆఫర్లు ప్రకటించింది. ఏపీ, తెలంగాణతో సహా ఒడిషా, కర్ణాటక, గోవా, పుణెల్లోని అన్ని వీ-మార్ట్ షోరూంలలో ఈ ఆఫర్లు అందుబాటులో ఉంటాయి. ఆగస్టు 19 నుంచే మొదలైన ఈ పండుగ ఆఫర్లు.. నెలాఖరుదాకా కొనసాగనున్నాయి. రూ.3 వేల కొనుగోలుపై రూ.1,500 డిస్కౌంట్ వోచర్, హెచ్‌డీఎఫ్‌సీ డెబిట్, క్రెడిట్ కార్డులపై 7.5% వరకు తక్షణ డిస్కౌంట్‌లను ఇస్తున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	51,630	▲	209
బంగారం (99.5 స్వచ్ఛత)	51,423	▲	208
వెండి (కిలో)	55,224	▲	224

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-8-2022	
విశాఖ	438–00
చిత్తూరు	463–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	438–00
విజయవాడ	438–00
రిటైల్ ధర (డజను)	66.00
24-8-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	417–00
వరంగల్	418–00
రిటైల్ ధర	4.75

ప్రతి పల్లెలోనూ రాయల్ ఎన్‌ఫీల్డ్


హంటర్‌తో జయప్రదీప్

- సగం స్టోర్లు స్టూడియో రూపంలో
- మిడ్ సెగ్మెంట్లో 85 శాతం వాటా
- కంపెనీ బిజినెస్ హెడ్ జయప్రదీప్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రాయల్ ఎన్‌ఫీల్డ్.. పేరుకు తగ్గట్టే హుందా ఉట్టిపడే ఈ మిడ్ సెగ్మెంట్ బైక్స్‌కు ఇప్పుడు దేశంలో ప్రతీ పల్లెలోనూ కస్టమర్ ఉన్నారు. భారత్‌లో ఏటా కంపెనీ సుమారు 6,00,000 వాహనాలను విక్రయిస్తోంది. ఇందులో 60 శాతం యూనిట్లు ప్రధాన నగరాల్లో అమ్ముడవుతుండగా మిగిలిన 40 శాతం చిన్న నగరాలు, పట్టణాలు, గ్రామాల్లోని వినియోగదార్లకు చేరుతున్నాయని రాయల్ ఎన్‌ఫీల్డ్ ఇండియా, సార్క్ బిజినెస్ హెడ్ వి.జయప్రదీప్ తెలిపారు. 75 శాతం విక్రయ కేంద్రాలు మెట్రోయేతర ప్రాంతాల్లో అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు. సంస్థ మొత్తం అమ్మకాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వాటా 10 శాతం ఉందని వివరించారు. హైదరాబాద్ మార్కెట్లో హంటర్ 350 బైక్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా సాక్షి బిజినెస్ బ్యూరోతో ఆయన మాట్లాడారు.

స్టూడియో ఫార్మాట్‌లో..

సంస్థకు దేశంలో 2,150 విక్రయశాలలు ఉన్నాయని జయప్రదీప్ వెల్లడించారు. 'ఇందులో పట్టణాలు, గ్రామీణ ప్రాంత వినియోగదార్లను దృష్టిలో పెట్టుకుని స్టూడియో ఫార్మాట్‌లో సగం స్టోర్లను తెరిచాం. 600 చదరపు అడుగుల లోపు విస్తీర్ణంలో ఇవి ఉంటాయి. మూడేళ్లలోనే స్టూడియోల సంఖ్య 1,075కు చేరుకుందంటే మెట్రోయేతర ప్రాంతాల్లో బ్రాండ్‌కు ఉన్న ఇమేజ్ అర్థం చేసుకోవచ్చు. అమ్మకాల వృద్ధి 50 శాతం ఉంటే, గ్రామీణ ప్రాంతంలో ఇది ఏకంగా 60 శాతం ఉంది. ఎనిమిది మోడళ్లలో నాలుగు 350 సీసీ సామర్థ్యం గలవి. విక్రయాల్లో 350 సీసీ మోడళ్ల వాటా అత్యధికంగా 80 శాతం ఉంది. 250–750 సీసీ మిడ్ సెగ్మెంట్లో దేశంలో అన్ని కంపెనీలవి కలిపి నెలకు 60,000 బైక్స్ అమ్ముడవుతున్నాయి. ఇందులో రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు 85 శాతం వాటా ఉంది' అని ఆయన వివరించారు.

నెలకు రూ.4,999లతో..

హంటర్‌ను 349 సీసీ ఎయిర్ ఆయిల్ కూల్డ్ సింగిల్ సిలిండర్ జె-సిరీస్ ఇంజన్‌తో రూపొందించారు. 5 స్పీడ్ గేర్ బాక్స్, డిస్క్ బ్రేక్స్, డ్యూయల్ చానెల్ ఏబీఎస్, ఎల్ఈడీ టెయిల్ ల్యాంప్, ప్రీమియం డిజిటల్ అనలాగ్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ పొందుపరిచారు. బరువు 181 కిలోలు. వేరియంట్‌నుబట్టి హైదరాబాద్ ఎక్స్‌షోరూంలో ధర రూ.1,49,900 నుంచి ప్రారంభం. 8రంగుల్లో లభిస్తుంది. నెల వాయిదా రూ.4,999లతో హంటర్‌ను సొంతం చేసుకోవచ్చు. వాయిదా పద్ధతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్స్‌ను కొనుగోలు చేస్తున్న వారి సంఖ్య 55% ఉంది.

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- జనరల్ స్టడీస్ - జాగ్రఫీ

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్‌లలో 420 మెడికల్ ఆఫీసర్ పోస్టులు

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్‌లో(ఏఎఫ్ఎంఎస్).. షార్ట్ సర్వీస్ కమిషన్ మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 420 (పురుషులు–378, మహిళలు–42)
» అర్హత: ఎంబీబీఎస్, పీజీ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 31.12.2022 నాటికి ఎంబీబీఎస్ డిగ్రీ అభ్యర్థులు 30 ఏళ్లు, పీజీ డిగ్రీ అభ్యర్థులు 35 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ, ఫిజికల్ టెస్ట్, మెడికల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 18.09.2022
» వెబ్‌సైట్: www.amcsscentry.gov.in

నిమ్స్, హైదరాబాద్‌లో 200 స్టాఫ్ నర్స్ పోస్టులు

హైదరాబాద్‌లోని పంజాగుట్టలో ఉన్న నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్).. ఒప్పంద ప్రాతిపదికన స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 200
» అర్హత: బీఎస్సీ(నర్సింగ్)/తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 18నుంచి 34 ఏళ్ల వయసు ఉండాలి.
» ఎంపిక విధానం: ఎంట్రెన్స్ పరీక్షలో మెరిట్ ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్, రెండో ఫ్లోర్, ఓల్డ్ ఓపీడీ బ్లాక్, నిమ్స్, హైదరాబాద్–500082 చిరునామకు పంపించాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 06.09.2022
» ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:10.09.2022
» ప్రవేశ పరీక్ష తేది: 18.09.2022
» వెబ్‌సైట్: www.nims.edu.in

సాయ్‌లో 138 హై పెర్ఫార్మెన్స్ అనలిస్ట్ పోస్టులు

న్యూఢిల్లీలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్).. దేశవ్యాప్తంగా ఉన్న నేషనల్ సెంటర్స్ ఫర్ స్పోర్ట్స్ సైన్స్ అండ్ రీసెర్చ్‌లో ఒప్పంద ప్రాతిపదికన హై పెర్ఫార్మెన్స్ అనలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 138
» పోస్టుల వివరాలు:ఫిజియోథెరపిస్ట్–42, స్ట్రెంథ్ -కండిషనింగ్ ఎక్స్‌పర్ట్–42, ఫిజియాలజిస్ట్–13, సైకాలజిస్ట్–13, బయోమెకానిక్స్–13, న్యూట్రిషనిస్ట్–13, బయోకెమిస్ట్–02 తదితరాలు.
» అర్హత: బ్యాచిలర్స్ డిగ్రీ(ఫిజియోథెరపీ/స్పోర్ట్స్–ఎక్స్‌ర్‌సైజ్ సైన్స్/స్పోర్ట్స్ సైన్స్/స్పోర్ట్స్ కోచింగ్–ఎక్స్‌ర్‌సైజ్ సైన్స్/ఫిజికల్ ఎడ్యుకేషన్ /మెడికల్ /హ్యూమన్/స్పోర్ట్స్ అండ్ ఎక్స్‌ర్‌సైజ్ ఫిజియాలజీ/లైఫ్ సైన్స్/బయోలాజికల్ సైన్సెస్/సైకాలజీ/బయోమెకానిక్స్/డైటీషియన్/ఫుడ్ సైన్స్–న్యూట్రిషన్ /బయోకెమిస్ట్రీ/కెమిస్ట్రీ విత్ బయోకెమిస్ట్రీ), పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 45 ఏళ్లకు మించకూడదు.
» జీతం: నెలకు రూ.1,05,000 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: విద్యార్హత, అదనపు విద్యార్హతలు, పని అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:05.09.2022
» వెబ్‌సైట్: sportsauthorityofindia.gov.in

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్సులో 323 ఏఎస్ఐ, హెచ్‌సీ పోస్టులు

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్సులో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్(స్టెనోగ్రాఫర్), హెడ్ కానిస్టేబుల్(మినిస్టీరియల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 323
» పోస్టుల వివరాలు: అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (స్టెనోగ్రాఫర్)–11, హెడ్ కానిస్టేబుల్(మినిస్టీరియల్)–312 తదితరాలు.
» అర్హత: ఇంటర్మీడియట్ లేదా సీనియర్ సెకండరీ స్కూల్ సర్టిఫికేట్(10+2), ఇంగ్లిష్/హిందీ షార్ట్‌హ్యాండ్, టైపింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» జీతం: నెలకు రూ.29,200 నుంచి రూ.92,300 (ఏఎస్ఐ), రూ.25,500 నుంచి రూ.81,100 (హెచ్‌సీ)
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఫిజికల్ మెజర్‌మెంట్, షార్ట్‌హ్యాండ్ టెస్ట్, టైపింగ్ స్పీడ్ టెస్ట్, డాక్యుమెంటేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 06.09.2022
» వెబ్‌సైట్: https://rectt.bsf.gov.in

సాయుధ దళాల్లో.. సబ్ ఇన్‌స్పెక్టర్!

» మొత్తం 4,300 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా ఎంపిక ప్రక్రియ
» ఏదైనా డిగ్రీతో పోటీపడొచ్చు

బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారా.. పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్నారా.. అయితే మీకు మరో చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! సాయుధ దళాలు, ఢిల్లీ పోలీస్ విభాగంలో.. సబ్ ఇన్‌స్పెక్టర్ కొలువు మీ ముంగిట నిలిచింది! కేంద్ర ప్రభుత్వ నియామక సంస్థ .. స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. తాజాగా ఢిల్లీ పోలీస్, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(సీఏపీఎఫ్- కేంద్ర సాయుధ పోలీస్ దళాలు) లో.. సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ)పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ తాజా నోటిఫికేషన్ వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ గైడెన్స్..


ఎస్ఎస్‌సీ పోలీస్ జాబ్స్

తెలుగు రాష్ట్రాల్లో పోలీస్ ఉద్యోగార్థుల సంఖ్య లక్షల్లోనే ఉంటోంది. వీరు డిగ్రీ నుంచే తమ లక్ష్య సాధన దిశగా అడుగులు వేస్తుంటారు. అలాంటి వారికి ఎస్ఎస్‌సీ తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్ మరో చక్కటి అవకాశంగా చెప్పొచ్చు. ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్ ద్వారా ఢిల్లీ పోలీస్‌తోపాటు సీఏపీఎఫ్‌లో మొత్తం 4,300 ఎస్ఐ పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. ఇందులో సీఏపీఎఫ్‌లో 3960 పోస్టులు ఉండగా.. ఢిల్లీ పోలీసు విభాగంలో 340 ఖాళీలు ఉన్నాయి.

అర్హతలు

- విద్యార్హత: ఆగస్టు 30, 2022 నాటికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- వయసు: జనవరి 1, 2022 నాటికి 20–25 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.
- వేతన శ్రేణి: రూ.35,400–రూ.1,12,400

శారీరక ప్రమాణాలు

- ఎస్ఎస్‌సీ ఢిల్లీ పోలీస్, సీఏపీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు విద్యార్హతలు, వయో పరిమితితోపాటు నిర్దేశిత శారీరక ప్రమాణాలు కూడా ఉండాలి.
- పురుష అభ్యర్థులు కనీసం 170 సెంటీ మీటర్లు; మహిళా అభ్యర్థులు 157 సెంటీ మీటర్ల ఎత్తు ఉండాలి. అదే విధంగా పురుష అభ్యర్థులకు నిర్దేశిత ఛాతీ కొలతలు తప్పనిసరి.

మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ

సబ్-ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి ఎస్ఎస్‌సీ మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తుంది. ముందుగా పేపర్–1 పేరుతో రాత పరీక్ష, ఆ తర్వాత ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ పేరిట దేహదారుఢ్య పరీక్షలు, అనంతరం పేపర్–2 పేరుతో మరో రాత పరీక్ష నిర్వహిస్తారు. ఈ మూడు దశల్లోనూ విజయం సాధించి మెరిట్ జాబితాలో నిలిచిన వారికి చివరగా మెడికల్ టెస్ట్ ఉంటుంది. ఆ నివేదిక ఆధారంగా తుది నియామకాలు ఖరారు చేస్తారు.

పేపర్-1 ఇలా

తొలి దశగా నిర్వహించే పేపర్–1ను నాలుగు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 50 ప్రశ్నలు–50 మార్కులు, జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు–50 మార్కులు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 50 ప్రశ్నలు–50 మార్కులు, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ 50 ప్రశ్నలు–50 మార్కులకు పరీక్ష ఉంటుంది. రాత పరీక్ష ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి. పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు.

రెండో దశ ఫిజికల్ ఎండ్యూరెన్స్

పేపర్–1లో నిర్దిష్ట కటాఫ్ మార్కులు సాధించిన వారితో మెరిట్ జాబితా రూపొందిస్తారు. వీరికి రెండో దశలో దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారు. పలు ఫిజికల్ ఈవెంట్లలో అభ్యర్థులు తమ ప్రతిభ చూపాల్సి ఉంటుంది. అవి.. వంద మీటర్లు, 1.6 కిలో మీటర్ల పరుగు పందెం; లాంగ్ జంప్, హై జంప్; షాట్‌పుట్. వంద మీటర్ల పరుగును 16సెకన్లలో, 1.6కిలో మీటర్ల పరుగును 6.5 నిమిషాల్లో పూర్తి చేయాలి. 3.65 మీటర్ల దూరంతో లాంగ్ జంప్ చేయాలి. 1.2 మీటర్ల ఎత్తులో హై జంప్ చేయాలి. 16 ఎల్‌బీస్ బరువును 4.5 మీటర్ల దూరం విసరాలి. హై జంప్, లాంగ్ జంప్, షాట్ పుట్‌లకు సంబంధించి గరిష్ఠంగా మూడు అవకాశాలు ఇస్తారు.

మహిళా అభ్యర్థులకు ఈవెంట్లు ఇలా

వంద మీటర్ల పరుగును 18 సెకన్లలో; 800 మీటర్ల పరుగును నాలుగు నిమిషాల్లో; 2.7 మీటర్ల లాంగ్ జంప్, 0.9 మీటర్ల హై జంప్ ఈవెంట్లు ఉంటాయి. వీరికి కూడా లాంగ్ జంప్, హై జంప్ ఈవెంట్లలో గరిష్ఠంగా మూడు అవకాశాలు ఇస్తారు. అదే విధంగా వీరికి షాట్ పుట్ నుంచి మినహాయింపు ఉంటుంది.

200 మార్కులకు పేపర్-2

- ఫిజికల్ ఈవెంట్లలో విజయం సాధించిన వారికి తదుపరి దశలో పేపర్–2 ఉంటుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్ అనే ఒకే విభాగంలో 200 ప్రశ్నలు–200 మార్కులకు ఈ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.
- పేపర్–1, పేపర్–2 రెండూ ఆబ్జెక్టివ్ విధానంలోనే బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటాయి. ప్రతి తప్పు సమాధానానికి 1/4 మార్కు చొప్పున నెగెటివ్ మార్కింగ్ నిబంధన విధించారు.
- ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే రెండు పేపర్లలోనూ పొందిన మార్కులను నార్మలైజేషన్ విధానంలో క్రోడీకరించి.. నిర్దిష్ట కటాఫ్ నిబంధనల మేరకు మెరిట్ జాబితా రూపొందిస్తారు.

పరీక్షలో విజయానికి

పోలీస్ ఉద్యోగాల అభ్యర్థులు ఎక్కువగా దేహ దారుఢ్యంపైనే కసరత్తు చేస్తుంటారు. కాని రాత పరీక్షలో విజయం కూడా ఎంతో కీలకంగా నిలుస్తోంది.

జనరల్ అవేర్‌నెస్ అండ్ జనరల్ నాలెడ్జ్

అభ్యర్థుల్లోని సామాజిక అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడిగే విభాగం ఇది. ఇందులో రాణించాలంటే.. భారత దేశ చరిత్ర, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, రాజ్యాంగం, శాస్త్రీయ పరిశోధనలు వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్

ఇందులో రాణించేందుకు వెర్బల్, నాన్-వెర్బల్ రీజనింగ్ అంశాలపై పట్టు సాధించాలి. స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్, విజువల్ మెమొరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్, నంబర్ సిరీస్, కోడింగ్–డీకోడింగ్ నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రమ్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో రాణించాలంటే.. ప్యూర్ మ్యాథ్స్‌తోపాటు అర్థ గణిత అంశాలపై దృష్టి పెట్టాలి. డెసిమల్స్, ఫ్రాక్షన్స్, నంబర్స్, పర్సంటేజెస్, రేషియోస్, ప్రపోర్షన్స్, స్క్వేర్ రూట్స్, యావరేజెస్, ప్రాఫిట్ అండ్ లాస్, ఆల్జీబ్రా, లీనియర్ ఈక్వేషన్స్, ట్రయాంగిల్స్, సర్కిల్స్, టాంజెంట్స్, ట్రిగ్నోమెట్రీలపై పట్టు సాధించాలి.

ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ అండ్ లాంగ్వేజ్

పేపర్–1లో మాత్రమే ఉండే ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో రాణించడానికి అభ్యర్థులు.. బేసిక్ గ్రామర్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా యాంటానిమ్స్, సినానిమ్స్, మిస్–స్పెల్ట్ వర్డ్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూటషన్స్, ప్యాసేజ్ కాంప్రహెన్షన్‌లను ప్రాక్టీస్ చేయాలి.

200 మార్కులతో ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ అండ్ లాంగ్వేజ్ పేరుతో నిర్వహించే పేపర్–2లో రాణించడానికి అభ్యర్థులు.. ఫ్రేజెస్, సెంటెన్స్ ఫార్మేషన్, సెంటెన్స్ కంప్లీషన్, ప్రెసిస్ రైటింగ్, వొకాబ్యులరీలపై పట్టు సాధించాలి.

కమాండెంట్ స్థాయికి

సబ్-ఇన్‌స్పెక్టర్‌గా కొలువు దీరిన వారు సర్వీస్ నిబంధనలు, ప్రతిభ ఆధారంగా కమాండెంట్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. తొలుత ఇన్‌స్పెక్టర్‌గా, ఆ తర్వాత అసిస్టెంట్ కమాండెంట్‌గా, అనంతరం డిప్యూటీ కమాండెంట్, కమాండెంట్ హోదాలకు చేరుకునే అవకాశం ఉంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి.
- దరఖాస్తులకు చివరి తేది: ఆగస్టు 30,2022
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: సెప్టెంబర్ 1
- ఆన్‌లైన్ పరీక్ష తేదీ: నవంబర్‌లో
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: గుంటూరు, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, నెల్లూరు, చీరాల, విజయనగరం, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://ssc.nic.in

క్లుప్తంగా

30న ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు నోటిఫికేషన్

సాక్షి, అమరావతి/నూజివీడు/వేంపల్లె: రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీల్లో 2022–23 విద్యా సంవత్సరంలో పీయూసీ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ప్రవేశాల నోటిఫికేషన్‌ను ఈ నెల 30న జారీ చేయనున్నారు. ఈ విషయాన్ని చాన్స్‌లర్ ఆచార్య కేసీ రెడ్డి, వీసీ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి బుధవారం తెలిపారు. అడ్మిషన్ షెడ్యూల్, దరఖాస్తులను తీసుకోవడానికి ఆఖరి తేదీ, కౌన్సెలింగ్ తేదీలు, ఎంపిక విధానం, తరగతులు ప్రారంభ తేదీల సమాచారమంతా 'www.rgukt.in' అందుబాటులో ఉంచనున్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌లో 'ఫ్యాప్సీ' ఆన్‌లైన్ శిక్షణ

సాక్షి, అమరావతి: ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫ్యాప్సీ) ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పై ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సును నిర్వహిస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. సెప్టెంబర్ 6 నుంచి 17 వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణా కార్యక్రమం ఉంటుంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు 80085 79624 లేదా vjwfapcci@gmail.comలో సంప్రదించాలి.

చేతివృత్తులు, హస్తకళాకారుల అభ్యున్నతిలో భాగస్వాములు కావాలి

నాబార్డు సీజీఎం ఎంఆర్ గోపాల్

సాక్షి, అమరావతి: చేతివృత్తులు, హస్తకళాకారుల అభ్యున్నతిలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని నాబార్డు సీజీఎం ఎంఆర్ గోపాల్ కోరారు. హస్తకళలను ప్రోత్సహించే లక్ష్యంతో మార్కెటింగ్‌లో వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై చర్చించేందుకు రాష్ట్రస్థాయి ప్రాంతీయ సలహా కమిటీ సమావేశం బుధవారం విజయవాడలో జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన గోపాల్ మాట్లాడుతూ సూక్ష్మ చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే హస్తకళాకారులు సరైన మార్కెటింగ్ సౌకర్యాల్లేక సతమతమవుతున్నారన్నారు. సంప్రదాయ హస్తకళల్ని పునరుజ్జీవింప చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. చేతి వృత్తుల వారి నైపుణ్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. నాబార్డు జీఎం ఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ హస్తకళాకారులు, చేతివృత్తిదారులకు కనీస వేతనం పొందేలా వారికి మద్దతు నివ్వాలని కోరారు.

నల్లమలలో వాహనదారులకు ఆంక్షలు

పెద్దదోర్నాల: నల్లమల పులుల అభయారణ్యంలో పర్యటించే వారిపై అటవీశాఖ బుధవారం నుంచి కఠిన నియమ నిబంధనలు అమలు చేస్తోంది. యాత్రికులు తమ వాహనాలు ఎక్కడ పడితే అక్కడ ఆపి సేద తీరేందుకు అవకాశం లేదు. అలా చేస్తే ఇకపై రూ.500 జరిమానా విధిస్తారు. అటవీ ప్రాంతంలో రోడ్లపై సంచరించే కోతులకు తినుబండారాలు, పండ్లు అందిస్తే రూ.1,000, అటవీ ప్రాంతంలో ప్రయాణించే వాహనాలు 30 కి.మీ కంటే ఎక్కువ వేగంగా వెళ్తే రూ.500, ధూమపానం, మద్యపానం చేస్తే రూ.1,000 జరిమానా విధిస్తారు.

కదిలిన కేంద్రం

పోలవరం, విభజన సమస్యల పరిష్కారంపై నేడు ఢిల్లీలో కీలక భేటీ



సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారంతోపాటు కేంద్ర జలసంఘం సాంకేతిక సలహా కమిటీ ఆమోదించిన ప్రకారం పోలవరం సవరించిన అంచనా వ్యయం నిధులివ్వడంపై కేంద్రం మరో అడుగు ముందుకేసింది. తాజాగా ఢిల్లీలో ప్రధాని మోదీతో సమావేశం సందర్భంగా ఈ ఏడాది జనవరి 24న అధికారుల కమిటీ చర్చించిన అంశాలను ప్రస్తావించి సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. దీనిపై ప్రధాని మోదీ సానుకూలంగా స్పందిస్తూ ఈ మేరకు తన కార్యాలయ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కార్యాలయం నియమించిన రాష్ట్ర అధికారుల కమిటీతో చర్చించి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని కేంద్ర కమిటీని పీఎంవో ఆదేశించింది. ఈ క్రమంలో గురువారం ఢిల్లీలో కేంద్ర అధికారుల కమిటీతో రాష్ట్ర కమిటీ సమావేశం కానుంది. ఈ సమావేశంలో ప్రస్తావించాల్సిన అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్ నేతృత్వంలో బుధవారం ఢిల్లీలో సన్నాహక సమావేశం జరిగింది. నేడు జరిగే సమావేశం సానుకూలంగా ముగిసే అవకాశం ఉందని, సమస్యల పరిష్కారం కొలిక్కి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని రాష్ట్ర అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ప్రధానితో భేటీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన ప్రధానాంశాలు ఇవీ

- పోలవరం పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన రూ.2,900 కోట్లను వెంటనే రీయింబర్స్ చేయాలి.
- సీడబ్ల్యూసీ టీఏసీ ఖరారు చేసిన మేరకు ప్రాజెక్టు వ్యయం రూ.55,548.87 కోట్ల సవరించిన అంచనాలకు ఆమోదం తెలపాలి. చేసిన పనులకు 15 రోజుల్లోగా రీయింబర్స్ చేసేలా చర్యలు తీసుకోవాలి.
- భూసేకరణ, సహాయ పునరావాస కార్యక్రమాల కింద నిర్వాసితులకు డీబీటీ (నేరుగా నగదు బదిలీ) పద్ధతిలో పరిహారాన్ని అందించాలి.
- రీసోర్స్ గ్యాప్ కింద రాష్ట్రానికి రావాల్సిన నిధులను మంజూరు చేసి ఆదుకోవాలి.
- 2014–15కి సంబంధించిన బిల్లులు, 10వ వేతన సంఘం బకాయిలు, పెన్షన్లు తదితరాల రూపంలో రాష్ట్రానికి ఈ నిధులను రావాల్సి ఉంది.
- జాతీయ ఆహార భద్రతా చట్టం కింద అర్హుల ఎంపికలో హేతుబద్ధీకరణ లేకపోవడం వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కేంద్రం ఇస్తున్న దానికంటే అదనంగా దాదాపు 56 లక్షల కుటుంబాలకు రాష్ట్రమే రేషన్ వ్యయాన్ని భరిస్తోంది. ఏపీకి నిర్దేశించిన కేటాయింపులను పునఃపరిశీలించాలని నీతిఆయోగ్ కూడా సూచించింది.
- తెలంగాణ డిస్కంల నుంచి రూ.6,756 కోట్ల మేర విద్యుత్ బకాయిలు రావాల్సి ఉంది. ఎనిమిదేళ్లుగా ఈ సమస్య అపరిష్కృతంగానే మిగిలింది. బకాయిలు ఇప్పిస్తే కష్టాల్లో ఉన్న రాష్ట్ర విద్యుత్ సంస్థలు గట్టెక్కుతాయి.
- హేతుబద్ధత లేని రాష్ట్ర విభజనతో ఏపీ తీవ్రంగా నష్టపోయింది. విభజన సమయంలో పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీలను కేంద్రం అమలు చేయాలి.
- ప్రత్యేక హోదా సహా ఇతర హామీలను నెరవేర్చాలి. పారిశ్రామిక రంగం వృద్ధి, ఉద్యోగాల కల్పన, కేంద్రం నుంచి గ్రాంట్లు, పన్ను రాయితీలు తదితర ప్రయోజనాలు ప్రత్యేక హోదా ద్వారానే దక్కుతాయి. తద్వారా రాష్ట్రంపై భారం తగ్గుతుంది.
- రాష్ట్రంలో 26 జిల్లాలకు 11 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉన్నాయి. మరో 12 కాలేజీలకు అనుమతులు తక్షణమే మంజూరు చేయాలి.
- కడపలో సమీకృత స్టీల్ ప్లాంట్ కోసం ఏపీఎండీసీకి గనులు కేటాయించాలి. ఏపీఎండీసీకి బీచ్‌శాండ్ మినరల్ ఏరియాలను కేటాయించాలి. 14 ఏరియాలకు కేటాయింపు అంశం ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఈ రంగంలో దాదాపు రూ.20 వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్నందున దీనిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలి.

అలుపెరగని పోరాటం..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 మే 30న ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పోలవరం ప్రాజెక్టుకు 2017–18 ధరల ప్రకారం సవరించిన అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లకు ఆమోదించి, ఆ మేరకు నిధులు ఇవ్వడంతోపాటు విభజన హామీలు, ప్రత్యేక హోదా కోసం అలుపెరగని పోరాటం చేస్తున్నారు. పలు దఫాలు ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తదితరులతో సమావేశమై సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ ఏడాది జనవరి 3న ఢిల్లీలో జరిగిన సమావేశం సందర్భంగా సీఎం జగన్ ప్రస్తావించిన అంశాలపై కేంద్ర అధికారులతో కమిటీని నియమించాలని పీఎంవోను ప్రధాని ఆదేశించారు. జనవరి 10న కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నేతృత్వంలో జల్ శక్తి శాఖ, పౌరసరఫరాల శాఖ తదితర శాఖల కార్యదర్శులతో పీఎంవో కమిటీ ఏర్పాటు కాగా అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ నేతృత్వంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక, జలవనరులు, హోంశాఖ, పౌరసరఫరాల శాఖ కార్యదర్శులు తదితరులతో సీఎంవో కూడా కమిటీని నియమించింది. కమిటీ తొలుత జనవరి 24న ఢిల్లీలో సమావేశమై చర్చించింది. తాజాగా సీఎం జగన్ ఢిల్లీ పర్యటన సందర్భంగా ప్రధానితో ఆయా అంశాలను మరోసారి ప్రస్తావించడంతో కేంద్రంలో కదలిక వచ్చింది.

వార్షికాదాయం రూ.18 వేలు.. 1,605 ఎకరాల్లో మైనింగ్

- త్రిశూల్ పేరుతో టీడీపీ నేత జేసీ బినామీల బాగోతం
- డ్రైవర్లు, క్లీనర్లు, గ్యాస్ కనెక్షన్ లేని వారు, తెల్లరేషన్ కార్డుదారులకు లైమ్‌స్టోన్ లీజులు
- సిమెంట్ ఫ్యాక్టరీ కోసం అనుమతి తీసుకుని ఖనిజం అమ్ముకున్నారు
- అంతా అక్రమమే.. అందుకే రూ.100 కోట్ల పెనాల్టీ
- హైకోర్టుకు నివేదించిన అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి

సాక్షి, అమరావతి: వార్షికాదాయం రూ.18 వేలు కూడా లేని వ్యక్తులు సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామంటూ 1,605 ఎకరాల్లో లైమ్‌స్టోన్ లీజు పొందారని, వీరంతా మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత జేసీ దివాకర్‌రెడ్డి బినామీలని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం హైకోర్టుకు నివేదించింది. త్రిశూల్ సిమెంట్స్ పేరుతో లీజుకు దరఖాస్తు చేసుకున్న వారంతా దివాకర్‌రెడ్డి వద్ద పనిచేసే తెల్లరేషన్ కార్డుదారులు, గ్యాస్ కనెక్షన్ లేనివారు, డ్రైవర్లు, క్లీనర్లు, ఇతర కార్మికులేనని తెలిపింది. 2019కి ముందు టీడీపీ హయాంలో జేసీ దివాకర్‌రెడ్డి, ఆయన అనుచరుల హవా సాగిందని ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తెలిపారు. గడువు లోగా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయకపోవడమే కాకుండా కేటాయించిన భూముల్లో తవ్వేసి ఖనిజాన్ని ఇతరులకు విక్రయించారని చెప్పారు. త్రిశూల్ అంటే జేసీ దివాకర్‌రెడ్డి దృష్టిలో మోసం, అధికార దుర్వినియోగం, అవినీతి అని పేర్కొన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ స్థాపిస్తామంటూ గత ప్రభుత్వ హయాంలో ఎప్పటికప్పుడు కాలపరిమితి, అనుమతులు పొడిగించుకుంటూ వచ్చారని కోర్టు దృష్టికి తెచ్చారు. సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయకుండా ఖనిజ తవ్వకాలు చేపట్టి అమ్ముకున్నందుకు 13.91 లక్షల మెట్రిక్ టన్నులకు నిబంధనల ప్రకారం రూ.100.24 కోట్ల పెనాల్టీ చెల్లించాలని డిమాండ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. అధికారులు నిబంధనల ప్రకారమే వ్యవహరించారని స్పష్టం చేశారు. వాదనలు విన్న హైకోర్టు ఈ వ్యవహారంలో తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అనుమతిస్తేనే తవ్వకాలు చేపట్టాం...

అనంతపురం జిల్లా యాడికి మండలం కోన ఉప్పలపాడు గ్రామంలో లైమ్‌స్టోన్ లీజు పొందిన త్రిశూల్ సిమెంట్స్ పరిమితికి మించి ఖనిజం తవ్వి రవాణా చేయడంపై రూ.100.24 కోట్ల పెనాల్టీ చెల్లించాలని అధికారులు 2020 మే 7న డిమాండ్ నోటీసు ఇచ్చారు. దీన్ని కొట్టేయాలని కోరుతూ ఆ కంపెనీ మేనేజింగ్ పార్ట్‌నర్ షేక్ హుస్సేన్ బాషా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ న్యాయవాది శివరాజు శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ త్రిశూల్ సిమెంట్స్ 2011లోనే రద్దైందని, ప్రస్తుతం అది మనుగడలో లేదన్నారు. అధికారులు అనుమతినిస్తేనే ఖనిజ తవ్వకాలు చేపట్టామన్నారు.

జాతి సంపదను దోచేశారు...

త్రిశూల్ సిమెంట్స్ అక్రమాలపై మొదటి నుంచి పోరాటం చేస్తున్న తాడిపత్రికి చెందిన ఇంప్లీడ్ పిటిషనర్ మురళీప్రసాద్‌రెడ్డి న్యాయవాది పీఎస్ రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ త్రిశూల్ అక్రమాలపై తాము దాఖలుచేసిన పిల్‌పై హైకోర్టు ధర్మాసనం ఉత్తర్వులు జారీచేశాకే ప్రభుత్వం లీజును రద్దు చేసిందన్నారు. లక్షల టన్నుల లైమ్‌స్టోన్ తవ్వి జాతి సంపదను దోచుకున్నారని తెలిపారు. గతంలో అదే ప్రాంతంలో లీజు పొందిన కంపెనీలు భూ ఉపరితలంలో ఉన్న కొండలను తవ్వితే త్రిశూల్ మాత్రం భూమి లోపలి ఖనిజాలను తరలించిందని అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి నివేదించారు. కంపెనీ రద్దైందని చెబుతూనే ఆ కంపెనీ పేరుమీదే ఇన్నాళ్లూ గడువు పొడిగించుకుంటూ వచ్చారన్నారు. ఈ వ్యవహారాన్ని ధర్మాసనానికి పంపాలా? తానే విచారించాలా? అనే అంశంపై నిర్ణయం తీసుకుంటానని పేర్కొంటూ తదుపరి విచారణను న్యాయమూర్తి వాయిదా వేశారు.

తెలంగాణలోనూ 'ఆర్బీకే' తరహా సేవలు!

- అధ్యయనం కోసం నేడు ఏపీకి తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి
- ఆర్బీకే, అగ్రి ల్యాబ్, సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ తదితరాలను పరిశీలించనున్న మంత్రి

సాక్షి, అమరావతి: రైతు భరోసా కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సేవలను పరిశీలించేందుకు తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం గురువారం ఏపీలో పర్యటించబోతోంది. తెలంగాణ వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి నేతృత్వంలోని ఈ బృందం.. గుంటూరు జిల్లాలోని ఆర్బీకే, ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్, మినుము ప్రాసెసింగ్ యూనిట్, అరటి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించనుంది. మంత్రి నిరంజన్‌రెడ్డి గతంలో కూడా ఏపీలోని పలుప్రాంతాల్లో పర్యటించి ఆర్బీకేల ద్వారా గ్రామ స్థాయిలో రైతులకు అందిస్తోన్న సేవలను పరిశీలించారు. తెలంగాణలో కూడా ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌తో పాటు ఆర్బీకే చానల్ తరహాలో ఓ అగ్రి చానల్‌ను ప్రారంభిస్తామని నిరంజన్‌రెడ్డి అప్పట్లో ప్రకటించారు. అలాగే ఆర్బీకేల్లోని కియోస్క్‌లను తెలంగాణలోని రైతు వేదికల్లో కూడా అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వాటిని ఏర్పాటు చేసేందుకు ప్రస్తుతం కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ మంత్రి నిరంజన్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరు జిల్లా కొల్లిపర మండలం వల్లభాపురం చేరుకొని.. అరటి వ్యవసాయక్షేత్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడుతారు. అనంతరం తెనాలిలో వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్‌ను సందర్శిస్తారు. తర్వాత అంగలకుదురులోని ఆర్బీకేను పరిశీలించి రైతులతో సమావేశమవుతారు. ఏటుకూరు సమీపంలోని బొంతపాడు రోడ్‌లో ఉన్న మినుము సీడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తారు.

పాతికేళ్లలో 11 మందికి పాము కాట్లు

- ఒకే కుటుంబంలో ఐదుగురి మృత్యువాత
- కర్ణాటకలోని ఓ గ్రామంలో వింత



పాముకాటు బాధిత కుటుంబం

తుమకూరు : ఒకే కుటుంబానికి చెందిన 11 మందికి పాము కాట్లు.. వారిలో ఐదుగురి మృత్యువాత.. ఇలా చనిపోయిన వారంతా పురుషులే.. ఈ విషయం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లా కొరటగెరె తాలూకా తొగరిఘట్ట గ్రామంలో ధర్మణ్ణ కుటుంబంలో ప్రతి నాలుగైదేళ్లకు ఒకరు పాము కాటుకు గురవుతున్నారు. గడిచిన 20–25 ఏళ్లలో పాముల కాటుతో ధర్మణ్ణ ఉమ్మడి కుటుంబంలో ఆయనతో పాటు హనుమంతప్ప, వెంకటేశ్, శ్రీనివాస్, ఇటీవల గోవిందరాజు మరణించారు. గత బుధవారం రాత్రి గోవిందరాజు పొలంలో నీరు పెడుతుండగా పాము కాటుకు గురయ్యాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే ప్రాణాలు విడిచాడు. చనిపోయిన వారంతా దాదాపు ఒకే ప్రదేశంలో పాము కాట్లకు గురయ్యారు. ధర్మణ్ణ ఒక రోజు తన పొలం వద్ద ఉన్న ఒక పెద్ద చెట్టును ఉన్నపళంగా నరికేశాడు. ఆ చెట్టు శాపమే ప్రస్తుతం ఈ మరణాలకు కారణమని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. అయితే ఆ చెట్టు ఆ తర్వాత కాలంలో మళ్లీ చిగురించి చెట్టుగా ఎదిగింది. పాము పగ పోవాలని గ్రామస్తులు స్థానిక మునియప్ప ఆలయంలో నిత్య పూజలు చేపట్టారు.

5 లక్షల ఎకరాల్లో చిరుధాన్యాల సాగు

- హెక్టార్‌కు రూ.6 వేలు ప్రోత్సాహకం
- వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఈ ఏడాది కనీసం ఐదు లక్షల ఎకరాల్లో చిరుధాన్యాలు సాగుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ చెప్పారు. చిరుధాన్యాల సాగుకు హెక్టార్‌కు రూ.6 వేల చొప్పున ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. ఆయన బుధవారం గుంటూరులోని కమిషనరేట్ నుంచి జిల్లా వ్యవసాయ శాఖాధికారులు, సహాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మిల్లెట్ పాలసీకి అనుగుణంగా రాష్ట్రంలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రంలో చిరుధాన్యాల సాగును విస్తరించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలో చిరుధాన్యాలతో పాటు అపరాలు, నూనెగింజల సాగుకు అపారమైన అవకాశాలున్నాయని చెప్పారు. అందుకు తగినట్టుగా రైతులను ప్రోత్సహించాలని కోరారు. ఎంపిక చేసిన జిల్లాల్లో ఈ నెల 26వ తేదీ నుంచి సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. రైతుల ఈ–కేవైసీ నమోదును ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని పీఎంఎఫ్‌బీవైతో అనుసంధానించి అమలు చేస్తున్నందున ఈ–క్రాప్ నమోదు చాలా ముఖ్యమని చెప్పారు. గడువులోగా నూరుశాతం పూర్తిచేయాలని ఆయన సూచించారు.


ఏపీ పీసెట్ ఫలితాలు విడుదల



ఏపీ పీసెట్ ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ రాజశేఖర్, సుధీర్ ప్రేమ్‌కుమార్, జాన్సన్, వరప్రసాదమూర్తి తదితరులు

ఏఎన్‌యూ : రాష్ట్ర వ్యాప్తంగా బీపీఈడీ, యూజీడీపీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి ఇటీవల ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన ఏపీ పీసెట్ – 2022 ఫలితాలను బుధవారం ఏఎన్‌యూ వీసీ, ఏపీపీసెట్ ఆచార్య పి.రాజశేఖర్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఆచార్య బి.సుధీర్‌ప్రేమ్‌కుమార్ విడుదల చేశారు. ఏపీ పీసెట్‌కు 1,394 మంది హాజరుకాగా 1,356 మంది కౌన్సెలింగ్‌కు అర్హత సాధించారు. వీరిలో పురుషులు 974 మంది, మహిళలు 382 మంది ఉన్నారు. ఫలితాలను http://cetr.aprche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా పొందొచ్చు. త్వరలో కౌన్సెలింగ్ తేదీలు ప్రకటిస్తారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ కరుణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గోతో వేగవంతమైన సేవలు: ఎండీ



ఆర్టీసీ కార్గో బుకింగ్స్ చేస్తున్న ఎండీ ద్వారకా తిరుమలరావు

సాక్షి, అమరావతి: ఆర్టీసీ కార్గో సర్వీసు ద్వారా వేగవంతమైన సేవలు అందిస్తున్నట్టు సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఆర్టీసీ కార్గో ప్రచార మాసోత్సవం ముగింపు సందర్భంగా ఆయన బుధవారం 26 జిల్లాల ప్రజారవాణా అధికారులతోపాటు నాలుగు జోన్ల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లకు 'ఫ్యామిలీ విజ్డమ్' పుస్తకాన్ని డోర్ డెలివరీ విధానంలో పంపించారు. ప్రతి అధికారికి ఆ పుస్తకం గొప్పతనాన్ని వివరిస్తూ.. అటు ఉద్యోగ ధర్మాన్ని, ఇటు కుటుంబ బాధ్యతలను సమపాళ్లలో నిర్వర్తిస్తూ ఉండాలని ఆకాంక్షిస్తూ ఉత్తరం జత చేశారు. మాసోత్సవాల్లో భాగంగా కార్గో వృద్ధికి ప్రతి ఆర్టీసీ ఉద్యోగి ? డోర్ డెలివరీ బుకింగ్స్ చేయాలని సూచించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో చివరిరోజు ఎండీ 30 డోర్ డెలివరీ బుకింగ్స్ చేయడం విశేషం. కార్యక్రమంలో జోన్–2 (విజయవాడ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, కృష్ణాజిల్లా ప్రజారవాణా అధికారి దానం తదితరులు పాల్గొన్నారు. కార్గోలో ప్రవేశ పెట్టిన యూపీఐ చెల్లింపుల విధానాన్ని ఈ సందర్భంగా ఎండీ పరిశీలించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.